

2

అభిషేక్ మను సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవం

తెలంగాణ నుంచి ఎంపీగా రాజ్య సభలోకి

కాంగ్రెస్ ఖాతాలో మరో బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 28-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 151 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 1.20 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మృగశిర మ. 3.53 తదుపరి ఆర్ద్ర వర్జ్యం: రా. 12.33-2.12; దుర్ముహూర్తం: ఉ. 11.51-12.40; అమృతఘడియలు: ఉ. 6.59-8.36; రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.28 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కవితకు బెయిల్

ఢిల్లీ మద్యం కేసులో మంజూరు చేసిన సుప్రీం.. తిహాడ్ జైలు నుంచి విడుదల

కవిత పాత్రపై ఈడీ, సీబీఐల దర్యాప్తు ముగిసింది.. ఈ కేసు విచారణ ఇప్పట్లో పూర్తి కాదు

అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నామన్న ధర్మాసనం.. ఈడీ, సీబీఐల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు

అపూర్వరీతిలో ఇష్టానుసారం ఎంపిక చేసుకుంటారా?.. ఇతరులను నిందితులుగా వదిలేస్తారా?

పీఎంఎల్ఏ సెక్షన్ 45(1) విషయంలో ఢిల్లీ హైకోర్టు తీర్పు పూర్తిగా తప్పుదోవపట్టింది

మహిళలకు ఇచ్చే మినహాయింపు ఉన్నత విద్యావంతురాలైతే వర్తించదా?

ఆ తీర్పు అమలైతే ఇక చదువుకున్న వారికి బెయిల్ దొరకదు.. ఆ తీర్పును కొట్టేస్తున్నాం: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అయిదు నెలలకు పైగా తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు విముక్తి లభించింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి నమోదైన మనీలాండరింగ్, అవినీతి కేసుల్లో ఆమెకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. విచారణ సందర్భంగా.. కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీల తీరును అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. నిందితుల్లో ఇష్టానుసారంగా కొందరిని ఎంపిక చేసుకొని అప్రూవర్లుగా మార్చుకోవటం ఏమిటని ప్రశ్నించింది. అలాగే, మనీలాండరింగ్ నిరోధక

మిగతా 14వ పేజీలో...

జైలు నుంచి బయటకు వచ్చాక.. కుమారుణ్ని హత్తుకొని కవిత కంటతడి



బిడ్డా.. ఎట్లున్నవ్?

కుమార్తెకు ఫోన్‌లో కేసీఆర్ పలకరింపు

నేడు హైదరాబాద్‌కు రానున్న కవిత 14

మాకూ టైం వస్తది

వడ్డీతో సహా చెల్లిస్తాం!: కవిత

కాంగ్రెస్, బీఆర్ఎస్ క్విడ్‌ప్రోకో

ఆ రెండు పార్టీల సమిష్టి కృషితోనే కవితకు బెయిల్: బండి సంజయ్

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే: పొన్నం 14

న్యాయం గెలిచింది: కేటీఆర్

బండి వ్యాఖ్య కోర్టు ధిక్కరణే అని ధ్వజం



సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి దామోదర, సీఎస్ శాంతికుమారి

17 నుంచి ప్రజాపాలన

రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా

పది రోజులపాటు దరఖాస్తుల స్వీకరణ

హెల్త్‌కార్డుల ద్వారానే ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్

అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ వెల్లడి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రవ్యాప్తంగా నివారణ చర్యలు చేపట్టండి

ఉదాసీనంగా వ్యవహరించే వారిపై సస్పెన్షన్

గోషామహల్‌లో ఉస్మానియా నూతన ఆస్పత్రి

32 ఎకరాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో!

50 ఏళ్ల అవసరాలు దృష్టిలో పెట్టుకొని డిజైన్లు

ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనాన్నీ పరిరక్షిద్దాం

ఏడాదిలో 15 కొత్త నర్సింగ్ కాలేజీ భవనాలు

ఇరవై రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకూ..

'స్పీడ్' పనులపై సమీక్షలో సీఎం నిర్ణయాలు

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సెప్టెంబరు 17 నుంచి పది రోజులపాటు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసేందుకు ఈసారి ప్రజాపాలన కార్యక్రమం చేపడతామని సీఎం చెప్పారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి? ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి? వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించాలా? రాష్ట్రంలో ఉన్న లేబొరేటరీల సాయం తీసుకోవాలా? తదితర అంశాలపై పరిశీలన చేసి నిర్ణయాలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ

మిగతా 12వ పేజీలో...

నాలా కబ్జా చేసి కట్టారు

'జన్వాడ ఫాంహౌస్'పై బీఆర్ఎస్ హయాంలోనే అధికారుల నివేదిక

బుల్కాపూర్ నాలాపైనే ప్రధాన గేటు..

బఫర్‌జోన్‌లో ప్రహరీగోడ, 13 గుంటలు

నివేదికను తొక్కిపెట్టిన నాటి ప్రభుత్వం

ఫామ్‌హౌస్ పరిశీలనకు హైడ్రా అధికారులు

కబ్జాలో ఉన్న విద్యా సంస్థలకు టైం ఇస్తాం

ఆలోగా యాజమాన్యాలే ఆక్రమణలను తొలగించాలి

లేని పక్షంలో సెలవుల్లో మేమే చర్యలు తీసుకుంటాం

పేదల ఇళ్లు, చిన్న గృహాలను కూల్చబోం: రంగనాథ్

హైడ్రా ముందుకు వేల సంఖ్యలో ఫిర్యాదులు

ఫాక్ సాగర్‌ను పరిశీలించిన కమిషనర్ రంగనాథ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

జన్వాడ ఫామ్‌హౌస్‌ను బుల్కాపూర్ నాలాను ఆక్రమించి నిర్మించారన్న ఆరోపణలో వాస్తవం ఉన్నట్లు వెల్లడైంది. అదీ సాక్షాత్తూ బీఆర్ఎస్ హయాంలోనే తెలిసింది. ఈ ఫామ్‌హౌస్‌కు వెళ్లే ప్రధాన రహదారి గేటును బుల్కాపూర్ నాలాపైనే నిర్మించారు. దీనిపై అప్పట్లో అప్పటి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతోనే అధికారులు సంయుక్త సర్వే జరిపి 2020 జూన్ 20వ తేదీన ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఫామ్‌హౌస్‌కు ఆనుకుని ఉన్న బుల్కాపూర్ నాలా కబ్జాకు గురైనట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కురిసే వాన నీరు బుల్కాపూర్ నాలా ద్వారా ఉస్మాన్‌సాగర్‌లోకి వెళ్తుంది. ఈ నాలా గతంలో 18 నుంచి 20 మీటర్ల వెడల్పుతో ఉండేదని.. కబ్జాల కారణంగా క్రమేణా కుచించుకుపోయిందని అధికారులు



సదరు నివేదికలో తెలిపారు. అలాగే ఈ నాలాకు రెండు వైపులా 9 మీటర్ల చొప్పున బఫర్‌జోన్ ఉంటుందని, ఈ లెక్కల ప్రకారం చూస్తే.. ఫామ్‌హౌస్ లోపల సుమారు 13 గుంటల స్థలం బఫర్‌జోన్‌లోనే ఉందని పేర్కొన్నారు. ఫామ్‌హౌస్ ప్రహరీగోడను నాలాతోపాటు బఫర్‌జోన్‌లో నిర్మించారని నివేదికలో స్పష్టం చేశారు. అయితే

మిగతా 12వ పేజీలో...



ఆపరేషన్ మూసీ!

12 వేల కుటుంబాల తరలింపు

సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం

నిరాశ్రయులకు పక్కా ఇళ్లు

తరలింపు వేళ ప్రత్యేక ఆర్థిక సాయం

పట్టా భూములున్న వారికి పరిహారం

టీడీఆర్ బాండ్లు, ఉపాధి అవకాశాలు

ఇప్పటికే పూర్తైన ఇంటింటి సర్వే

నిధుల కోసం రుణం 13

ఎన్నికల నాటికి ప్రాజెక్టు పూర్తి!

డెంగీ కట్టడికి కంట్రోల్ రూమ్

ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రోజురోజుకూ సీజనల్ వ్యాధులు పెరుగుతుండటం.. ముఖ్యంగా డెంగీ తీవ్రత ఎక్కువగా ఉండటంతో దాని కట్టడిపై రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ కంట్రోల్ రూమ్ ప్రజారోగ్య సంచాలకుడి ఆధ్వర్యంలో పని చేస్తుందని నిర్దేశించారు. సీజనల్ వ్యాధుల కట్టడి పై మంత్రి దామోదర ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల కట్టడిపై ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. డెంగీ కట్టడిపై వైద్యశాఖలోని అన్ని విభాగాధిపతులు జిల్లాలను పర్యటించి నివేదికలు సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సర్కారీ ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు సాధారణ బదిలీల తర్వాత కొందరు వైద్యులు బదిలీ అయిన చోట చేరలేదని, అటువంటి వారంతా తక్షణమే విధుల్లో చేరాలని మంత్రి దామోదర ఆదేశించారు.

రాష్ట్రాన్ని వణికిస్తున్న విష జ్వరాలు

వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇద్దరి మృతి 2

మహబూబ్‌నగర్ జిల్లాలో అతిసారతో ప్రాణాలు కోల్పోయిన వృద్ధుడు



సర్జరీ జరిగిన తీరు..

కంటి గుండా మెదడుకు సర్జరీ

'ఎండోస్కోపిక్ లాటరల్ ట్రాన్స్ ఆర్బిటల్' విధానంలో మెదడులో కణితి తొలగింపు

ఏఐజీ న్యూరో సర్జరీ వైద్యుల ఘనత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మెదడులో కణితిని తొలగించాలంటే.. పుర్రె భాగానికి కోత పెట్టాలి! కానీ.. మెదడులో కణితితో బాధపడుతున్న 54 ఏళ్ల మహిళకు ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు ఓ అరుదైన శస్త్రచికిత్సతో ఉపశమనం కలిగించారు! ఆమె కనుబొమ కింద భాగంలో గాటు పెట్టి.. ఆ మార్గం గుండా శస్త్రచికిత్స చేసి మెదడులో కణితిని

మిగతా 3వ పేజీలో...

ఫ్లాట్ల విలువ 15-30% పెంపు!

సాగు భూములు, ప్లాట్ల విలువ 100% పెంచే యోచన

రాష్ట్రవ్యాప్తంగా విలువల పెంపు ఖాయం!

ప్రాథమిక కసరత్తు పూర్తి చేసిన సర్కారు

స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అమల్లోకి?

ఏటా శాస్త్రీయంగా పెంచాలని నిర్ణయం!

2023-24లో రిజిస్ట్రేషన్ శాఖ రాబడిలో

ఫ్లాట్ల నుంచే రూ.5,115 కోట్లు

మొత్తం ఆదాయంలో ఇది 35.1 శాతం!

ఆ తర్వాత స్థలాల నుంచి 22 శాతం



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల విలువలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై ఇప్పటికే స్పష్టతకు వచ్చిన సర్కారు.. ప్రాథమికంగా పెంచిన విలువల్లో శాస్త్రీయత ఉండేలా చూసేందుకు ఏజెన్సీ, అధికార బృందాల ద్వారా అధ్యయనాలు చేపట్టింది. రాష్ట్రంలో ఏటా భూముల విలువ పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. ఈ విధానం శాస్త్రీయంగా ఉండాలని అధికారులకు సూచించారు. అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల ధరలను ఆయా ప్రాంతాలను బట్టి 15-30 శాతం, స్థలాల విలువను వంద శాతం వరకు పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే

మిగతా 2వ పేజీలో...



కలరాకు ఓరల్ టీకా

హిల్‌కాల్ పేరుతో విడుదల.. 14 రోజుల వ్యవధిలో 2 సార్లు తీసుకుంటే చాలు 2

20 కోట్ల టీకాల ఉత్పాదక సామర్థ్యం

భారత్ బయోటెక్ ఈడీ కృష్ణ ఎల్లా వెల్లడి

మాఫీ ప్రక్రియ మధ్యలో ఉంది

వారం పదిరోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి

రేషన్‌కార్డు లేని రైతులను గుర్తిస్తాం 13

మరో 18వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తాం.. మంత్రి తుమ్మల వెల్లడి

శిశు విహార్ కేంద్రంలో కలెక్టర్ కుమార్తె

కుమ్రం భీం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ఆదర్శం



శిశు విహార్ కేంద్రంలో కూతురిని చేర్పించిన అనంతరం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే 12

పాత కార్లు 'తుక్కు'కిస్తే.. కొత్త వాటిపై కిక్కు!


పాత వాహనాల స్ర్కాప్ సర్టిఫికెట్ తీసుకెళ్తే.. 2

కొత్త వాహనాల ఎక్స్‌షోరూం ధరపై డిస్కౌంట్

ప్రయాణికుల వాహనాలపై 1.5% లేదా రూ.20వేలు

వాణిజ్య వాహనాలపై 3 శాతం వరకు తగ్గింపు

కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీలో కంపెనీల అంగీకారం



'అమ్మ' అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా

మీటూ ప్రకంపనలు

నటి రేవతీసంపత్ పై పోలీసులకు ఫిర్యాదు చేసిన సిద్ధిఖీ 10

స్వలాభం కోసం మీడియా అజ్యం పోస్తోంది: సురేశ్ గోపి

విద్యార్థుల ర్యాలీతో రణరంగంలా కోల్‌కతా

మమత రాజీనామాకు డిమాండ్.. వేలాదిగా పోలీసుల మోహరింపు

గాల్లోకి కాల్పులు, లాఠీచార్జ్.. నేడు బెంగాల్ బంద్‌కు బీజేపీ పిలుపు

జగన్ అండతో సజ్జన్ బచ్‌గయా!

ముంబైలో సజ్జన్ జిందాల్‌పై నటి రేప్ కేసు

ఆమెను దారికి తెచ్చేందుకు ఏపీలో కేసు 12

'కౌంటర్ కేసు' వ్యూహంలో సజ్జల పాత్ర!?

ఆగమేఘాల మీద ముంబై వెళ్లి నటి అరెస్టు

తల్లిదండ్రులనూ అరెస్టు చేసి చిత్ర హింసలు

రాజీకి అంగీకరించాకే ఆమె బెయిలుపై విడుదల



వేతన సవరణ అమలు చేయని 18 రాష్ట్రాల సీఎస్‌లు సుప్రీంలో హాజరు

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణ సంఘం చేసిన సిఫార్సుల మేరకు విశ్రాంత న్యాయాధికారులకు పెన్షన్ బకాయిలు, పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించనందుకు 15 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శు(సీఎస్)లు మంగళవారం సుప్రీంకోర్టుకు హాజరయ్యారు. వీరిలో ఏపీ సీఎస్ నీరభ్‌కుమార్ కూడా ఉన్నారు. పలు రాష్ట్రాలు వేతన సంఘం సిఫార్సులను అమలు చేయడం లేదంటూ ఆల్ ఇండియా జడ్జెస్ అసోసియేషన్ 2015లో కోర్టును ఆశ్రయించింది. దీనిపై అఫిడవిట్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అఫిడవిట్లు దాఖలు చేయకపోతే తమ ఆదేశాలను ఉల్లంఘించినట్టేనని హెచ్చరించింది. అయినప్పటికీ 15 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు వేతన సంఘం సిఫార్సులను అమలు చేయడం లేదని అమికస్ క్యూరీ కె.పరమేశ్వర్ కోర్టుకు తెలిపారు. దీంతో ఆయా రాష్ట్రాల సీఎస్‌లు కోర్టుకు హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. కాగా, ఇలా అధికారులను కోర్టుకు పిలిపించడం తమకు కూడా ఇష్టం లేదని, కానీ ఆయా రాష్ట్రాల న్యాయవాదులు కూడా తరచూ విచారణకు గైర్హాజరు కావడంతో పిలిపించక తప్పలేదని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది.

తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించి..

కేంద్రం నోటిఫికేషన్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, ఆగస్టు 27: తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించి.. 'డ్రగ్స్ అండ్ మ్యాజికల్ రెమెడీస్(అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) యాక్ట్ (డీఎంఆర్ యాక్ట్)లోని 170వ నిబంధనను తొలగిస్తూ కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. తమ ఔషధానికి అద్భుతసామర్థ్యం ఉందంటూ మందుల కంపెనీలు వాణిజ్య ప్రకటనలు ఇవ్వడాన్ని నిషేధిస్తూ పెట్టిన నిబంధన అది. అంత కీలకమైన నిబంధనను తొలగిస్తూ ఆయుష్ మంత్రిత్వ శాఖ గత ఏడాది అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ లేఖ రాసింది. ఆ నిబంధన ఎందుకు తొలగించారంటూ ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కానీ, కేంద్రం సుప్రీం అభ్యంతరాలను పట్టించుకోకుండా.. జూలై 1న ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నోటిఫికేషన్.. ఈ ఏడాది మే 7న తామిచ్చిన ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా ఉందని జస్టిస్ హిమ కోహ్లి, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది.

కనీస పింఛను రూ.7500కు పెంచాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 27: పింఛనుదారుల సంఘం ఈపీఎస్-95 జాతీయ ఆందోళన కమిటీ(ఎన్‌ఏసీ) ప్రతినిధులు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) అధికారులతో సమావేశమయ్యారు. విశ్రాంత ఉద్యోగులకు కనీస పింఛను నెలకు రూ.7500 ఇవ్వాలని ఈపీఎస్-95 సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తోంది. అలాగే ఈపీఎస్ సభ్యులు, వారి జీవిత భాగస్వాములకు పూర్తి మెడికల్ కవరేజీ కల్పించాలని కోరుతున్నట్లు ఈపీఎస్-95 ఎన్‌ఏసీ తెలిపింది. సమస్యలపై చర్చించేందుకు రావాలంటూ ఈపీఎఫ్‌వో నుంచి ఆహ్వానం అందినట్లు ఈపీఎస్-95 ఎన్‌ఏసీ అధ్యక్షుడు అశోక్ రౌత్ తెలిపారు. పింఛనుదారుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం జరిగిన సమావేశంలో కోరినట్లు చెప్పారు. ఈపీఎస్ సభ్యులకు ప్రస్తుతం నెలకు రూ.1450 పింఛను ఇస్తున్నారని.. దాన్ని రూ.7500కు పెంచాలని ఎనిమిదేళ్లుగా పోరాడుతున్నట్లు వెల్లడించారు.

60% మంది లక్షాధికారులు 150 జిల్లాల్లోనే

న్యూఢిల్లీ, ఆగస్టు 27: దేశంలోని సగానికిపైగా(60%) లక్షాధికారులు కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమయ్యారు. వార్షికాదాయం రూ.5 లక్షలకు మించి ఉన్నవారు 150 జిల్లాల్లోనే(మొత్తం జిల్లాలో 20%) నివసిస్తున్నారు. మ్యాప్ మై ఇండియా సహకారంతో క్లారిటీ ఎక్స్ అనే సంస్థ జరిగిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. జిల్లా సామర్థ్య సూచీ (డిస్ట్రిక్ట్ పొటెన్షియల్ ఇండెక్స్-డీపీఐ) పేరుతో ఆ సంస్థ మంగళవారం నివేదిక విడుదల చేసింది. దేశంలో 788 జిల్లాలు ఉండగా డీపీఐ స్కోర్‌లో బెంగళూరు అర్బన్ ప్రథమ స్థానం, హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నాయి.

కోల్‌కతా రణరంగం



ఛలో సెక్రటేరియేట్‌కు ఛాత్రసమాజ్ పిలుపు.. భారీగా తరలివచ్చిన విద్యార్థులు

- మమత రాజీనామాకు డిమాండ్
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- గాల్లోకి కాల్పులు.. పలువురికి గాయాలు
- నేడు బెంగాల్ బంద్‌కు బీజేపీ పిలుపు

కోల్‌కతా, ఆగస్టు 27: కోల్‌కతా నగర వీధులు మంగళవారం రణరంగంలా మారాయి. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ మంగళవారం హౌరా నుంచి నిర్వహించిన నబన్నా అభియాన్(ఛలో సెక్రటేరియేట్) ర్యాలీ హింసాత్మకంగా మారింది. సీఎం మమతాబెనర్జీ రాజీనామా డిమాండ్‌తో విద్యార్థులు నిర్వహించిన ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. బ్యారికేడ్లను విద్యార్థులు తొలగించకుండా ఉండేందుకు పోలీసులు వాటికి గ్రీజ్ రాస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముందు జాగ్రత్తగా నలుగురు విద్యార్థులను సోమవారం రాత్రే అదుపులోకి తీసుకున్న పోలీసులు.. సచివాలయానికి దారితీసే మార్గాల్లో 6 వేల మందితో భారీ బందోబస్తు నిర్వహించారు. డ్రోన్లతో పరిస్థితిని అంచనా వేశారు. ర్యాలీ, నియంత్రణ వంటి అంశాలపై పర్యవేక్షణకు ప్రభుత్వం 26 జిల్లాల కలెక్టర్లను నియమించింది. ముఖ్యంగా.. ఎంజీరోడ్, హేస్టింగ్స్ రోడ్, సంత్రాగచి, హౌరా మైదాన్, హౌరా బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. విద్యార్థులు బ్యారికేడ్లను బద్ధలుకొట్టి, పోలీసులను తోసుకుంటూ ముందుకు దూసుకెళ్లారు. పోలీసులపై రాళ్లు, ఇటుకలను విసిరారు. ఈ ఘటనలో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరుపుతూ.. లాఠీచార్జ్ చేశారు. వాటర్‌కెనాన్, టియర్‌గ్యాస్‌ను ప్రయోగించారు. ఈ ఘటనల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారు.




ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్; విద్యార్థుల దాడిలో గాయపడ్డ పోలీసు

విద్యార్థుల ముందస్తు అరెస్టులు

నబన్నా అభియాన్ ర్యాలీకి పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ పిలుపునివ్వగా.. రవీంద్ర భారతి వర్సిటీ విద్యార్థి ప్రబీర్ దాస్, కల్యాణి వర్సిటీకి చెందిన శుభంకర్ హల్దార్, రవీంద్ర ముక్త వర్సిటీకి చెందిన సాయన్ లహరి ముందుండి నడిపించారు. అయితే.. సోమవారం రాత్రే పోలీసులు నలుగురు కీలక విద్యార్థి నేతలను అరెస్టు చేయడంతో బీజేపీ నేత సువేందు అధికారి ఎక్స్‌లో వరుస ట్వీట్లు చేశారు. "అర్ధరాత్రి నుంచి నలుగురు కీలక విద్యార్థులు అదృశ్యమయ్యారు" అని పేర్కొన్నారు. దీనికి కోల్‌కతా పోలీసులు స్పందిస్తూ.. ఎవరూ మిస్సింగ్ అవ్వలేదని సమాధానమిచ్చారు. దానికి సువేందు ప్రతిస్పందిస్తూ.. "అయితే.. విద్యార్థుల కుటుంబాలు కోర్టులు ఆశ్రయించాయి. మమత పోలీసులారా.. కోర్టులో కలుద్దాం" అని ట్వీట్ చేశారు. కాగా.. విద్యార్థుల ర్యాలీ బీజేపీ-ఆరెస్సెస్ ప్రేరేపితమని వామపక్ష నాయకురాలు బృందా కరాట్ తీవ్ర విమర్శలు చేశారు. కాగా, విద్యార్థుల ర్యాలీపై పోలీసుల లాఠీచార్జ్‌ని నిరసిస్తూ బీజేపీ బుధవారం 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా బీజేపీ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ మాట్లాడుతూ.. విద్యార్థులపై పోలీసుల దాడి దారుణమన్నారు.

లోకం తీరు



కెనడాలో విదేశీ విద్యార్థులపై

బహిష్కరణ కత్తి

70 వేల మందికి పైగా పొంచి ఉన్న ముప్పు

దేశవ్యాప్తంగా విద్యార్థుల శిబిరాలు, ర్యాలీలు

టొరంటో, ఆగస్టు 27: కెనడాలో చదువుతున్న విదేశీ విద్యార్థులు ప్రస్తుతం బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ విధానాల్లో మార్పుల కారణంగా 70వేల మందికి పైగా అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థులు త్వరలో దేశాన్ని వదిలి వెళ్లాల్సి ఉంటుంది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. స్టడీ పర్మిట్లను పరిమితం చేస్తూ, శాశ్వత నివాస నామినేషన్లను తగ్గించాలని ట్రూడో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఇప్పుడు విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ఇళ్ల కొరత, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం కోసమే స్టడీ పర్మిట్లలో కోత విధించినట్లు ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు తక్కువ వేతనాలకు ఉద్యోగాలు చేస్తున్న తాత్కాలిక విదేశీ కార్మికుల సంఖ్యను కూడా తగ్గిస్తున్నట్లు ప్రధాని ట్రూడో తాజాగా ప్రకటించడం అగ్గి రాజేసింది.

వచ్చే ఏడాది జూలైలో తానా సభలు

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 24వ మహాసభలను వచ్చే ఏడాది జూలై మొదటి వారంలో డెట్రాయిట్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మహాసభలకు కోఆర్డినేటర్‌గా ఉదయ్ కుమార్ చాపలమడుగు, చైర్మన్‌గా గంగాధర్ నాదెళ్ల నియమితులైనట్లు తానా కార్యదర్శి రాజా కసుకుర్తి పేర్కొన్నారు. 2005, 2015లోనూ డెట్రాయిట్‌లోనే తానా మహాసభలు నిర్వహించారు. ఆ ఆనవాయితీకి కొనసాగింపుగా 2025 మహాసభలను సైతం అక్కడే నిర్వహించాలని నిర్ణయించారు. డెట్రాయిట్ తెలుగు కమ్యూనిటీకి దగ్గరగా ఉండడమే కాకుండా వచ్చిన అతిథులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు బాగుంటుందని రాజా తెలిపారు.

కలరాకు ఓరల్ టీకా

హిల్‌కాల్ పేరుతో అందుబాటులోకి తీసుకువచ్చిన భారత్ బయోటెక్

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వ్యాక్సిన్ దిగ్గజ కంపెనీ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ తాజాగా కలరాకు ఓరల్ టీకాను అందుబాటులోకి తీసుకువచ్చింది. 'హిల్‌కాల్' పేరుతో మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. ఈ టీకాను 14 రోజుల వ్యవధిలో రెండుసార్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఏడాది వయసు దాటిన పిల్లలు మొదలు.. వృద్ధుల వరకు అందరూ దీన్ని తీసుకోవచ్చు. అమెరికాకు చెందిన హిల్లేమాన్ లాబొరేటరీస్ వారి నుంచి లైసెన్స్ తీసుకుని.. దీన్ని అభివృద్ధి చేశారు. టీకా ఆవిష్కరణ సందర్భంగా భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 4.5 కోట్ల డోసులను ఉత్పత్తి చేసే ప్లాంట్ ఉందని, రాబోయే కొద్ది నెలల్లో భువనేశ్వర్‌లో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. దాంతో.. 20 కోట్ల డోసులను ఉత్పత్తి చేసే సామర్థ్యం తమకు ఉంటుందన్నారు. "2030 నాటికి కలరా రహిత ప్రపంచమే లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పనిచేస్తోంది. మేము కూడా ఆ లక్ష్యంలో భాగస్వాములమవుతాం" అని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 10 కోట్ల కలరా టీకాల డిమాండ్ ఉందని, అయితే.. 4 కోట్ల డోసుల లోటు కొనసాగుతోందని వివరించారు.

పాత కార్లు 'తుక్కు'కిస్తే..

కొత్త వాటిపై కిక్కు!



- పాత వాహనాల స్క్రాప్ సర్టిఫికెట్ తీసుకెళ్తే కొత్త వాహనాలపై డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఆగస్టు 27: పండగ రోజుల్లో కొత్త కారు కొనుక్కోవాలనుకునే వారికి శుభవార్త. పాత కార్లను తుక్కు కింద ఇచ్చేసి, ఆ సర్టిఫికెట్ తీసుకెళ్తే.. కొత్త కార్లపై డిస్కౌంట్ అందించనున్నట్లు ఆటోమొబైల్ కంపెనీలు వెల్లడించాయి. పాత వాహనాలకు 'సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్'ను తీసుకొచ్చిన వినియోగదారులకు కొత్త వాహనాలపై 1.5 నుంచి 3 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపాయి. మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 'భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘాని (సియామ్)'కి చెందిన పలువురు సీఈవోలతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. కొత్త వాహనాలపై డిస్కౌంట్లు అందజేసేందుకు కంపెనీల ప్రతినిధులు అంగీకరించారు. ప్రయాణికుల వాహనాలపై ఏడాది పాటు, వాణిజ్య వాహనాలపై రెండేళ్ల పాటు ఈ డిస్కౌంట్లు అందించేందుకు తయారీదారులు అంగీకరించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. కార్లకు స్క్రాప్ సర్టిఫికెట్ తీసుకొచ్చిన వారికి కొత్త కార్ల ఎక్స్ షోరూం ధరపై 1.5 శాతం లేదా రూ.20 వేలు.. ఏది తక్కువైతే అది అందజేస్తారు. ఇక టాటా మోటార్స్, అశోక్ లే లాండ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఫోర్స్ వంటి వాణిజ్య వాహనాల తయారీ సంస్థలు.. 3.5 టన్నుల కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన రవాణా వాహనాల ఎక్స్ షోరూం ధరపై 3% వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. డిస్కౌంట్లు అందించేందుకు అంగీకరించిన వాహన తయారీ సంస్థలకు గడ్కరీ అభినందనలు తెలిపారు. వాహనాల ఆధునికీకరణ కార్యక్రమంలో భాగస్వాములైన కంపెనీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వణికిస్తున్న విష జ్వరాలు

వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇద్దరి మృతి

తొర్రూరు రూరల్/ నర్సంపేట టౌన్/ హన్వాడ, ఆగస్టు 27: రాష్ట్రంలో విష జ్వరాలు దడ పుట్టిస్తున్నాయి. జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరం బారిన పడి మంగళవారం వరంగల్ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థితోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ 58 ఏళ్ల వ్యక్తి మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా వెంకటాపురం గ్రామ పరిధిలోని కేవుల్లా తండాలో బానోత్ లచ్చిరామ్(58) అనే వ్యక్తి వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు జ్వరం ఎక్కువ కావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోన్న అర్జున్(17) 3రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. సోమవారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మరోవైపు, మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని కొనగట్టుపల్లిలో వెంకటయ్య(72) అతిసారతో ప్రాణాలు వదిలాడు.

ఎన్‌సీసీ అధికారుల నిర్లక్ష్యం..

వైద్యవిద్య కౌన్సెలింగ్‌లో జాప్యం

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో వైద్యవిద్య కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీట్‌లో అర్హత సాధించిన ఎన్‌సీసీ అభ్యర్థులకు వైద్యవిద్య ప్రవేశాల్లో గ్రేస్ మార్కులను కేటాయిస్తారు. దాంతో అప్పటిదాకా ఉన్న వారి నీట్ ర్యాంక్ మారుతుంది. దాని కోసం వారు అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలను ఎన్‌సీసీ డైరెక్టరేట్ వెరిఫై చేయాల్సి ఉంటుంది. ఈ నెల 14న దరఖాస్తు ప్రక్రియ ముగిసిన వెంటనే హెల్త్ వర్సిటీ అధికారులు ఎన్‌సీసీ అభ్యర్థుల ధ్రువపత్రాలను రాష్ట్ర ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు పంపారు. వారు అభ్యర్థులు అప్‌లోడ్ చేసిన ఎన్‌సీసీ సర్టిఫికేట్లను తమ దగ్గర ఉన్న వివరాలతో సరిపోల్చి హెల్త్ యూనివర్సిటీకి తిరిగి పంపాలి. అయితే ఆగస్టు 27 వరకు వారు ఆ ప్రక్రియను పూర్తిచేయలేదు. మంగళవారం కన్వీనర్ కోటా అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన హెల్త్ యూనివర్సిటీ, ఎన్‌సీసీ అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఇంకా పూర్తవకపోవడంతో గ్రేస్ మార్కులు కలపలేదని వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశముంది.

రైల్వే బోర్డు చైర్మన్‌గా సతీష్ కుమార్

ఆ పదవి చేపట్టనున్న తొలి దళిత అధికారి



న్యూఢిల్లీ, ఆగస్టు 27: రైల్వే బోర్డు చైర్మన్-సీఈఓగా ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసు(ఐఆర్ఎంఎస్) అధికారి సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ పదవి చేపట్టనున్న తొలి ఎస్సీ అధికారి ఆయనే కావడం విశేషం. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జయ వర్మ సిన్హా ఈ నెల 31న పదవీ విరమణ చేసిన అనంతరం సతీష్ కుమార్ ఆ బాధ్యతలు చేపట్టనున్నారు. సతీశ్ ప్రస్తుతం ఆయన రైల్వే బోర్డు మెంబర్(ట్రాక్షన్-రోలింగ్ స్టాక్)గా ఉన్నారు.

ఫ్లాట్ల విలువ 15-30% పెంపు!

(మొదటి పేజీ తరువాయి)



ఈ ప్రతిపాదనలను స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే అమల్లోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. భూముల విలువ అమాంతం పెంచితే రియల్ ఎస్టేట్ మార్కెట్ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కొనుగోలుదారులకు, నిర్మాణదారులకు ఇబ్బంది లేకుండా శాస్త్రీయంగా మదింపు చేసి.. ఏ వర్గానికీ ఇబ్బంది లేకుండా విలువలు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి పదేపదే అధికారులకు సూచిస్తున్నారు. ఆదాయాన్ని తెచ్చిపెట్టే మార్గాలను అన్వేషించడంతోపాటు కొత్త తలనొప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ప్రస్తుతం చదరపు అడుగు ఫ్లాట్ ధర రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువ ప్రకారం నగరాల్లో సగటున రూ.3200 ఉంటే దీన్ని 30 శాతం మించకుండా పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం రూ.3200 ఉన్న చదరపు అడుగు ధరకు అదనంగా మరో రూ.960 పెంచి రూ.4160 చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ప్రాంతాలను బట్టి ఈ విలువల్లో మార్పులు ఉంటాయి. చదరపు అడుగు రూ.1800 ఉన్న ప్రాంతాల్లో రూ.2500 దాటకుండా జాగ్రత్తలు తీసుకునేలా కసరత్తు చేస్తున్నారు. హైదరాబాద్ లాంటి చోట్ల చదరపు అడుగు రూ.10 వేలకు పైగా ఉంది. బ్యాంకు లోన్ల కోసం ఈ మొత్తం అధికారికంగా చూపుతున్న వారూ ఉన్నారు. అయితే ఇంత భారీగా పెంచితే క్యాపిటల్ గెయిన్, ఇతర పన్నులతో నిర్మాణ రంగం కుదేలయ్యే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయనుంది.

సాగు భూముల విలువలు రెట్టింపు?

వ్యవసాయ భూములు, స్థలాల విషయంలో ఇప్పుడున్న పుస్తక విలువను సవరించి వంద శాతం పెంచాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. గజం ధర రూ.1000 ఉంటే దాన్ని రూ.2 వేలకు పెంచాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఉదాహరణకు శేరిలింగంపల్లి రెండు రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో ఉంది. అక్కడ ప్రస్తుతం స్థలాల విలువ రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువ ప్రకారం గజం ధర రూ.26,700 ఉంది. దీన్ని రూ.50-60 వేల వరకు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. మహేశ్వరం లాంటి చోట్ల ఇప్పుడు ఉన్న విలువ రూ.3200ను రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు పెంచాలని భావిస్తోంది. మరోవైపు రిజిస్ట్రేషన్ శాఖ మొత్తం ఆదాయంలో స్థలాల నుంచి 22 శాతం వస్తోంది. తమిళనాడులో 2012లో పెంచిన విలువలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారు. 2017లో అక్కడ భూముల విలువ పెంచగా ప్రజావ్యతిరేకత రావడంతో 2012 నాటి విలువలనే అమలు చేస్తున్నారు. తెలంగాణలో చివరిసారిగా 2021లో భూముల విలువలు పెంచారు.

ఈ ఏడాది లక్ష్యం రూ.18 వేల కోట్లు

ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని తెచ్చే శాఖల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్లది మూడో స్థానం. దీంతో ఈ శాఖలో ఏటా భూముల విలువలను పెంచేలా శాస్త్రీయ విధానాలను రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.14588 కోట్ల ఆదాయాన్ని సముపార్జించగా, 2024-25లో రూ.18,229 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు రూ.6080 కోట్లు ఆర్జించింది. ఇక ప్రభుత్వానికి వస్తున్న రాబడిలో క్రయవిక్రయాలకు సంబంధించి అత్యధికంగా ఫ్లాట్ల ద్వారా సమకూరుతోంది. 2023-24లో ఫ్లాట్ల అమ్మకాల ద్వారా రూ.5,115 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం రాబడిలో ఇది 35.1 శాతం. స్థలాల ద్వారా రూ.3322 కోట్లు, ఇళ్ల ద్వారా రూ.2838 కోట్లు, వ్యవసాయ భూములకు రూ.1668 కోట్లు, నాన్ రిజిస్టర్డ్ లావాదేవీల ద్వారా రూ.1645 కోట్ల ఆదాయం వచ్చింది.


2023-24లో ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి..

డాక్యుమెంట్	ఆదాయం	శాతం
ఫ్లాట్స్	రూ.5,115 కోట్లు	35.1
ప్లాట్స్	రూ. 3,322 కోట్లు	22.8
ఇళ్లు	రూ.2,838 కోట్లు	19.5
వ్యవసాయ భూములు	రూ.1668 కోట్లు	11.4
నాన్-రిజిస్టర్	రూ.1645 కోట్లు	11.3
మొత్తం	రూ.14,588 కోట్లు	

● 2023-24లో మొత్తం 18,26,039 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా వాటి నుంచి, నాన్ రిజిస్ట్రేషన్ రెవెన్యూ ఆదాయం మొత్తం రూ.14,588.06 కోట్లు వచ్చింది.

అభిషేక్ సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవం

తెలంగాణ నుంచి ఎంపీగా రాజ్యసభలోకి



హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఏఐసీసీ నేత, ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన తరఫున టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్.. మంగళవారం రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకున్నారు. కాంగ్రె‌స్‌లో చేరిన కె.కేశవరావు.. బీఆర్ఎస్ నుంచి సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ ఈ నెల 19న నామినేషన్ వేశారు. శాసనసభలో ప్రాతినిధ్యం కలిగి ఉన్న బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం సహా ఏ పార్టీ నుంచీ నామినేషన్ దాఖలు కాలేదు. అయితే స్వతంత్ర అభ్యర్థిగా ఓ వ్యక్తి నామినేషన్ దాఖలు చేసినా.. స్క్రూటినీలో ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదంతో అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో బీఆర్ఎస్ మరో సిటింగ్ సీటు కాంగ్రెస్ ఖాతాలో చేరింది. ఫిబ్రవరిలో తెలంగాణ నుంచి 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగగా.. సంఖ్యా బలాన్ని బట్టి రెండు సీట్లు కాంగ్రెస్‌కు, ఒక సీటు బీఆర్ఎస్‌కు దక్కాయి. కాంగ్రెస్ నుంచి రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్.. బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య, సంతోష్‌కుమార్, వద్దిరాజు రవిచంద్రల సభ్యత్వాల గడువు ముగియడంతో ఈ ఎన్నికలు జరిగాయి. ఇందులో రవిచంద్ర సీటును నిలబెట్టుకున్న బీఆర్ఎస్.. లింగయ్య, సంతోష్ సీట్లను కోల్పోయింది. ఈ 2సీట్లతో పాటుగా అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవ ఎన్నికతో మొత్తం మూడు బీఆర్ఎస్ సిటింగ్ సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

రాజ్యసభకు 12 మంది ఏకగ్రీవం

న్యూఢిల్లీ, ఆగస్టు 27: రాజ్యసభకు జరిగిన ఉప ఎన్నికల్లో మంగళవారం 12 మంది పోటీ లేకుండా నెగ్గారు. వీరిలో తొమ్మిది మంది సభ్యులు కావడం గమనార్హం. మరో ఇద్దరు ఎన్డీఏ కూటమి సభ్యులు కాగా, మరొకరు కాంగ్రెస్ అభ్యర్థి. ఎన్డీఏ కూటమికి చెందిన ఎన్సీపీ (అజిత్ పవార్), రాష్ట్రీయ లోక్ మంచ్‌కు చెందిన అభ్యర్థులు ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభలో ఎన్డీఏ మెజార్టీ మార్కును చేరుకున్నట్టయింది. ప్రస్తుతం రాజ్యసభలో సభ్యుల బలం 237 కాగా, మెజార్టీ సాధించాలంటే 119 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. నామినేటెడ్ సభ్యులతో కలిపి ఎన్డీఏ ఈ సంఖ్యను చేరుకుంది. తాజాగా బీజేపీ సొంత బలం 96కు చేరుకుంది. మిత్రపక్షాలైన ఎన్డీఏ కూటమిని లెక్కిస్తే సభ్యుల బలం 112 అవుతుంది. ఆరుగురు నామినేట్ సభ్యులు, ఒక ఇండిపెండెంట్ సభ్యుడుని కలుపుకొంటే మొత్తం బలం 119కు చేరుకుంటుంది. మరోవైపు విపక్షాల బలం 85కు చేరింది.

ఎస్సీ గురుకులాల్లో

మానసిక ఉల్లాస తరగతులు!

బ్రహ్మకుమారీస్ సంస్థతో ఒప్పందం

- సెప్టెంబరు 5 నుంచి అక్టోబరు 26 వరకు టీచర్లకు శిక్షణ
- త్వరలో విద్యార్థులకు హెల్త్ ప్రొఫైల్
- గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ గురుకులాల విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే సైకాలజీ తరగతులు ఎట్టకేలకు మళ్లీ ప్రారంభం కాబోతున్నాయి. విద్యార్థులకు సైకాలజీ తరగతులను బోధించేందుకు హైదరాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ సంస్థతో ఒప్పందం చేసుకోనున్నట్లు ఎస్సీ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి చెప్పారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గురుకులాల పరిధిలోని విద్యార్థుల్లో ఆందోళనను తగ్గించి, ఆత్మహత్యలను అరికట్టేందుకు వారికి అవగాహన కల్పించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బ్రహ్మకుమారీస్ సంస్థతో సెప్టెంబరు 2న ఒప్పందం చేసుకుంటామన్నారు. సెప్టెంబరు 5 నుంచి అక్టోబరు 26 వరకు ఉపాధ్యాయులకు రంగారెడ్డి జిల్లాతో పాటు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇక గురుకులాల్లోని విద్యార్థులకు బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే తరగతులు 15 రోజులకోసారి ఉంటాయన్నారు. ఈ తరగతుల్లో ప్రధానంగా ధ్యానం, మోటివేషన్, ఆందోళన నుంచి బయటపడడం.. తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 5వ తరగతి విద్యార్థులు తొలిసారి గురుకులానికి రావడంతో వారు కొంత ఆందోళన చెందుతున్నారన్నారు. అలాంటి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఎక్కువగా కలిసేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఎస్సీ గురుకులాల్లో ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో స్టూడెంట్ కౌన్సెలింగ్ సెల్‌లు మూతపడ్డాయని, అదే విధంగా సైకాలజీ సెల్‌లోని ఉద్యోగులను బదిలీ చేసి, వారి స్థానంలో ఎవరినీ భర్తీ చేయలేదని పేర్కొంటూ.. 'సైకాలజీ సెల్‌కు చెల్లుచీటీ' శీర్షికన ఈ నెల 26న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మంగళవారం గురుకులాల కార్యదర్శి ఈ వివరాలు వెల్లడించారు.

భోజన నాణ్యతకు మెస్ కమిటీలు..

గురుకుల విద్యార్థులకు అందించే భోజనం విషయంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వర్షిణి చెప్పారు. రోజూ పిల్లలకు పెట్టే భోజనం ఎలా ఉంటుంది? మెనూ ప్రకారం అందుతుందా? లేదా? అనే వివరాలు తెలుసుకోవడానికి అధికారులు, పిల్లలతో కలిపి 'మెస్ కమిటీ'ని ఏర్పాటు చేశామని తెలిపారు. రోజూ అందించిన భోజన వివరాలను డైరీలో నమోదు చేయడంతో పాటు కమిటీ సభ్యులు అందులో సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లోని గురుకుల విద్యార్థుల్లో రక్తహీనత సమస్య ఉందని, అందుకోసం పిల్లల హెల్త్ ప్రొఫైల్‌ను తయారు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లోని వైద్యులతో మాట్లాడుతున్నామన్నారు. హెల్త్ ప్రొఫైల్ తయారైన తర్వాత వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన పోషకాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో పాటు గురుకులాల పరిధిలో ఒక హెల్త్ కమాండ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మరోవైపు, ఎస్సీ గురుకులాల్లో కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటి మరమ్మతులకు దాదాపు రూ.60 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని వర్షిణి తెలిపారు. అదే విధంగా ఈ నెల 29న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమీక్ష ఉందని, అందులో ఎస్సీ గురుకులాల ప్రస్తుత పరిస్థితి, తీసుకోవాల్సిన చర్యలు, డైట్ చార్జీలపై చర్చ ఉంటుందని చెప్పారు. కాగా 5వ తరగతి అడ్మిషన్ల వ్యవహారం కొలిక్కి వచ్చిందని, సెప్టెంబరు మొదటి వారం నాటికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు.


దక్షిణాఫ్రికాలో పాఠ్య పుస్తకంగా 'తెలుగు బడి'!

- తెలుగు విద్యార్థుల కోసం బాలవాచకం
- రచయిత కరీంనగర్ జిల్లా వాసి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 27: ఖండాంతరాల్లోనూ తెలుగు భాష వెలుగులు విరాజిల్లుతోంది. తన ప్రభను చాటుతోంది. దక్షిణాఫ్రికాలోని ఓ పాఠశాలలో 'తెలుగు బడి' బాల వాచకాన్ని అక్కడి తెలుగు విద్యార్థుల కోసం పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. దక్షిణాఫ్రికాలో స్థిర పడిన వారు ఏర్పాటు చేసుకున్న తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు, రచయిత కూకట్ల తిరుపతి ఈ 'తెలుగు బడి' బాల వాచకాన్ని రచించారు. ఆధునిక పద్ధతిలో శాస్త్రీయ విధానం, సాంకేతికను జోడించి తిరుపతి ఈ పుస్తకాన్ని రూపకల్పన చేశారు. తక్కువ రోజుల్లోనే సులువుగా తెలుగును చదవడం, రాయడం నేర్చుకునేలా పాఠాలున్నాయి. ఇందులో సరళ, గుణింత, ద్విత్వాక్షర, సంయుక్తాక్షర, సంశ్లేషాక్షర పదాలు పొందుపరిచి తెలిసిన విషయం నుంచి తెలియని విషయం వైపుగా బోధన జరిగేట్లు ప్రణాళికాబద్ధంగా వివరించారు. పుస్తకంలోని పాఠాల వద్ద క్యూఆర్ కోడ్ ఇవ్వడంతో విద్యార్థులకు ఇంటర్‌నెట్ ద్వారా ఈ పుస్తకంలోని పాఠాలు అందుబాటులో ఉంటాయి. జాతీయాలు, పొడుపు కథలు, సామెతల వివరాలను పొందుపరిచారు. ఇది తెలుగు సంస్కృతిని చాటేలా ఉండటంతో దక్షిణాఫ్రికా తెలుగువారు దీనిని తమ పిల్లలకు బోధించేందుకు పాఠ్యాంశంగా ఎంపిక చేసుకున్నారు.



కూకట్ల తిరుపతి,



తెలుగు బడి బాల వాచకం

వరంగల్ బల్దియాలో రాజముద్ర రగడ

- ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఫ్లెక్సీలో సరికొత్త చిహ్నం
- కొత్త అధికారిక చిహ్నం ఎక్కడిదని కేటీఆర్ ట్వీట్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 27: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. ఎల్ఆర్ఎస్ విషయంలో సందేహాల నివృత్తికై కార్పొరేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి కార్యాలయ ఆవరణలో ఓ ఫ్లెక్సీ కట్టారు. అయితే అందులో తెలంగాణ రాజముద్రకు బదులు.. ప్రభుత్వం ఇంకా ఆమోదించని.. వార్తల్లో ప్రచారంలో ఉన్న చిహ్నాన్ని ముద్రించారు. విషయం మాజీ మంత్రి కేటీఆర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. కాకతీయ తోరణం, చార్మినార్ లేని రాజముద్రను ఎవరు, ఎప్పుడు ఆమోదించారని మండిపడ్డారు. అసలు ఏం జరుగుతుందో మీకైనా తెలుసా..? అని సీఎస్‌ను ప్రశ్నించారు. అధికారుల తప్పిదాన్ని గుర్తించిన బీఆర్ఎస్ నాయకులు బల్దియా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. దీంతో మంగళవారం పాత ఫ్లెక్సీని తొలగించి తెలంగాణ అధికారిక చిహ్నంతో కూడిన కొత్త ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ కట్టించిన బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారికి ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



వరంగల్ బల్దియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



మృతి చెందిన ఆవులు

అక్రమంగా తరలిస్తుండగా... ఊపిరాడక 6 ఆవుల మృతి

- వాహనంలో 48 గోవులు
- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో ఘటన

తిమ్మాపూర్, ఆగస్టు 27: అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఓ లారీని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్‌ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి మండలం గోరేగావ్ నుంచి హైదారాబాద్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎంహెచ్ 34 బీజీ 8497 నంబర్ లారీని తనిఖీ చేయగా అందులో ఆవులు కనిపించాయి. వాటిని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి లారీని స్వాధీనం చేసుకుని ఆవులను ఎల్ఎండీలోని గోశాలకు తరలించారు. లారీలో 48 ఆవులు ఉండగా.. ఊపిరి ఆడక ఆరు వాహనంలోనే మృతి చెందాయి. చాలా ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. పోలీసులు పశు వైద్య శాఖ సిబ్బందిని పిలిపించి చికిత్స అందించారు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఇమ్రాన్, సొహైల్, షాహిద్, తుకారాం, లారీ డ్రైవర్ ఫయాజ్‌అలీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యారేజీల వైఫల్యానికి కారణాలేంటి?

స్థలాలు పరిశీలించకుండానే డిజైన్లు చేశారా?.. డిజైన్లు సిద్ధం చేయాలని ఆదేశించింది ఎవరు?

- సీడీవో ఇంజనీర్లపై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలు
- ఐదుగురు అధికారుల క్రాస్ ఎగ్జామినేషన్
- రాష్ట్ర ప్రజల కన్నీళ్లు తుడవడానికే కాళేశ్వరం
- ప్రాజెక్టును కమీషన్ల కోసం కట్టలేదు: వి.ప్రకాశ్

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల వైఫల్యంపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. మంగళవారం నీటిపారుదలశాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో)లో పని చేసిన, పదవీ విరమణ చేసిన ఇంజనీర్లను కమిషన్ ప్రశ్నించింది. ఇదివరకే అఫిడవిట్లు దాఖలు చేసిన ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఈ సందర్భంగా.. బ్యారేజీల వైఫల్యానికి కారణాలేంటి? డిజైన్లు సిద్ధం చేసిన తర్వాత అన్నారం, సుందిళ్ల నిర్మాణ ప్రదేశాలను ఎందుకు మార్చారు? సైట్‌లు మార్చిన తర్వాత తదనుగుణంగా డిజైన్లు/డ్రాయింగ్‌లలో మార్పులు చేయలేదా? అని ప్రశ్నించింది. అన్నారం బ్యారేజీ డిజైన్లను ఎవరు సిద్ధం చేశారని మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరేందర్‌ను కమిషన్ ప్రశ్నించగా.. డిజైన్లు/డ్రాయింగ్‌లు ఏఈఈలు తయారు చేస్తారని, వాటిని డీఈఈ పరిశీలించాక.. తదుపరి అనుమతి కోసం తమ వద్దకు వస్తాయని బదులిచ్చారు. హైపవర్ కమిటీ ఆదేశాలతో డిజైన్లు సిద్ధం చేశామని అఫిడవిట్‌లో చెప్పారు కదా? ఆ కమిటీలో ఎవరున్నారు? అని ప్రశ్నించగా.. ఎవరున్నారో తెలియదన్నారు. డిజైన్, డ్రాయింగ్‌లు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించగా.. సైట్ సర్వే, జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్స్, పర్యావరణ పరిస్థితుల ఆధారంగా డిజైన్లు, డ్రాయింగ్‌లు సిద్ధం చేస్తామని నరేందర్ బదులిచ్చారు.

డిజైన్లలో ఎలాంటి లోపాల్లేవు..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ డిజైన్లలో లోపాల్లేవని, వందశాతం భారతీయ ప్రమాణాల (ఐఎస్) కోడ్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ)కి లోబడి ఎల్ అండ్‌టీ ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో తయారు చేసిందని కాళేశ్వరం ఎస్ఈ, సీడీవో మాజీ ఈఈ హెచ్.బస్వరాజ్ తెలిపారు. డిజైన్లు/డ్రాయింగ్‌లు పూర్తిగా ప్రమాణాలకు లోబడి ఉన్నాయని గుర్తించే.. వాటిని ఆమోదించినట్లు పేర్కొన్నారు. బ్యారేజీ నిర్మిత ప్రాంతాన్ని పరిశీలించిన తర్వాత డిజైన్లు సిద్ధం చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా.. స్థలాన్ని పరిశీలించలేదని, క్షేత్రస్థాయి అధికారులిచ్చిన డేటా ఆధారంగా డిజైన్లు సిద్ధం చేశామని బదులిచ్చారు. బ్యారేజీల మార్పు నిర్ణయం ఎవరిదని ప్రశ్నించగా.. ఆ నిర్ణయం రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తీసుకున్నదేనని చెప్పారు. అన్నారం, సుందిళ్లను మార్చినా మేడిగడ్డను ప్రతిపాదిత నిర్మాణ ప్రదేశంలోనే కట్టారని తెలిపారు. బ్యారేజీల వైఫల్యానికి డిజైన్లు కారణమా? అని కమిషన్ ప్రశ్నించగా.. డిజైన్లు వందశాతం కచ్చితత్వంతో ఉన్నాయని, వైఫల్యానికి డిజైన్లు ఎంత మాత్రం కారణం కాదని బస్వరాజ్ స్పష్టం చేశారు. మేడిగడ్డ కుంగిన తర్వాత ఆ ప్రాంతాన్ని పరిశీలించామని, అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కటాఫ్‌లు దెబ్బతిన్నట్లు గుర్తించామని తెలిపారు. కాగా, మేడిగడ్డ బ్యారేజీ పునాది (రాఫ్ట్) కింద ఇసుక జారిందని, సీకెంట్ పైల్స్‌లో లోపాలు, కటాఫ్ హారిజాంటల్, వర్టికల్ డైరెక్షన్‌ల మార్పుల వల్ల బ్యారేజీ కుంగిందని సీడీవో ఎస్ఈ ఎం.సత్యనారాయణరెడ్డి చెప్పారు. 2డీ, 3డీ, మోడల్ స్టడీస్‌ల ప్రాముఖ్యమేంటి? డిజైన్లు, డ్రాయింగ్‌లను వీటి ఆధారంగానే మొదలుపెట్టారా? అని కమిషన్ ఆరా తీయగా.. మోడల్ స్టడీస్, ప్రాథమిక వివరాల ఆధారంగా స్ట్రక్చరల్ డ్రాయింగ్‌లు సిద్ధం చేశామని బదులిచ్చారు.



క్రాస్ ఎగ్జామినేషన్‌కు వెళ్తున్న బస్వరాజ్, నరేందర్, ఎం.సత్యనారాయణరెడ్డి

అఫిడవిట్‌లో పేర్కొని.. కట్టుబడి ఉండకపోతే ఎలా?

అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలకు కట్టుబడి ఉండకపోతే ఎలా? అని సీడీవో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ కె.దయాకర్‌రెడ్డిని కమిషన్ ప్రశ్నించింది. "బ్యారేజీలు నిల్వల కోసం కాదు.. నీటి మళ్లింపు కోసం కట్టాలి. రిజర్వాయర్లు నీటి నిల్వ కోసం కట్టాలి. కానీ, కాళేశ్వరంలోని బ్యారేజీలను నిల్వల కోసం కట్టినందువల్లే ఆ బ్యారేజీలు విఫలమయ్యాయి" అని ఉటంకిస్తూ రాసిన లేఖలోని అంశాలను అఫిడవిట్‌లో దయాకర్‌రెడ్డి ప్రస్తావించడంపై కమిషన్ ప్రశ్నించగా.. ఆయన సమాధానం దాటవేశారు. అన్నారం బ్యారేజీ డిజైన్‌లలో మార్పులు ఏమైనా జరిగాయా? అని ప్రశ్నించగా.. ఫిష్ ప్యాసేజ్ లెవల్‌లో మార్పులు జరిగాయని చెప్పారు. అన్నారం బ్యారేజీలో ఏమేమి గుర్తించారని ప్రశ్నించగా.. సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయని, డౌన్‌స్ట్రీమ్ అప్రాన్ అదనంగా పెట్టాలని సిఫారసు చేశామని తెలిపారు. ఇక అన్నారం, సుందిళ్ల డిజైన్లను రామగుండం ఈఎన్‌సీ ఇచ్చిన డేటా ఆధారంగా సిద్ధం చేశామని సీడీవో మాజీ ఎస్ఈ తరిగొప్పుల రాజశేఖర్ అన్నారు. దిగువ శ్రేణిలో ఉన్న డిప్యూటీ ఈఈ, ఈఈలు పరిశీలించిన తర్వాత తదుపరి పరిశీలన కోసం తమ వద్దకు వస్తాయని తెలిపారు.

ప్రజల కన్నీళ్లు తుడిచేందుకే కాళేశ్వరం..

కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల కోసం కట్టలేదని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ(టీడబ్ల్యూఐడీసీ) మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ చెప్పారు. రాష్ట్ర ప్రజల కన్నీళ్లు తుడవడానికే ప్రాజెక్టును నిర్మించినట్లు తెలిపారు. మంగళవారం ఆయన కాళేశ్వరం విచారణ కమిషన్ ముందు హాజరై.. అఫిడవిట్ దాఖలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. సాగునీటి రంగంలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై 17పేజీలతో అఫిడవిట్ దాఖలు చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కాగ్ ఇచ్చిన నివేదికపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జవాబు ఇస్తూ.. ప్రాణహిత చేపడితే 165 టీఎంసీల్లో 44 టీఎంసీలే తెలంగాణకు వచ్చేవని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కాళేశ్వరం బ్యారేజీలపై ఎన్‌డీఎస్ఏ నుంచి నివేదికను తెప్పించుకొని, మేడిగడ్డను సత్వర పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను కోరారు. కేంద్ర జలశక్తి శాఖ సలహాదారుడు వెదిరె శ్రీరామ్, విద్యుత్తు రంగ నిపుణుడు కె.రఘు విచారణను తప్పుదోవ పట్టించేలా సమాచారం ఇచ్చారని ఆరోపించారు.

భూలక్ష్మి అమ్మవారి ఆలయంపై దాడి

- విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులు
- హిందూ సంఘాల ఆందోళన
- హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో ఘటన

సంతోష్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రక్షాపురం కాలనీలో ఉన్న భూలక్ష్మి ఆలయంపై సోమవారం రాత్రి కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. దేవాలయం ప్రధాన ద్వారం తలుపులు బద్ధలు కొట్టి విగ్రహాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు, భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున ఆలయం వద్దకు తరలివచ్చి నిరసన చేపట్టారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలిసిన బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని సంఘీభావం తెలిపారు. వెంటనే పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర హామీతో సోమవారం అర్ధరాత్రి ఆందోళనకారులు శాంతించారు. విగ్రహాల ధ్వంసాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం బీజేపీ నాయకురాలు మాధవీలత, పార్టీ కార్యకర్తలతో కలిసి ఆలయం వద్ద ధర్నా చేపట్టారు. హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నేతలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా పోలీసులు ఆలయ పరిసరాలలో దుకాణాలు మూసివేయించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. అతి పవిత్రమైన గోకులాష్టమి రోజు ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరం అన్నారు. వెంటనే చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆలయంలో సంఘటన జరగడం విడ్డూరం అన్నారు. ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాగా, విగ్రహాల ధ్వంసం కేసులో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారని తెలియడంతో ఒక్కసారిగా బీజేపీ నేతలు, హిందూ సంఘాల నేతలు సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు భారీ సంఖ్యలో ఉండటంతో వారిని అడ్డుకున్నారు. చివరకు బీజేపీ నాయకులు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్‌ను కలిసి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం సమర్పించారు.

వీసీల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి: జాజుల

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జనాభా దామాషా ప్రకారం పదవులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. సీఎం రేవంత్ రెడ్డి పది రోజుల్లో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వైస్ ఛాన్సలర్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం హర్షణీయమని ఈ సందర్భంగా జాజుల అన్నారు. ఉస్మానియా, అగ్రికల్చర్, జెఎన్టీయు, కాకతీయ వర్సిటీలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు.. నేడు భూమి పూజ

- పాల్గొననున్న సీఎం, మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు బుధవారం ఉదయం 11 గంటలకు భూమి పూజ నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన కోసం సచివాలయంలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించిన స్థలంలోనే భూమి పూజ జరగనుందన్నారు. డిసెంబర్ 9 కల్లా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామంటూ ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

బెయిల్ వస్తే కవిత.. కడిగిన ముత్యం కాదు : చామల

హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాం కేసు నుంచి కడిగిన ముత్యంలా కవిత బయట పడిపోయినట్లు బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకుంటున్నారని, బెయిల్ వచ్చినంత మాత్రాన ఆమె కడిగిన ముత్యం అయిపోదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ముందు రోజే ఢిల్లీకి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు.. బీజేపీ నాయకులతో మంతనాలు జరిపి బెయిల్ వచ్చే విధంగా ప్రయత్నాలు చేశారన్నారు. అభిషేక్ సింఘ్వీని కేంద్ర మంత్రి బండి సంజయ్ తప్పు పట్టడం సరికాదని చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు.





యాదాద్రిలో గవర్నర్‌కు వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు, రామప్పలో రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న జిష్ణుదేవ్ శర్మ

యాదాద్రి ఓ అద్భుతం

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గుడి పునర్నిర్మాణం
- రామప్ప లాంటి కట్టడాన్ని ఎక్కడా చూడలేదు
- గిరిజనులు అభివృద్ధి సాధించాలి: గవర్నర్
- యాదగిరిగుట్ట, ములుగులో పర్యటన

యాదాద్రి/ములుగు/గణపురం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయ శిల్పకళా వైభవం అద్భుతంగా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ పునర్నిర్మాణం చేశారని, నిర్మాణశైలి విశిష్టంగా ఉందన్నారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారిగా మంగళవారం క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలని స్వామివారిని వేడుకున్నానని చెప్పారు. కాగా, గవర్నర్ ఉదయం 8గంటలకు కొండపైకి చేరుకోగా, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, కలెక్టర్ హనుమంతు కే.జెండగే స్వాగతం పలికారు. అక్కడి నుంచి గవర్నర్ విష్ణు పుష్కరిణి చేరుకుని వేద మంత్రోచ్ఛరణ నడుమ స్నాన సంకల్పం చేశారు. అఖండ దీపారాధన అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం గవర్నర్‌కు మహా మండపంలో వేదమంత్రాలతో వేదాశీర్వచనం చేశారు. 36 నిమిషాలు ఆలయంలో ఉన్న గవర్నర్ ఆలయం వెలుపలికి వచ్చి మీడియాతో మాట్లాడారు. అనంతరం రోడ్డు మార్గంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు బయలుదేరారు. ములుగు జిల్లాలో ఆయనకు మంత్రి ధనసరి సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీశ్, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశమయ్యారు. మారుమూల గూడాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కంటెయినర్ ఆస్పత్రులను ఏర్పాటు చేయించిన మంత్రి సీతక్కను గవర్నర్ అభినందించారు. అనంతరం ఆయన జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందిన క్రీడాకారులు, కవులు, విద్యావేత్తలతో కలిసి భోజనం చేశారు.

రామప్పకు మళ్లీ వస్తా..

రామప్ప ఆలయం అత్యద్భుతమైన కట్టడమని, ఇసుక పునాదులపై ఇంత భారీ రాతి నిర్మాణాన్ని చేపట్టడం అప్పటి సాంకేతిక ప్రజ్ఞకు నిదర్శనమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 'రామప్ప లాంటి సుందరమైన రాతికట్టడాన్ని ఇంతకుమునుపెప్పుడూ చూడలేదు. అందమైన, అద్భుత నిర్మాణమిది. అవకాశం ఉంటే మళ్లీ వస్తా' అని అన్నారు. ములుగు జిల్లాలోని రామప్ప ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికిన పూజారులు.. ఆలయంలో రామలింగేశ్వర స్వామికి గవర్నర్‌తో ప్రత్యేక అర్చన, అభిషేకాలు చేయించి తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలను బహూకరించారు. అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడారు. కఠినమైన శిలలను అందమైన శిల్పాలుగా మలిచిన తీరు ఆశ్చర్యపరిచిందన్నారు. ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కోటగుళ్లను సందర్శించారు. గవర్నర్ సాయంత్రం గోవిందరావుపేట మండలం లక్నవరం చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువు మధ్య ఐలాండ్‌లోని టూరిజం కాటేజీలో రాత్రి బస చేశారు.

తెలంగాణకు మరో 200 మెగావాట్ల విద్యుత్

- గుజరాత్‌లోని ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి..
- ఎన్ఎల్సీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవాలి: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు మరో 200 మెగావాట్ల విద్యుత్ సమకూరనున్నట్టు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 510 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి రాష్ట్రానికి తక్కువ ధరకు విద్యుత్ అందనున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్న ఎన్ఎల్సీ(నేవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్) తెలంగాణకు సౌర విద్యుత్ అందించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ఎన్ఎల్సీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ నుంచి ఈ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీంతో రానున్న 25 ఏళ్లలో దాదాపు రూ.2 వేల కోట్ల మేరకు తెలంగాణ ట్రాన్స్‌కోకు ఆదా కానుందని వెల్లడించారు. సౌర ఫలకాల(సోలార్ ప్యానెళ్ల)తో పాటు సంబంధిత పరికరాలను తెలంగాణ మార్కెట్ నుంచే కొనుగోలు చేస్తారని తెలిపారు. దీంతో రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. ఈ సోలార్ ప్రాజెక్టు ద్వారా గ్రీన్ ఎనర్జీలో రాష్ట్ర భాగస్వామ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉన్నదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి విద్యుత్ ఉత్పత్తిని పెంచి ఇక్కడి గృహ వినియోగ, పారిశ్రామిక అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మరో 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు.

మన టీచర్లకు జాతీయ అవార్డులు

- ఖమ్మం, సిరిసిల్ల జిల్లాకు చెందిన ఇద్దరికి పురస్కారం

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ' జాతీయ ఉపాధ్యాయుల పురస్కారానికి ఎంపికయ్యారు. ఖమ్మం రూరల్ మండలం తిరుమలాయపాలెం జడ్పీఎస్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న పెసర్ల ప్రభాకర్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న తందూరి సంపత్‌కుమార్ ఈ అవార్డులకు ఎంపికైన వారిలో ఉన్నారు. ఈ అవార్డుకు దేశ వ్యాప్తంగా మొత్తం 50 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ మేరకు కేంద్ర విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ అను జైన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీలోని నిర్వహించే కార్యక్రమంలో వీరికి ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ అవారులో భాగంగా రూ. 50 వేలు, మెరిట్ సర్టిఫికెట్, సిల్వర్ మెడల్‌ను అందించనున్నారు.

కంటి గుండా మెదడుకు సర్జరీ

(మొదటి పేజీ తరువాయి)

తొలగించారు. రోగి పుర్రెను తెరవకుండా నిర్వహించే ఈ ప్రక్రియను 'ఎండోస్కోపిక్ లాటరల్ ట్రాన్స్ ఆర్బిటల్ అప్రోచ్' అంటారు. ఈ తరహా సర్జరీ నిర్వహించడం భారతదేశంలోనే మొదటిసారి వైద్యులు వివరించారు. ఆరు నెలలుగా.. కుడి కంటి చూపు మసకబారి, తలనొప్పితో బాధపడుతున్న మహిళ (54) ఏఐజీ వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు ఆమె 'స్ఫినో ఆర్బిటల్ కావెర్నస్ మెనింజియోమా (ఎస్‌వోఎం)' అనే సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కంటి వెనుక భాగంలో ఉండే స్ఫినాయిడ్ ఎముకకు, ఐ సాకెట్‌కు, కార్వినియస్ సైనస్‌కు మధ్య ఉండే భాగంలో నిరపాయకరమైన ఏర్పడే కణితిని ఇలా వ్యవహరిస్తారు. దీనిని కనురెప్ప పై భాగంలో గాటు ద్వారా తొలగించినట్లు ఏఐజీ న్యూరో సర్జన్లు వివరించారు. ఈ విధానంలో చికిత్స చేయడం వల్ల మెదడుపై ఎలాంటి దుష్ప్రభావం పడదని, రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉందని వారు వెల్లడించారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని రెండోరోజే ఇంటికి పంపినట్టు తెలిపారు. కాగా.. అరుదైన ఈ శస్త్రచికిత్స చేసిన వైద్య బృందంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ అభిరామ చంద్ర గబ్బిట, డాక్టర్ సుబోధ్ రాజు (డైరెక్టర్- న్యూరోసర్జరీ) తదితరులు ఉన్నారు. కాగా.. అత్యంత అరుదైన సర్జరీ చేసిన వైద్యులను ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర రెడ్డి అభినందించారు.



రోగి కంటిపై చిన్న గాటు

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

వరద రాజకీయం

ఎడతెరిపిలేని వర్షాలతో బంగ్లాదేశ్‌లోని పలుప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. మరణాల సంఖ్య పాతికవరకూ ఉన్నప్పటికీ, అరవైలక్షలమంది ప్రజల జీవితాలను ఈ వరదలు ప్రభావితం చేశాయి. రోడ్లు ధ్వంసమై రవాణావ్యవస్థ స్తంభించడంతో ఆహారసరఫరాలకు ఇబ్బంది ఏర్పడింది. నిత్యావసరాలు, తాగునీరు, మందులు అందక ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. వరద బీభత్సం తీవ్రంగా ఉన్న స్థితిలో మధ్యంతర ప్రభుత్వాధినేత మహ్మద్ యూనుస్ దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వరదబాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి ఆకస్మిక వరదలు ముంచెత్తకుండా పొరుగుదేశాలతో చర్చలు జరుపుతామని ప్రకటించారు. భారతదేశానికి చెందిన త్రిపుర రాష్ట్రంలోని దుంబూర్ డ్యామ్ గేట్లను అకస్మాత్తుగా తెరవడం వల్లనే బంగ్లాదేశ్‌లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద పోటెత్తిందనే ప్రచారం విస్తృతంగా సాగిన నేపథ్యంలో, ఆయన నోటినుంచి అటువంటి ఆరోపణేమీ నేరుగా రాకున్నా ఈ పరోక్షప్రస్తావనకు ప్రాధాన్యం ఏర్పడింది. దుంబూర్ డ్యామ్ వల్లనే బంగ్లాదేశ్‌లో మునక అధికంగా జరిగిందన్న ప్రచారాన్ని భారత్ వెంటనే ఖండించింది. ఈ డ్యామ్ సామర్థ్యం, విడుదలైన నీరు వ్యాప్తిచెందగల వేగం, విస్తీర్ణం, ప్రభావం ఇత్యాది అంశాలతో మంచివివరణే ఇచ్చింది. అయినప్పటికీ, బంగ్లాదేశ్ సామాజిక మాధ్యమాల్లో వరదల వెనుక అనుమానాలు, కుట్రసిద్ధాంతాల ప్రచారాలు పూర్తిగా ఆగిపోలేదు.

గతవారం త్రిపురను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఐదురోజుల పాటు సాధారణం కంటే మూడురెట్లు అధికంగా కుంభవృష్టి కురవడంతో రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. పాతికమంది మరణించారు, ఇరవైలక్షలమంది ప్రభావితులైనారు, లక్షన్నరమంది నిరాశ్రయులైనారు. త్రిపురకు పశ్చిమాన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లోని జిల్లాల్లో కూడా ఇదే రకమైన కష్టం తలెత్తింది. అక్కడ కూడా వరదలు వచ్చాయి, చెరువులు తెగిపడ్డాయి. అయితే, మారిన రాజకీయ వాతావరణం వల్ల కాబోలు, అక్కడి సామాజిక మాధ్యమాల్లో భారత్ మీద ఆరోపణలు ఊపందుకున్నాయి. డ్యామ్ గేట్లు తెరిచేసి, గుమ్టీ నదిద్వారా భారతదేశం కక్షపూరితంగా బంగ్లాదేశ్‌లో కృత్రిమవరదలను సృష్టించిందన్నది ఆ ప్రచారం సారాంశం. విశ్వాసం తగ్గుముఖం పట్టినప్పుడు ఇటువంటి విషప్రచారాలకు హద్దు ఉండదు. డ్యామ్‌గేట్లను ఎత్తివేయడం వెనుక ఏవో దురుద్దేశాలున్నాయన్న ఆరోపణలు సరికాదు కానీ, నిర్దిష్టమైన ఎత్తుకు నీరుచేరినప్పుడు గేట్లు ఆటోమేటిక్‌గా తెరుచుకొని నీరు విడుదలయ్యే ఏర్పాటయితే అక్కడ ఉంది. అయితే, డ్యామ్‌లో నీరు ప్రమాదకరమైన ఎత్తుకుచేరిందనీ, ఏ క్షణమైనా అది ఆటోమేటిక్‌గా ఖాళీ కావచ్చునన్న హెచ్చరిక మననుంచి బంగ్లాదేశ్‌కు చేరలేదని అంటారు. అందువల్ల, ఎంతో ముందునుంచే ఆ దేశంలోనూ తీవ్రమైన వర్షాలు, వరదపరిస్థితి ఉన్నప్పటికీ, త్రిపురలో గేట్లు ఎత్తివేయడంతోనే తమకు ఈ దుస్థితి ఏర్పడిందంటూ భారత్‌ను తప్పుబట్టడానికి వారికి అవకాశం కలిగింది. త్రిపురలోని ఎనిమిది జిల్లాలనూ వరద ముంచెత్తిన వాస్తవాన్ని పక్కనబెట్టి, ఒక జిల్లాలోని ఓ చిన్నడ్యామ్ కారణంగా ఈ ఘోరం జరిగిపోయిందంటూ బంగ్లాదేశ్‌లోని ఒక వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రచారం చేసిందని అంటారు. డ్యామ్ అధికారులు త్రిపుర ప్రభుత్వానికి తమవంతుగా ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేరవేస్తున్నప్పటికీ, అవి పొరుగుదేశానికి అందలేదన్న వాదనలూ ఉన్నాయి.


చెప్పాపెట్టకుండా గేట్లు తెరిచేసి, విపత్తును ఎదుర్కొనేందుకు ఏమాత్రం సమయం ఇవ్వకుండా భారతదేశం మమ్మల్ని ప్రమాదంలో పడవేసిందన్న రీతిలో బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ సలహాదారు ఇటీవల వ్యాఖ్యానించారు. అక్కడి కోటా వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన ఈ ఢాకా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు భారతదేశం సహాయనిరాకరణ చేస్తోందని కూడా ఆరోపిస్తున్నారు. ఆయన వేటిని మనసులో పెట్టుకొని ఈ మాటలన్నారో తెలియదు కానీ, రెండు దేశాల మధ్యా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన నీటి తగువులు కూడా ఇకమీదట వేడెక్కవచ్చును. రెండు దేశాల మధ్యా దాదాపు యాభైనాలుగు నదులు సరిహద్దులకు అతీతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇటువంటి పొరపొచ్చాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. బంగ్లాదేశ్‌లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇది ఎంతో ముఖ్యం. ఇప్పటికే ఉన్న విధానాలను కచ్చితంగా అమలుచేయడం, మరింత పటిష్టపరచడం అవసరం. ఎప్పటికప్పుడు డేటా పంచుకోవడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవడం అవసరం.

ప్రభుత్వాల చేతుల్లోకి కేబుల్ టీవీ

టీ ఫైబర్ ప్రాజెక్ట్ ద్వారా రూ.300కే హైస్పీడ్ ఇంటర్నెట్‌తోబాటు కేబుల్ టీవీ ప్రసారాలు అందిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను సామాన్య ప్రజలు స్వాగతిస్తున్నారు. కేబుల్ పరిశ్రమ మాత్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కేబుల్ టీవీ ప్రసారాలు ప్రభుత్వం చేతుల్లోకి వెళ్ళిపోతే ఈ పరిశ్రమ భవిష్యత్ ఏంటన్నది వాళ్ళ ముందున్న సమస్య. కానీ సామాన్య ప్రజలకు మాత్రం తక్కువ ధరకే కేబుల్, ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుంది. సీఎం చెబుతున్నదాన్ని బట్టి తెలంగాణలో 93 లక్షల ఇళ్లకు చేరటం ప్రభుత్వ లక్ష్యం. అదే విధంగా సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ సహా 65,500 ప్రభుత్వ సంస్థలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తారు. ఈ-గవర్నెన్స్ అందించటానికి వీలుగా భారత్ నెట్ పథకాన్ని టీఫైబర్‌కు వర్తింపజేయాలని ఇప్పటికే ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటర్నెట్ విస్తరణలో రాష్ట్రాలకు సహకరించటం వరకూ ఎలాంటి సమస్యా లేకపోయినా, టీవీ పంపిణీ రంగంలోకి రావటం మీదనే కేంద్రానికి మొదటి నుంచీ అభ్యంతరాలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో టీవీ ఉండకూడదన్నది కేంద్ర ప్రభుత్వ విధానం. అందుకే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు సొంతగా టీవీ చానల్స్ నడుపుకుంటామని అడిగినా ఒప్పుకోలేదు. అలా అడిగి కాదనిపించుకున్న రాష్ట్రాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పంజాబ్, కర్ణాటక, హర్యానా, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. అభివృద్ధి సంబంధమైన విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం లాంటి విషయాల ప్రచారానికి ఇస్రో సహకారంతో నడిచే కేయూ బాండ్ ఛానల్స్‌ను మాత్రమే కేంద్రం అనుమతించింది. తెలంగాణలో టీశాట్, ఆంధ్రప్రదేశ్‌లో శాప్ నెట్ కింద నడుస్తున్న రెండేసి చానల్స్ అందుకు ఉదాహరణ.

సొంత చానల్స్ సంగతి అలా ఉంచితే, కేబుల్ టీవీ ద్వారా శాటిలైట్ టీవీ చానల్స్ పంపిణీ చేయటానికి ప్రయత్నించిన మొదటి రాష్ట్రం తమిళనాడు. సన్ టీవీ ఆధ్వర్యంలో నడిచే సుమంగళి కేబుల్ విజయం గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయటానికి జయలలిత ఈ వ్యవస్థను ప్రోత్సహించారు. తక్కువ ధరకే కేబుల్ ప్రసారాలు అందించటంలో విజయం సాధించారు. ఒక దశలో 80 శాతం ఇళ్ళకు చేరిన ఘనత అక్కడి అరసు కేబుల్ టీవీది. అయితే, కేబుల్ టీవీ డిజిటైజేషన్ జరిగినప్పుడు "రాష్ట్ర ప్రభుత్వమే ఒక ఎమ్మెస్వోగా ఉండటం కుదర"దంటూ లైసెన్స్ ఇవ్వలేదు. చాలాకాలం ఈ ప్రతిష్టంభన కొనసాగింది. జయలలిత 36 సార్లు కేంద్రానికి లేఖలు రాశారు. ఢిల్లీ వెళ్ళిన ప్రతిసారీ ఆ విషయం ప్రస్తావించేవారు. ఏమైతేనేం తాత్కాలిక అనుమతి రావటం, ఇప్పుడు 55శాతం మేర ఇళ్ళకు టీవీ ప్రసారాలు అందిస్తూ ఆ రాష్ట్రంలో అతి పెద్ద ఎమ్మెస్వోగా ఉండటం తెలిసిందే.



హైదరాబాద్ హైటెక్స్‌లో ఆగస్టు 28న మూడు రోజుల కేబుల్ ఎక్స్‌పో మొదలవుతున్న వేళ రేవంత్‌రెడ్డి ఈ తేనెతుట్టెను కదపటం కేబుల్ టీవీ రంగాన్ని అనేక భయాలకు గురి చేసినట్టయింది. కానీ, ప్రభుత్వం పోషిస్తున్నది ఎమ్మెస్వో పాత్ర మాత్రమేనని, ఆపరేటర్ల ఉనికికి, ఉపాధికి ఇబ్బంది ఉండదనే భరోసా ఇవ్వటం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు.

ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా దాదాపు ఇదే బాటలో నడిచింది. అయితే, ఇది ఒక విధంగా 'భారత్ నెట్' అని పిలిచే భారత్ బ్రాడ్ బాండ్ నెట్ వర్క్ పథకానికి కొనసాగింపు. 2012లో ఏర్పాటైన భారత్ నెట్ లక్ష్యం దేశంలోని రెండున్నర లక్షల గ్రామ పంచాయితీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించటం ద్వారా 'డిజిటల్ ఇండియా'ను సాధించటం. 2014లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని ఏపీ ఫైబర్ పేరుతో మరింత వేగంగా అమలు చేయటానికి పూనుకుంది. అందరికంటే ముందుగా అమలు చేసి ఆదర్శంగా నిలవాలని భావించింది. అండర్ గ్రౌండ్ కేబుల్ ఆలస్యమవుతుందని ఓవర్ హెడ్ ఫైబర్ వేసింది. పనిలో పనిగా 'ట్రిపుల్ ప్లే' పేరుతో ఇంటర్నెట్, టీవీ, ఫోన్ ఇస్తానని చెప్పింది. నిజానికి ఇది పురోగామి చర్యలా కనిపించినా, ఫోన్ అనవసరమని చాలామంది అన్నారు. అప్పటికి ఇంటర్నెట్ మీద కూడా అంతగా మోజు లేదు. అప్పటికే కేబుల్ టీవీ డిజిటైజేషన్ పూర్తి కావస్తూ ఉండటం, చాలామంది సెట్ టాప్ బాక్సులు కొనుక్కొని ఉండటంతో 'ఏపీ ఫైబర్' తన స్పెషల్ 'ట్రిపుల్ ప్లే' సెట్ టాప్ బాక్సులు అమ్మలేకపోయింది. పైగా, ఇతర కేబుల్ టీవీ ఎమ్మెస్వోలు రూ.1500కే బాక్స్ ఇస్తున్నప్పుడు ఈ ట్రిపుల్ ప్లే బాక్స్ ధర రూ.4,500 ఉండటం వల్ల కూడా ఆశించిన స్పందన రాలేదు.

ఏమైతేనేం, టీడీపీ హయాంలో నయానో భయానో కనెక్షన్ల సంఖ్య దాదాపు 10 లక్షలకు చేరినా, వైసీపీ హయాంలో అంతగా పట్టించుకోకపోవటంతో దాదాపు సగానికి తగ్గాయి. ఇప్పుడు మళ్ళీ టీడీపీ ప్రభుత్వం వాటి మీద దృష్టిపెట్టింది. 9.7 లక్షల కనెక్షన్లలో 5 లక్షలు క్రియాశీలంగా ఉన్నాయని కేంద్రానికి చెప్పింది. భారత్ నెట్ రెండో దశలో భాగంగా 35 లక్షల సెట్ టాప్ బాక్సులు ఇవ్వాలని కోరింది. అదే జరిగితే ఇప్పటికే పాతబడ్డ ఇతర ఎమ్మెస్వోల సెట్ టాప్ బాక్సులు వదిలేసి ఇప్పుడు ఏపీ ఫైబర్ బాక్సులవైపు జనం మొగ్గు చూపే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఆ 35 లక్షల కస్టమర్లను సంపాదించుకోవటం కష్టం కాకపోవచ్చు.

ఆ విధంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాల కేబుల్ వ్యాపారం దూకుడు పెరగబోతోంది. ప్రభుత్వాలే ఎమ్మెస్వోల అవతారం ఎత్తినప్పుడు నష్టపోయేది ఎమ్మెస్వోలే తప్ప సాధారణ కేబుల్ ఆపరేటర్లకు వచ్చే ఇబ్బందేమీ ఉండకపోవచ్చు. తమిళనాడులో అదే జరిగింది. చందాదారుకు నచ్చజెప్పి ప్రభుత్వ సెట్ టాప్ బాక్స్ పెట్టించటమే ఆపరేటర్ పని. ప్రభుత్వం లాభాపేక్షతో నడపదు కాబట్టి ఆపరేటర్‌కు ఎప్పటిలాగానే కమిషన్ వస్తుంది. ప్రభుత్వాలు కనెక్షన్లు పెంచుకునే కొద్దీ పే చానల్స్‌తో బేరమాడే శక్తి పెరుగుతుంది. ఆ విధంగా చందాదారులకు వీలైనంత తక్కువ ధరకే ప్రసారాలు అందించగలుగుతారు. చానల్స్ అందించినందుకు వాటి నుంచి వసూలు చేస్తున్న కారేజ్ ఫీజుకూ సరైన లెక్కలుండటం వల్ల చానల్స్‌కు కూడా అది ఉపయోగం. కారేజ్ ఫీజులో వాటా ఆపరేటర్‌కి ఇవ్వటమా, ఆ మేరకు చందాదారు బిల్లు తగ్గించటమా అనే విషయంలో ప్రభుత్వమే ఒక నిర్ణయం తీసుకోవచ్చు.

అందువలన తమిళనాడు నమూనాను అధ్యయనం చేసి తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేయాల్సి ఉంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ నమూనాలో మంచిచెడ్డలు కూడా పరిశీలించటానికి ఇప్పుడు తగిన అవకాశం దొరికినట్టయింది. వీటి ఆధారంగా ఒక మెరుగైన మార్గంలో టీ ఫైబర్‌ను ముందుకు నడిపితే ఇప్పుడు ప్రకటించిన '300కే హై స్పీడ్ ఇంటర్నెట్, టీవీ' కచ్చితంగా ప్రజాదరణ పొందుతుంది. హైదరాబాద్ హైటెక్స్‌లో ఆగస్టు 28న మూడు రోజుల కేబుల్ ఎక్స్ పో మొదలవుతున్న వేళ రేవంత్‌రెడ్డి ఈ తేనెతుట్టెను కదపటం కేబుల్ టీవీ రంగాన్ని అనేక భయాలకు గురి చేసినట్టయింది. కానీ, ప్రభుత్వం పోషిస్తున్నది ఎమ్మెస్వో పాత్ర మాత్రమేనని, ఆపరేటర్ల ఉనికికి, ఉపాధికి ఇబ్బంది ఉండదనే భరోసా ఇవ్వటం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు.

● తోట భావనారాయణ

హరియాణా ఎన్నికలు, ప్రాంతీయ అస్తిత్వాలు



హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందో లేక మళ్లీ కాంగ్రెస్‌కు అధికారం అప్పజెబుతుందో ఇప్పుడే చెప్పడం కష్టం. ఆ రెండు జాతీయ పక్షాల మధ్య జరిగే భీకర పోరులో ఒక చరిత్ర గలిగిన ప్రాంతీయ పార్టీ (ఐఎన్ఎల్‌డి) అవశేషం (జననాయక్ జనసేన) భవితవ్యం ఏమిటో తేలనున్నదనేది స్పష్టం. ఆ మాటకొస్తే జాతీయ పాలక, ప్రతిపక్ష కూటములకు చెందని సమస్త పార్టీలూ మనుగడ ముప్పులో ఉన్నాయి.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

తెలుగుదేశం అధినేత నందమూరి తారకరామారావు 1987లో హరియాణాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి లోక్‌దళ్ ఘన విజయానికి తోడ్పడిన విషయం చరిత్ర పుటల్లో రికార్డు అయింది. ఆ ఎన్నికల్లో రైతు నాయకుడు దేవీలాల్ సారథ్యంలోని లోక్‌దళ్ – భారతీయ జనతా పార్టీతో కలిసి పోటీ చేసి 90 సీట్లలో 76 సీట్లు గెలుచుకుని ఘన విజయం సాధించింది. లోక్‌దళ్‌కు 60 సీట్లు రాగా, బీజేపీకి 16 సీట్లు లభించాయి. దాదాపు 37 సంవత్సరాల తర్వాత ఇప్పుడు జరుగుతున్న హరియాణా ఎన్నికల్లో దేవీలాల్ మునిమనుమడు, నాలుగోతరం నేత దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జెజెపి) భవిష్యత్ ఏమిటో అక్టోబర్ 1న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలు తేల్చనున్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 15 శాతం ఓట్లు, 10 సీట్లు సాధించిన జెజెపి మూడునెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 0.87 శాతం ఓట్లు సాధించింది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హరియాణాలోని 90 సీట్లలో బీజేపీ కేవలం 47 సీట్లు సాధించడంతో జెజెపి కీలక మద్దతునిచ్చి ప్రభుత్వం ఏర్పాటుకు దోహదం చేసింది. అయిదు సంవత్సరాల తర్వాత ఇప్పుడు జెజెపిని ఎవరూ పట్టించుకునే స్థితిలో లేరు. 2020లో రైతుల ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నప్పుడు, మహిళా మల్లయోధుల నిరసన సమయంలో కూడా అధికారంతో అంటకాగడంతో జెజెపి ప్రజలకు దూరమైంది. లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో ప్రజలు ఆ పార్టీని ప్రచారానికి కూడా అనుమతించలేదు. ఒకప్పుడు హరియాణా రాజకీయాలను శాసించిన దేవీలాల్ – చౌతాలా కుటుంబం ముక్కలుముక్కలై, వేర్వేరు పార్టీలుగా చీలి ఇప్పుడు అస్తిత్వ పరీక్షలో ఉన్నది. ఉనికిని కాపాడుకునేందుకు చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీతో కలిసి జెజెపి పోటీ చేస్తోంది. తద్వారా ఎంతో కొంత ఓటు బ్యాంకును నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. 'ప్రజల మనోభావాలు మేము అర్థం చేసుకోలేకపోయాం. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో మూల్యం చెల్లించాం' అని దుష్యంత్ చౌతాలా ఒక ఇంటర్వ్యూలో అన్నారు. హరియాణాలో ప్రధాన పోటీ ఇప్పుడు కాంగ్రెస్– బీజేపీలకే పరిమితం కావడంతో తాను మరోసారి కింగ్ మేకర్ పాత్ర పోషిస్తాననే ఆశతో దుష్యంత్ ఉన్నారు.

నిజానికి హరియాణాలో ప్రాంతీయ రాజకీయాలు 1967లోనే ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్‌లో ముఠా తగాదాలే ఈ ప్రాంతీయ పార్టీలకు కారణమయ్యాయి. 1967లో హరియాణా వికాస్ పార్టీ స్థాపించిన బీరేంద్ర సింగ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండవ ముఖ్యమంత్రిగా అధికారం చలాయించినప్పటికీ ఏడాది కూడా పాలించలేకపోయారు. ఆ తర్వాత నిలదొక్కుకోకపోవడంతో 1978లో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఆ తర్వాత భారతీయ క్రాంతిదళ్, హరియాణా వికాస్ పార్టీ, హరియాణా జనసభ వంటి నాలుగైదు ప్రాంతీయ పార్టీలు ఏర్పడినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. కేవలం భారత జాతీయ లోక్‌దళ్ మాత్రమే చాలా కాలం హరియాణా రాజకీయాలను ప్రభావితం చేసింది. కాని ఈ పార్టీ ముక్కలై 2019లో జననాయక్ జనతా పార్టీ రూపంలో మిగిలింది. ఇప్పుడా పార్టీ కూడా కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నది.

1989 లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 85 సీట్లు సాధించినప్పటికీ బీజేపీ హరియాణాలో ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. సుష్మాస్వరాజ్, సూరజ్‌భాను వంటి నేతలు కూడా పరాజయం పాలయ్యారు. 1991 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దేశవ్యాప్తంగా 120 సీట్లు సాధించినప్పటికీ హరియాణాలో రెండు సీట్లు సాధించింది. దీనితో దేశవ్యాప్తంగా బీజేపీ పుంజుకోవాలంటే ప్రాంతీయ పార్టీల భుజాన ఎక్కడం తప్పదని గ్రహించింది. సరిగ్గా అదే సమయంలో నరేంద్రమోదీని పార్టీ ఇన్‌ఛార్జిగా బీజేపీ రంగంలోకి దించింది. అప్పటికి కాంగ్రెస్‌తో విభేదాల వల్ల బన్సీలాల్ హరియాణా వికాస్ పార్టీ పేరుతో స్వంత కుంపటిని ఏర్పాటు చేసుకుని 1991 ఎన్నికల్లో 5.35శాతం ఓట్లతో ఒక సీటును సాధించడం మోదీ దృష్టిని ఆకర్షించింది. మోదీ ప్రయోగం విజయవంతమై 1996 ఎన్నికల్లో హరియాణా వికాస్ పార్టీ–బీజేపీ కూటమి కలిసి 76 సీట్లను సాధించింది. 11 సీట్లతో బీజేపీ బన్సీలాల్ ప్రభుత్వానికి కీలక మద్దతును అందించింది. ఆసక్తికరమైన విషయం ఏమంటే బన్సీలాల్ ప్రభుత్వం దుష్పరిపాలన మూలంగా రెండేళ్లలోనే ప్రజాదరణ కోల్పోయింది. 1998 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 182 సీట్లను సాధించినప్పటికీ బీజేపీ, హెచ్‌విపి హరియాణాలో చెరొక సీటును మాత్రమే పొందాయి. దీనితో మోదీ చక్రం తిప్పి వెంటనే బన్సీలాల్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుని భారత జాతీయ లోక్‌దళ్ నేత దేవీలాల్ కుమారుడు ఓం ప్రకాశ్ చౌతాలాతో చేతులు కలిపారు. కేంద్రంలో ఏర్పడ్డ వాజపేయి తొలి ప్రభుత్వానికి నలుగురు ఎంపీలతో చౌతాలా మద్దతు నీయడమే ఇందుకు కారణం. ఆ తర్వాత బన్సీలాల్ గతిలేక మళ్లీ కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేశారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ వ్యూహం ఫలించి ఐఎన్ఎల్‌డి–బీజేపీ మొత్తం పది సీట్లను సాధించగలిగాయి. 2000 అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎన్ఎల్‌డి స్వంతంగానే 62 సీట్లు సాధించడంతో బీజేపీ మద్దతు అవసరం లేకుండా పోయింది. అయినప్పటికీ బీజేపీ వెలుపలి నుంచి మద్దతునందించింది. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా మోదీ మళ్లీ గుజరాత్ రాజకీయాల్లో ప్రవేశించడం, వాజపేయి ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోవడం, కాంగ్రెస్ పుంజుకోవడంతో హరియాణా రాజకీయాలు బీజేపీ చేతుల్లోంచి జారిపోయాయి. 2005 నుంచి 2014 వరకు భూపీందర్ సింగ్ హుడా నేతృత్వంలో కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీతో అధికారం చలాయించింది. ఐఎన్ఎల్‌డి ప్రతిపక్ష స్థానంలో ఉండగా, బీజేపీ రెండు మూడు సీట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకోవల్సి వచ్చింది.

మళ్లీ 2014లో నరేంద్రమోదీ ప్రభంజనం వీచి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాతే హరియాణాలో బీజేపీ దశ తిరిగింది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మోదీ హరియాణాలో బీజేపీని గెలిపించి 1995–2001 మధ్య తనతో పాటు పార్టీ యంత్రాంగంలో పని చేసిన మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రి చేశారు. 2019లో ఖట్టర్ పూర్తి మెజారిటీ సాధించలేకపోవడంతో చౌతాలా మనుమడి సహకారంతో ప్రభుత్వం నిలబెట్టుకున్నారు. కాని లోక్‌సభ ఎన్నికల సమయంలో జెజెపితో విభేదాలు రావడంతో ఖట్టర్‌ను తప్పించి నాయబ్‌సింగ్ సైనీ అనే బీసీ నేతకు పగ్గాలు అప్పజెప్పారు. జెజెపిని పక్కన పెట్టి స్వంతంగా పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పదేళ్ల ప్రజా వ్యతిరేకతను తట్టుకుని బీజేపీ హరియాణాలో గెలుస్తుందా, పది సంవత్సరాల తర్వాత మళ్లీ కాంగ్రెస్‌కు అధికారం అప్పజెబుతుందా ఇప్పుడే చెప్పడం కష్టం. ఏమైనా 'ఉద్ధతుల మధ్య పేదలకుండతరమే' అన్నట్లుగా హరియాణాలో ప్రస్తుతం బీజేపీ కాంగ్రెస్‌ల మధ్య జరిగే భీకరపోరులో ఒక చరిత్ర గలిగిన ప్రాంతీయ పార్టీ అవశేషం మనుగడ ఏమిటో ఈ ఎన్నికల్లో తేలుతుంది.

సారాంశం ఏమంటే 1987లో ఎన్టీఆర్ లోక్‌దళ్‌కు ప్రచారం చేసినప్పుడు బీజేపీ బాల్యదశలో ఉన్న పార్టీయే. నాడు ఎన్టీఆర్, దేవీలాల్ నేషనల్ ఫ్రంట్ నేతలుగా కూర్చుని ఉండగా వాజపేయి, చంద్రశేఖర్‌లు వెనుక నిలబడి ఉన్న దృశ్యం మరిచిపోలేనిది. దేశ వ్యాప్తంగా ఎన్టీఆర్‌ను ప్రచారానికి ఆహ్వానిస్తున్న రోజులవి. ఆ తర్వాతి కాలంలో బీజేపీ దినదిన ప్రవర్ధమానమైనట్లు ఎదిగి దేశ రాజకీయాలను తానే ప్రభావితం చేయగలిగే స్థాయికి చేరుకుంది. హరియాణాలో నిలదొక్కుకునేందుకు చాలా అవస్థలు పడింది. పేక ముక్కల్ని మార్చినట్లు మిత్రపక్షాలను మార్చింది. చివరకు బీజేపీ తానే స్వంతంగా అధికారంలోకి రాగలిగిన స్థాయికి చేరుకుంది.

హరియాణా అనుభవాలు దేశంలో ఇతర ప్రాంతీయ పార్టీలకు కూడా వర్తిస్తాయా అన్న విశ్లేషణకు ఆస్కారం కలిగిస్తున్నాయి. నేషనల్ ఫ్రంట్‌లో పాత్ర పోషించిన బిజూ జనతాదళ్ అధినేత బిజూ పట్నాయక్ కుమారుడు నవీన్ పట్నాయక్ ఇప్పుడు 24 సంవత్సరాల పాలన తర్వాత పార్టీ పరాజయం కావడంతో దాన్ని కాపాడాల్సిన పరిస్థితిలో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ ఒకప్పుడు ఒడిషాలో బిజెడి భుజాలపై ఎక్కి ఎదిగిన పార్టీయే. బిజెడితో పాటు తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రలో వైసీపీ కూడా హరియాణాలో జన నాయక్ జనసేన పార్టీ మాదిరి మనుగడ తేల్చుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాయి. దేవీలాల్ తర్వాత నాల్గోతరం వరకైనా జెజెపి రూపంలో ఆయన వారసత్వం మిగిలి ఉంటే, బిజెడి రెండో తరం కొంతకాలం నిలదొక్కుకోగలిగింది. బిఆర్ఎస్ రెండో తరం వరకు రాకముందే సంక్షోభంలో పడింది. వైసీపీలో మొదటి తరమే మిగిలి ఉంటుందా అన్నది అనుమానమే. దేశంలో ఇప్పుడు తెలుగుదేశం, జనతాదళ్(యు) పార్టీల మద్దతుపై ఎన్డీఏ ప్రభుత్వం మనుగడ ఆధారపడి ఉండగా, అత్యధిక ప్రాంతీయ పార్టీలు ఇండియా కూటమికి మద్దతునిస్తున్నాయి. హరియాణా, జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ–ఇండియా కూటమిల మధ్యే పరిమితం కాగా దేశవ్యాప్తంగా ఇక జరిగే ప్రతి ఎన్నికల్లోనూ ఈ ఉభయ కూటముల ఆధిపత్యమే కొనసాగే అవకాశాలున్నాయి. భారత రాజకీయాలు ఇప్పుడు రెండు కూటముల మధ్యే పరిమితమయ్యాయని, ఈ రెండు కూటములకు చెందని పార్టీలు అస్తిత్వ పరీక్షలో ఉన్నాయని చెప్పేందుకు పెద్దగా రాజకీయ పరిశీలన అక్కర్లేదు. అవినీతి, అరాచక పాలన, ఒంటెత్తు పోకడల వల్లే దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు అదృశ్యమయే పరిస్థితిలో పడ్డాయి. వాటి పరిస్థితికి బీజేపీని పూర్తిగా నిందించాల్సిన పనిలేదు. సక్రమంగా పనిచేసే ప్రాంతీయ పార్టీలకు ఎప్పటికీ ఢోకా ఉండదు. అలాంటి పార్టీల మద్దతుపై ఆధారపడినప్పుడే జాతీయ పార్టీలు బుద్ధిగా నడుచుకుంటాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

తక్కువ జీతం... వెట్టి చాకిరి!

నాలుగు దశాబ్దాలుగా ఆర్ట్, క్రాఫ్ట్ రెగ్యులర్ టీచర్ల పోస్టులను ప్రభుత్వాలు భర్తీ చేయలేదు. దీంతో విద్యార్థులు సృజనాత్మకతకు దూరమయ్యారు. విద్యాహక్కు చట్టం–2009లో భాగంగా 2012లో ప్రభుత్వం ఆర్ట్–క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించింది. కానీ వీరంతా శ్రమదోపిడీకి గురవుతూ దశాబ్దకాలంగా అవమానాలను భరిస్తున్నారు. 'బతకలేక బడి పంతులు' సామెతను కొట్లాడి సాధించుకున్న కొత్త రాష్ట్రంలో పాలకులు పునరావృతం చేశారు. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం 'రాజీవ్ విద్యా మిషన్' కింద ఆర్ట్, క్రాఫ్ట్, పీటీఐ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా రోస్టర్ పద్ధతిలో రెగ్యులర్ ఉద్యోగ నియామకాల మాదిరిగా ఇంటర్వ్యూ చేసి, కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. ఉమ్మడి రాష్ట్రంలో 12 వేల మందిని నియమించగా, రాష్ట్రం విడిపోయాక 5 వేల మంది తెలంగాణలో మిగిలిపోయారు. తక్కువ జీతాలు, వేధింపులు భరిస్తూ ఎప్పటికైనా ఉద్యోగ భద్రత వస్తుందనే నమ్మకంతో 2400 మంది మిగిలారు. వీరికి పూర్తికాల విధులు చేస్తామని చెప్పి, అగ్రిమెంట్ బాండ్ తీసుకుని పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల (పీటీఐ) పేరుతో కొనసాగిస్తున్నారు. దీంతో వీరంతా 12 ఏళ్లుగా వేధింపులకు గురవుతున్నారు.

పార్ట్ టైం అనే పేరు పెట్టి తెలంగాణ ప్రభుత్వం ఈ టీచర్ల జీవితాలను ఆగం చేసింది. విలువైన విద్య బోధించే గురువులకు విలువ లేకుండా చేసింది. కేంద్రం సమగ్ర శిక్ష ద్వారా నిధులు మంజూరు చేస్తుంది. కేంద్రం నిధుల నుండి ఇచ్చే వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం సరిగా ఇవ్వకపోగా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 40 శాతం వాటాను కూడా ఏనాడూ ఇవ్వలేదు. వేసవి సెలవుల్లో వీరిని టెర్మినేట్ చేస్తూ, తిరిగి తీసుకోవడానికి నెలల తరబడి జాప్యం చేసి, జీతాలు ఎగ్గొట్టింది. కరోనా సమయంలో 21 నెలల జీతాలు కేంద్రం ఇచ్చినప్పటికీ, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం టీచర్లకు ఇవ్వలేదు. వీరికి రూ. 11,700 గౌరవ వేతనం ఇవ్వడానికి ప్రభుత్వం అష్టకష్టాలు పెట్టింది. సమగ్ర శిక్షలో పని చేస్తున్న మిగతా విభాగాల వారికి రూ.20వేలకు పైగా ఇస్తారు. పీటీఐలకు మాత్రం కేవలం రూ.11,700, అదీ 10 నెలలు కూడా ఇవ్వడం లేదు.

ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు 12 ఏళ్లగా చేస్తున్న వెట్టిచాకిరీకి ఇకనైనా విముక్తి లభించాలి. విద్యా విలువలకు న్యాయం జరగాలి. స్కిల్స్ నేర్పించే సార్లకు స్కేల్ పెరగాలి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో 600 మంది ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లను ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టుల్లో నియమించారు. ఇప్పటికీ ఇంకా 1700 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులను పార్ట్ టైంకు బదులుగా ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లుగా గుర్తించాలి. ఎస్జీటీ స్కేల్ కింద మినిమం బేసిక్ పేతో వేతనం ఇవ్వాలి. గత ప్రభుత్వంలోని పెద్దలు ఉపాధ్యాయులను తమ చుట్టూ తిప్పుకుని హామీలిచ్చి కాలం గడిపారు. దీంతో వీరంతా ఇతర కాంపిటీషన్ ఉద్యోగాలకు అర్హత కోల్పోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు న్యాయం చేస్తుందని వీరంతా ఎదురుచూస్తున్నారు.

– కనుకుంట్ల కృష్ణహరి, అధ్యక్షులు, ఆర్ట్–క్రాఫ్ట్ టీచర్స్ అసోసియేషన్

ఉపాధికి ఊపిరి స్కిల్ యూనివర్సిటీ

తెలంగాణ యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించడం హర్షించదగిన విషయం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో ఉద్యోగ సమస్య అనేది అత్యంత కీలకమైనది. ఆ సమస్యపైన ఇప్పటి వరకూ ఎవ్వరూ తగినంత శ్రద్ధ కనపరచకపోవడంతో అసంతృప్తి అట్లాగే మిగిలిపోయింది. చాలా మంది యువకులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాల మీదనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఏళ్ళ తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అయితే అందులో కూడా వారికి ఉపశమనం దొరకలేదు. ఇందులో రెండు విషయాలున్నాయి. ఒకటి ప్రభుత్వంలో ఉన్న ఖాళీలు భర్తీ కాకపోవడం ఒకటైతే, రెండవది ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ రంగంలో ఉన్న వృత్తి, నిర్మాణ, సేవా రంగాల్లో ఉద్యోగాల పట్ల తెలంగాణ యువకులు ఆసక్తి చూపకపోవడం. ఆయా రంగాల్లో పనిచేయడానికి నైపుణ్యం లేకపోవడం వల్ల ప్రైవేటు రంగంలో ఉన్న అవకాశాలను తెలంగాణ యువత అందుకోలేకపోతున్నారు. ఇంకొక నగ్న సత్యాన్ని మనం ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక మీద నియామకాలు పూర్తి చేసినప్పటికీ, తెలంగాణలో ఉన్న యువకుల నిరుద్యోగాన్ని నిర్మూలించడం అసాధ్యం. అది కేవలం 2 నుంచి 3 శాతం మంది యువతకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలదు. మిగతా 90 శాతం మంది యువత నిరుద్యోగులుగానే ఉండాల్సి ఉంటుంది.

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి అవుతున్న నగరం. ఎన్నో రకాలైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా వస్తు ఉత్పత్తి, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, హోటల్స్ రంగాల్లో లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో తెలంగాణ యువత శాతం చాలా తక్కువ. దీనికి కారణం కూడా మళ్ళీ నైపుణ్యం సమస్యే. ఇక్కడి యువతకు ప్రత్యేకమైన స్కిల్ డెవలప్‌మెంట్ లేకపోవడం వల్ల వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నా, ఆయా స్థానాల్లో స్థానిక యువతకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇతర రాష్ట్రాల యువతపై ఆధారపడుతున్నారు. ఓ వైపు... నైపుణ్య లేమి మరోవైపు తెలంగాణ యువకులకు ఇబ్బందికరంగా మారిన విచిత్ర పరిస్థితి ఇది.

ఆమాటకొస్తే మన రాష్ట్రంలోనే యావత్ దేశంలోనే నైపుణ్యం కలిగిన కార్మికుల సంఖ్య రాను రాను తగ్గిపోతున్నది. ఇప్పుడు పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగినవారు అతికొద్ది మంది మాత్రమే. వాళ్ళు కూడా చాలా సాధారణ నైపుణ్యం కలిగినవాళ్ళే. ఉన్నతమైన నైపుణ్యం, మధ్యరకమైన నైపుణ్యం కలిగిన కార్మికుల సంఖ్య అత్యల్పమనే చెప్పాలి. ఇక హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వాళ్ళలో సాధారణ నైపుణ్యం మాత్రమే ఉంది. ఇది దేశ ఆర్థిక పురోగతికి, వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడదు. మన దేశంలో ఉన్న 51 శాతం ఉద్యోగ అర్హత కలిగిన యువకులలో 2.2 శాతం మంది మాత్రమే ఆధునిక వృత్తిపరమైన శిక్షణను, 8.6 శాతం మంది మాత్రమే స్వల్ప నైపుణ్య శిక్షణను కలిగి ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక మిగిలిన వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణా లేదన్నది కఠిన వాస్తవం. అయితే ప్రపంచ వ్యాప్తంగా మారుతోన్న పరిస్థితులు, భారతీయ యువతకు, ప్రత్యేకించి హైదరాబాద్ లాంటి నగరం కలిగిన తెలంగాణ యువతకు మంచి భవిష్యత్ ఉంది. భారతదేశ జనాభాలో 25 సంవత్సరాలు కలిగిన యువత దేశ జనాభాలో 50 శాతం ఉంది. 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువత జనాభా 65 శాతం ఉంది.

తెలంగాణ యువతకు అంతర్జాతీయంగా, జాతీయంగా ఉద్యోగావకాశాలను అందించడం, స్థానికంగా ఉద్యోగ కల్పనతో పాటు స్వంతంగా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ముందుకు వెళ్ళడానికి దోహదం చేసేందుకు ఈ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన ప్రణాళికను రూపొందిచుకోవాలి. తెలంగాణ ఆర్థిక పురోగతికి, యువతరం పురోభివృద్ధికి ఇదొక మైలురాయిగా నిలవాలి.



మనదేశం ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా ఉంది. చైనాతో సహా యూరప్, అమెరికా లాంటి దేశాల్లో యువత శాతం తగ్గిపోయింది. అందువల్లనే అన్ని దేశాలూ భారతదేశం వైపు చూస్తున్నాయి. ఇండియన్ ఇంటర్‌నేషనల్ స్కిల్లింగ్ సెంటర్ ఏఏ దేశాల్లో ఎటువంటి వృత్తులకు అవకాశం ఉందో అటువంటి దేశాలతో ఒప్పందం చేసుకుంటున్నది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన తెలంగాణ స్కిల్ యూనివర్సిటీకి ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ఇది ఎంతో సమయానుకూలంగా జరిగిన నిర్ణయం.

దీనికి తోడు టాటా గ్రూప్ సహకారంతో రాష్ట్రంలోని 65 ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసుకోవడానికి ప్రభుత్వం తన కార్యాచరణను ప్రారంభించింది. ఇందుకుగాను టాటా గ్రూప్ 1500 నుంచి 2 వేల కోట్ల వరకు సహాయం అందించడానికి అంగీకరించింది. ఇది కూడా యువతలో నైపుణ్యం పెంచడానికి ఎంతో ఉపకరిస్తుంది.

తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు కానున్నది. దీనికి సంబంధించిన బిల్లును ఇటీవల శాసనసభ ఆమోదించింది. ఇది చట్టరూపం దాల్చింది. భారతదేశంలో స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు ప్రక్రియ 2015లో పార్లమెంటులో నేషనల్ స్కిల్ యూనివర్సిటీ బిల్లు ఆమోదించడం ద్వారా ప్రారంభమైంది. ఇప్పటి వరకు ప్రభుత్వ రంగంలో హర్యానా, మహారాష్ట్ర, అస్సాం, గుజరాత్‌లో ప్రభుత్వ రంగంలో స్కిల్ యూనివర్సిటీలు నడుస్తున్నాయి.

మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ప్రైవేట్ రంగంలో స్కిల్ యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారు. అయితే దక్షిణ భారత దేశంలో ప్రైవేటు రంగంలో గానీ, ప్రభుత్వ రంగంలో గానీ స్కిల్ యూనివర్సిటీలు లేవు. ఆ అవకాశం తెలంగాణ రాష్ట్రం అందిపుచ్చుకోవడం అభినందించదగిన విషయం. దక్షిణ భారతదేశంలో తొట్టతొలి స్కిల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఏర్పాటు కావడం మనందరం గర్వించదగ్గ విషయం. అటువంటి ఖ్యాతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దక్కించుకున్నారు.

తెలంగాణలో ఏర్పాటు అవుతోన్న స్కిల్ యూనివర్సిటీ తప్పనిసరిగా దేశంలోని ఇతర స్కిల్ యూనివర్సిటీల అనుభవాన్ని అధ్యయనం చేస్తుందని భావించాలి. అక్కడ అమలులో ఉన్న కోర్సులను, సమకాలీన అవసరాలనూ, ఈ యూనివర్సిటీ పరిశీలించి తగు కోర్సులను రూపొందించాల్సి ఉంటుంది. దీనితో పాటు, అంతర్జాతీయంగా ఉద్యోగ అవకాశాలను కూడా పరిగణనలోనికి తీసుకొని అందుకు తగినట్టుగా కోర్సులను, శిక్షణలను ఎంపిక చేసుకోవడం ద్వారా అక్కడి అవకాశాలను మన యువత అందిపుచ్చుకోగలదు. వీటన్నింటితో పాటు తెలంగాణలో ఉన్న వనరులు, అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. జాతీయంగా, అంతర్జాతీయంగా ఉద్యోగ అవసరాలతో పాటు స్వీయ ఉపాధి కల్పనకు పంటల ద్వారా వచ్చే ధాన్యం, పండ్లు, ఇతరత్రా ఆహార ఉత్పత్తులను అధికం చేసేందుకు ఫుడ్ టెక్నాలజీ, వ్యవసాయాధారిత పరిశ్రమల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ప్రత్యేకంగా కోర్సులను రూపొందించాల్సి ఉంటుంది. స్థూలంగా చెప్పాలంటే తెలంగాణ యువత అంతర్జాతీయంగా, జాతీయంగా ఉద్యోగావకాశాలను అందించడం, స్థానికంగా ఉద్యోగావకాశాల కల్పనతో పాటు స్వంతంగా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ముందుకు వెళ్ళడానికి ఈ స్కిల్ యూనివర్సిటీ తన ప్రణాళికను రచించుకుంటుందని, తెలంగా ఆర్థిక పురోగతికి, యువతరం పురోభివృద్ధికి ఇదొక మైలురాయిగా నిలుస్తుందని ఆశిద్దాం.

■ మల్లెపల్లి లక్ష్మయ్య

రేపు జేఎన్ఎస్‌లో జిల్లా స్థాయి క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 27: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 29న హనుమకొండ జేఎన్ఎస్‌లో జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వెల్లడించారు. అథ్లెటిక్స్, ఖో-ఖో, కబడ్డీ, రెజ్లింగ్, లాన్ టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



సీఎంఆర్ఎఫ్ స్కామ్‌లో.. మాజీ గులాబీలు?

- పేదోళ్లకు చికిత్స ముసుగులో అక్రమాలకు తెగబడ్డ ఆస్పత్రులు
- వైద్యం చేయకుండానే నకిలీ బిల్లులతో నిధులు స్వాహా
- మాజీ ఎమ్మెల్యేల పీఏలతో పాటు వైద్యులు, ఉద్యోగుల పాత్రపై ఆరా
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు ఆస్పత్రులపై సీఐడీ విచారణ షురూ
- డీఎస్పీతో పాటు ఇద్దరు సీఐలు, 10మందికి పైగా సిబ్బందితో సీఐడీ టీమ్
- మరో ఐదారు ఆస్పత్రుల్లోనూ దందా జరిగిందంటూ ఫిర్యాదులు?

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్).. పేదల వైద్యం కోసం సాయం అందించేలా రూపొందించిన పథకం. అలాంటి పథకంలో జరిగిన నిధుల స్వాహా కుంభకోణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ సహాయనిధిపై కన్నేసిన కొన్ని బడా అస్పత్రులు.. నకిలీ పేషేంట్లు, బిల్లులతో రూ.కోట్లు కొల్లగొట్టాయి. లేని రోగులను.. రోగాలను సృష్టించి.. ఎలాంటి చికిత్స, ఆపరేషన్లు చేయకపోయినా.. చేసినట్టుగా బిల్లులు పెట్టిన పలు యాజమాన్యాలు సొమ్ములు నొక్కేశాయని గ్రహించిన ప్రభుత్వం పలు ఆస్పత్రులపై కేసులు నమోదు చేసి సీఐడీ విచారణకు ఆదేశించింది. ఆ ఆస్పత్రుల జాబితాలో ఉమ్మడివరంగల్ జిల్లాకు చెందిన మూడు ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా.. రంగంలోకి దిగిన సీఐడీ.. కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారుల గురించి కూపీలాగుతోంది. ఈ స్కామ్ వెనుక అస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, అస్పత్రి ఉద్యోగులతో పాటు కొందరు మాజీ ఎమ్మెల్యేలు, వారి పీఏలు, గులాబీ నేతల పాత్ర ఉందనే ఫిర్యాదులు కూడా అందాయని సమాచారం. దీంతో అటు ప్రభుత్వం.. ఇటు సీఐడీ.. విచారణను వేగవంతం చేసినట్టు తెలుస్తోంది.

7

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి



అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి

- ఆదివాసీలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలి
- కేంద్ర, రాష్ట్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- కంటెయినర్ ఆస్పత్రుల ఏర్పాటు అభినందనీయం
- ములుగు జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మంత్రి సీతక్క ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం
- విద్యావేత్తలు, జాతీయ క్రీడాకారులతో భోజనం
- ప్రఖ్యాత రామప్ప దేవాలయం సందర్శన
- లక్నవరం ఐలాండ్‌లోని పర్యాటక కాటేజీలో బస

ములుగు, ఆగస్టు 27: 'అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి. ఆదివాసీలు, గిరిజనులు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తోంది. వీటిని అందిపుచ్చుకొని ప్రజలు,ముఖ్యంగా ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి. అలాగే విద్యతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని అందూ గుర్తించాలి' అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు గాను తొలిరోజైన మంగళవారం ఆయన ములుగు జిల్లాకు వచ్చారు. తొలుత గట్టమ్మ సమీపంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. గంటసేపు విశ్రాంతి తర్వాత ములుగు కలెక్టరేట్‌కు చేసుకున్న గవర్నర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికార యంత్రాంగంతో సమావేశమయ్యారు. మారుమూల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు కంటెయినర్ ఆస్పత్రులు ఏర్పాటుచేయడం అభినందనీయమని, వినూత్న ఆలోచనను అమలుచేసిన మంత్రి సీతక్కను అభినందించారు. ఆధునిక సమాజంలో ఆదివాసీలు, గిరిజనులు భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. పేదలకు మౌళిక వసతులు కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. గతంలో తాను రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఏజెన్సీ ప్రాంతానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా భౌగోళిక పరిస్థితులు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరుపై కలెక్టర్ టీఎస్.దివాకర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విస్తారమైన అడవులు, విశాలమైన గోదావరి తీరం, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దును కలిగి ఉన్నట్లు తెలిపారు. వర్షాకాలంలో 80కిపైగా పరివాహక గ్రామాలు గోదావరి ముంపుకు గురవుతాయని, వానాకాలంలో ముంపు బాధితులను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని వివరించారు. మాతాశిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిందని, సంక్షేమ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకు వచ్చి సమర్థవంతంగా అమలు చేస్తున్నా మని, సఖి కేంద్రం ద్వారా మహిళలకు భరోసా కల్పిస్తున్నావని తెలిపారు. ఎస్పీ శబరీశ్ శాంతిభద్రతల పరిరక్షణను వివరించారు.





అధికారులతో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెంకట్రావ్, అధికారులు

మేడారానికి జాతీయ హోదాకు చొరవ చూపాలి : సీతక్క

మేడారం మహాజాతరకు జాతీయ పండుగ హోదా

మిగతా 7వ పేజీలో..

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయండి..

- నగరంలో పలు పనులను పరిశీలించిన సీడీఎంఏ గౌతమ్


ఉనికిచెర్లలో వెంచర్‌ను పరిశీలిస్తున్న వి.పి.గౌతమ్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 27: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వెంచర్లను హైదరాబాద్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఏ) వి.పి.గౌతంతో పాటు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమి షనర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. ఉనికిచెర్ల వద్ద ఏర్పాటు చేసిన యునీ సిటీ వెంచర్, మడిపెల్లి వద్ద ఏర్పాటు చేసిన మా సిటీ వెంచర్, వరంగల్ నగరంలోని ఓ సిటీ వెంచర్‌తో పాటు ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లు, బాలసము ద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్‌లోని హైలెవల్ బ్రిడ్జిలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న

మిగతా 8వ పేజీలో..

రాజముద్ర రగడ

- బల్దియాలోని ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్ ఫ్లెక్సీలో తప్పిదం
- కాకతీయ తోరణం, చార్మినార్ లేని లోగో ముద్రణ
- సీఎస్‌ను ట్యాగ్ చేస్తూ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- వెంటనే పాత ఫ్లెక్సీ తొలగించి కొత్తది ఏర్పాటు



ఇటీవల ప్రతిపాదించిన కొత్త లోగో ముద్రించిన ఫ్లెక్సీ, దాని స్థానంలో పెట్టిన కొత్త ఫ్లెక్సీ

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 27: గ్రేటర్ వరం గల్ నగర పాలక సంస్థ అధికారులు చేసిన తప్పిదం తీవ్ర విమర్శలకు దారి తీసింది. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల హెల్ప్ డెస్క్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై వివాదం రేగింది. కాకతీయ కళాతోరణం, చార్మినార్ లోగోతో కూడిన రాష్ట్ర రాజముద్రను కాకుండా.. ఇంకా ఆమోదించని ప్రచారంలో ఉన్న కొత్త రాజముద్రను ముద్రించి తప్పిదం చేశారు. ఇది గమనించిన గ్రేటర్ వరంగల్ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు బల్దియా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విషయాన్ని కేటీఆర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఎక్స్ వేదికగా చీఫ్ సెక్రెటరీకి ట్యాగ్‌చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అప్రమత్తమైన అధికారులు.. యుద్ధ ప్రాతిపదికన పాత ఫ్లెక్సీని తొలగించి కొత్త ఫ్లెక్సీని ఆవిష్కరిం చారు. వివరాల్లోకి వెళితే..

రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ సమస్యలను పరిష్కరిస్తూ భూములను క్రమబద్ధీకరించాలని వారం కిందట జీవోను జారీ చేసింది. ప్రజలు 2020 ఆగస్టు 26లోపు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి భూములను క్రమబద్ధీకరిస్తూ ప్రచారం చేయాలని మునిసిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఈనెల 24 నుంచి కార్పొరేషన్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ సమస్యల పరిష్కారం కోసం అధికారులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టరేట్‌తో పాటు బల్దియా కార్యాలయంలో రెండు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఈఫ్లెక్సీల్లో ఇంకా అమలులోకి రాని ప్రచారంలో ఉన్న రాజముద్రను ముద్రించారు.

గమనించిన స్థానికులు, బీఆర్ఎస్ నాయకు లు.. బల్దియా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అలాగే ఫ్లెక్సీ విషయమై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా చీఫ్ సెక్రెటరీకి ట్యాగ్ చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దీంతో అధికారులు చేసిన తప్పును తెలుసుకుని మంగళవా రం పాత ఫ్లెక్సీని తొలగించి కొత్తదిఏర్పాటు చేశారు.

షోకాజ్ నోటీసులు జారీ

ఫ్లెక్సీని ముద్రించి కట్టించిన టౌన్‌ప్లానింగ్ పర్యవేక్షణాధికారికి మంగళవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడే షోకాజు నోటీజులు జారీ చేశారు. చేసిన తప్పుపై సంజాయిషీ ఇవ్వాలని కోరారు. దీంతో సదరు అధికారి రెండు పేజీలతో కూడిన వివరణ తయారు చేసి ఇచ్చారు. తాను తయారు చేయించిన ఫ్లెక్సీని కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులు కూడా చూశారని, వారు ఆమోదం తెలిపిన తర్వాతనే తాను ఫ్లెక్సీ కట్టించానని తెలిపారు. తాను తప్పు చేసినట్టు ఒక్కడినే బాధ్యుడిగా చేసి మెమో ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈ తప్పులో అందరూ బాధ్యులేనని అన్నారు. తాను ముద్రించి తెచ్చిన ఫ్లెక్సీని చూసిన అధికారులకు ఎందుకు మిన్నకుండి పోయారని ప్రశ్నించాడు. మరి తనతోపాటు పాటు ఉన్నతాధికారులకు కూడా షోకాజు నోటీజులు ఎందుకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

PUBLIC NOTICE

This is to inform to the public at large that our Corporation propose to sanction a Term Loan of Rs. 50.00 lakhs (Rupees Fifty Lakhs Only) to **Dr. Akula Sanjeevaiah, MBBS, M.D (General Medicine). C/o. M/s. Srujana Hospital**, H.No.20-286, Jaya Talkies Road, Parkal Town & Mandal, Hanamkonda District. Telangana under Practicing Doctor's Scheme. The loan is secured by following collateral security property.

COLLATERAL SECURITY :

Smt. Thota Ramadevi alias Akula Ramadevi, W/o. Sri. Akula Sanjeevaiah is offering Residential Open Plot bearing Plot No.3, adjacent H.No. 1-9-734/2, Plot land admeasuring 311.00 Sq.Yds or 261.00 Sq.Meters, covered by Sy.Nos.500 & 501, KUDA LRS approved vide Proceeding No.KUDAL030951/2015-17 dt. 04.02.2019, situated at Revenue Colony-2, Julywada, comes under GWMC, Hanamkonda Town & District, Telangana as collateral security. The surety is claiming title to the above property by virtue of Regd. Sale Deed Doc. No.1028/1989, dt.24.04.1989 (Jt.SRO-Warangal). The property is bounded by **East :** Plot No.4 Presently House of Smt. S. Lakshmi Sireesha bearing H.No.1-9-734/2, **West:** Plot No.2 of Vendors, **North :** 40'Road, **South :** Plot No.5 of Vendors Presently House of Smt. Indra Thakur bearing H.No.1-9-734/1.

Hence any person/institution, banks, having any claim/right/interest or any objections for mortgage of the above property in favour of our corporation shall inform to the undersigned in writing with the documentary proof/evidence within 7 days of this notice, otherwise it shall be deemed that the above property are free from encumbrance, charges, adverse claims and the Corporation will proceed further with the equitable mortgage transaction. Please note that objections received after the said notice period are not at all binding on the Corporation.

Date : 27.08.2024

Sd/- ASST. GENERAL MANAGER
A.P. STATE FINANCIAL CORPORATION
Beside Dist. Central Library, Balasamudram, Hanamkonda, Warangal-506001. Mobile No.8897255433, 9949358503

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కండి..

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ


సమావేశంలో మాట్లాడుతున్న రావు పద్మ

హనుమకొండ టౌన్, ఆగస్టు 27: బీజేపీ పార్టీలో చేరి వికసిత్ భారత్‌లో పాలు పంచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదు వర్క్‌షాపు మంగళవారం హంటర్‌రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో గెలవాలన్నా.. తెలంగాణలో పార్టీ బలపడి అధికారంలోకి రావాలన్నా.. సభ్యత్వాలు పెంచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ఉద్యమంలా కొనసాగుతోందని, ఆ స్ఫూర్తితో జిల్లా సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, ఒంటేరు జయ్‌పాల్, రాష్ట్ర నాయకులు చాడ శ్రీనివాసరెడ్డి, విజయచందర్‌రెడ్డి, కాళీప్రసాద్, రావుల కిషన్, సత్యనారాయణ, పులి సరోత్తం, కొలను సంతోరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుతోనే ఆహార ఉత్పత్తుల పెరుగుదల 6







ఆధునిక సాగుతోనే ఆహార ఉత్పత్తుల పెరుగుదల

నాబార్డు సీజీఎం సుశీల చింతల

ఐనవోలు, ఆగస్టు 27 : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాగు విధానంతోనే అహార ఉత్పత్తులను పెంపొందించుకోవాలని నాబార్డు సీజీఎం సుశీల చింతల తెలిపారు. వరంగల్ నాబార్డు క్లస్టర్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఐదు రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు వ్యవసాయ డ్రోన్‌ల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం నాబార్డు డీడీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం రాంనగర్ రైతు వేదికలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని సీజీఎం మాట్లాడుతూ.. సంప్రదాయ వ్యవసాయంలో టెక్నాలజీ మేళవింపు ఎంతో అవసరమని, అందుకు యూనివర్సిటీలు దోహదపడాలన్నారు. ఐటీ, నిర్మాణరంగాలు అభివృద్ధి చెందినంత మాత్రాన దేశం అభివృద్ధి చెందినట్లు కాదని, సాంకేతిక వ్యవసాయం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లన్నారు. వ్యవసాయాన్ని ఆధునీకరించుకోకపోతే భవిష్యత్‌లో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గి భయంకరమైన పరిస్థితులు ఎదురౌవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తడి, పొడి వరిసాగు విధానాన్ని అవలంభించడం వలన భావితరాలకు నీటి కటకట తప్పుతుందన్నారు. నాబార్డు, కార్నెల్ సత్‌గురు ఫౌండేషన్ (సీఎస్ఎఫ్‌డీ) సహకారంతో వ్యవసాయ డ్రోన్‌ల ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే తమ లక్ష్యమన్నారు.


డ్రోన్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం సుశీల

టెస్కాబ్ ఛైర్మ న్ మార్నేని రవీందర్‌రావు మట్లాడుతూ.. డ్రోన్‌ల పిచికారీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడానికి నాబార్డు, సొసైటీలు ఎల్లప్పుడు సహకారం అందిస్తాయన్నారు. వ్యవసాయశాస్త్రవేత్త ఉమ్మారెడ్డి మాట్లాడుతూ.. డ్రోన్‌ల పిచికారీ ద్వా రా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రైతులు సమష్టిగా ఉండి వ్యవసాయం చేస్తే నష్టాలు కలుగవన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ తప్పనిసరిగా ఏర్పడిందన్నారు. అనంతరం వేదిక పక్కనే ఉన్న పత్తిచేలో పురుగుల ముందును డ్రోన్ ద్వారా పిచికారీ చేసి ఐనవోలు, జఫర్‌గడ్ ఎఫ్‌పీవోలకు డ్రోన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీజీఎం టీజీఆర్‌వో స్వాతి తివారి, ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డీడీఎం రవితంగ, కార్నెల్ సత్‌గురు ఫౌండేషన్ ప్రతినిధి రాజేశ్వరి, ఐనవోలు, నెక్కొండ, జఫర్‌గడ్, హసన్‌పర్తి. నేలమ్మ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ కార్యదర్శి విజయ్‌కుమార్, స్పందన సర్వీస్ సొసైటీ కార్యదర్శి చొప్పరి సోమయ్య, పోతన ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి పి.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ క్రాప్స్ సంస్థ ప్రతినిధులతోపాటు ఆయా మండలాల రైతులు పాల్గొన్నారు.



మేరామాయాడి, సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎంపీ రాజేందర్, బంజార నేతలు


తీజ్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వడ్డెపల్లి, ఆగస్టు 27: తీజ్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో గోర్ బంజార తీజ్ ఉత్సవకమిటీ గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేరామాయాడి, సంత్ సేవాలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీజ్ పండగను గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా బంజార మహిళలు నిర్వహించిన ఆట పాటలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మల్లాడి తిరుపతిరెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, గోర్ బంజార తీజ్‌ఉత్సవ కమిటీ ప్రతినిధులు బిఎస్.నాయక్, బానోతు వెంకన్న నాయక్, వినోద్ లోక్ నాయక్, కిశోర్ నాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.





















కుటుంబ సభ్యులతో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సీతమ్మ

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు27: వందేళ్ల వృద్ధురాలు రావి సీతమ్మ జన్మదిన వేడుకలు తన మనవడు కొల్లి అనిల్‌కుమార్ - సౌజన్య దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. రావి సీతమ్మకు ఐదుగురు సంతానం కాగా, వారిలో ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వంద ఏళ్లు అయినా ఇప్పటికీ సీతమ్మ ఆరోగ్యంగా ఉండటంతో కుటుంబ సభ్యులు సీతమ్మ జన్మదినాన్ని పండుగలా నిర్వహించారు. సీతమ్మది ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కాగా, జన్మదిన వేడుకలను సీతమ్మ పెద్ద కుమార్తె స్వరూపరాణి కుమారుడు అనిల్ నివాసంలో సీతమ్మ కుమారులు, కుమార్తెలు, మనువలు, మనుమరాండ్లు, మునిమనమలు, మునిమనమరాండ్లు, బంధుమిత్రుల సమక్షంలో ఆడంబరంగా నిర్వహించారు. కాగా, సీతమ్మ స్వాంతంత్ర్య సమరయోధురాలిగా కీర్తిగడించింది.

హైడ్రాలాగే మనకూ కావాలి 'వాడ్రా'

ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 27: హైదరాబాద్‌లోని హైడ్రా వ్యవస్థలాగే వరంగల్ నగరానికి వాడ్రా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీజీవో భవన్‌లో మంగళవారం ఫోరంఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో మేధావుల సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ.. నగరాల అస్తవ్యస్థ విస్తరణ, చెరువులు, నాలాలలో వెలిసిన అక్రమ నిర్మాణాలు నగర పర్యావరణ వ్యవస్థను ధ్వంసం చేసి వరదల వంటి పెను విపత్తులకు కారణమవుతోందన్నారు. వరంగల్ నగరంలో చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురయ్యాయని, ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలంటే హైడ్రా లాంటి స్వతంత్ర్య వ్యవస్థ వరంగల్‌కు ఎంతో అవసరం అన్నారు. వరంగల్ నగర ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా వాడ్రాలో నిబంధనలు పొందుపరచాలన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు, అధికారుల ఒత్తిళ్లకు తలొగ్గని విధంగా వాడ్రా నిర్మాణం ఉండాలన్నారు. చట్ట వ్యతిరేకంగా అనుమతులు ఇచ్చిన అధికారులను, వాటి వెనుక ఉన్న రాజకీయ నాయకులపై కఠిన చర్యలు ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు లక్ష్మారెడ్డిలు చెరువుల పరిరక్షణ పర్యావరణ అంశాలను వివరించారు. ఈ సమావేశంలో హైడ్రా ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ తమ మద్దతును ప్రకటించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను సీఎం రేవంత్ రెడ్డికి పంపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తిరుణహరి శేషు, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధులు పెరుమాళ్ల లక్ష్మణ్, శ్రవణ్‌కుమార్, వేణు, ప్రొఫెసర్ వి జయబాబు, అనుమాండ్ల విద్యాసాగర్, జి.యాదగిరి, రాజ్‌మోహన్‌రావు, మండల పరశురాములుతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ స్కామ్‌లో.. మాజీ గులాబీలు?



- పేదోళ్లకు చికిత్స ముసుగులో అక్రమాలకు తెగబడ్డ ఆస్పత్రులు
- వైద్యం చేయకుండానే నకిలీ బిల్లులతో నిధుల స్వాహా
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు ఆస్పత్రులపై సీఐడీ విచారణ షురూ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన సీఎంఆర్ఎఫ్ స్కాం ఓరుగల్లులోనూ ప్రకంపనలు రేపుతోంది. పేదోళ్ల వైద్య సేవలకు కేటాయించే సీఎం సహాయనిధి పై కన్నేసిన కొన్ని బడా అస్పత్రులు.. నకిలీ పెషేంట్లు, బిల్లులతో రూ.కోట్లు కొల్లగొట్టాయి. లేని రోగులను.. రోగాలను సృష్టించి.. ఎలాంటి చికిత్స, ఆపరేషన్లు చేయకపోయినా.. చేసినట్టుగా బిల్లులు పెట్టిన పలు యాజమాన్యాలు సొమ్ములు నొక్కేశాయి. 'తీగ లాగితే డొంక కదిలింది' అన్న చందంగా అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. ఈ సీఎఆర్ఎఫ్ స్కామ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు అస్పత్రులపై కేసు నమోదు చేసి సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారుల గురించి కూపీలాగుతోంది. అయితే ఈస్కామ్ వెనుక అస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, అస్పత్రి ఉద్యోగులతో పాటు కొందరు మాజీ ఎమ్మెల్యేలు, వారి పీఏలు, గులాబీ నేతల పాత్ర ఉందనే ఫిర్యాదులు రావటంతో ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

నకిలీ బిల్లులతో రూ.కోట్లు స్వాహా..

ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య సేవల కోసం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సాయం అందజేస్తుంది. ఏదైనా రోగం వస్తే అస్పత్రిలో చికిత్స పొందిన వారికి సదరు అస్పత్రి ఇచ్చే బిల్లులను పరిశీలించి 50శాతం నుంచి 100శాతం వరకు ప్రభుత్వం బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కుల రూపంలో తిరిగి చెల్లిస్తుంది. కొన్ని వ్యాధులకు చికిత్స పొందుతుండగానే ఎమ్మెల్యేల నుంచి ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) అందిస్తారు. ఈ ఎల్‌వోసీ ఆధారంగా చికిత్స పూర్తయిన తరువాత సీఎంఆర్ఎఫ్ నుంచి డబ్బులు దవాఖానా ఖాతాలో జమ చేసుకుంటారు. దీన్ని అవకాశంగా తీసుకున్న కొన్ని ప్రైవేట్ అస్పత్రులు సీఎంఆర్ఎఫ్‌పై కన్నేశాయి. లేని రోగాలను, రోగులను సృష్టించాయి. నకిలీ రోగులను సృష్టించి, వారికి ఖర్చుతో కూడుకున్న వైద్యం చేసినట్టుగా నకిలీ బిల్లులు తయారు చేసి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో గ్రామాల్లోని కొంతమంది ఆర్ఎంపీలు, పీఎంపీల సాయంతో రోగుల పేర్లతో నకిలీ బిల్లులు తయారు చేసినట్టుగా సమాచారం. సీఎంఆర్ఎఫ్ డబ్బులు రోగుల ఖాతాలో జమ చేసిన తరువాత 15శాతం నుంచి 20శాతం వరకు నకిలీ రోగులకు, సహకరించిన ఆర్ఎంపీ లేదా పీఎంపీలకు ఇచ్చి, మిగతా సొమ్మును హాస్పిటల్‌కు చేరుతాయని సమాచారం. అయితే ప్రముఖ అస్పత్రుల బిల్లులే కావటంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆయా అస్పత్రులకు నిధులు మంజూరు చేసింది. ఇలా నకిలీ బిల్లులతో రూ.కోట్లాది నిధులు అస్పత్రులకు కాసుల పంట పండించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 అస్పత్రులు కాసులకు కక్కుర్తి పడి సీఎంఆర్ఎఫ్ సొమ్ము కాజేసినట్టుగా సీఐడీ అధికారులు గుర్తించారు. సీఎంఆర్ఎఫ్ సెక్షన్ అధికారి డాక్టర్ డీఎస్.మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరు ఎఫ్ఐఆర్‌లు, 17 కేసులను నమోదు చేసింది. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో హనుమకొండలోని రోహిణి అస్పత్రి, మహబూబాబాద్ జిల్లాలోని శ్రీసంజీవిని అస్పత్రి, సిద్ధార్థ హస్పిటల్‌పై కేసులు నమోదు చేసి సీఐడి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

స్కాంపై సీఐడీ విచారణ షురూ...

ప్రభుత్వ ఆదేశాలతో సీఐడీ అధికారులు విచారణ చేపట్టారు. సీఎంఆర్ఎఫ్‌లోని వ్యక్తులు, ప్రైవేటు దవాఖానాల యాజమాన్యాలు, కొందరు ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, అకౌంటెంట్ అధికారులు, గత ప్రభుత్వం కీలకంగా వ్యవహరించిన కొంతమంది రాజకీయనేతలు, నాటి ఎమ్మెల్యేలు, వారి పీఏలు అంతా చైన్‌లింక్‌గా ఏర్పడి ఈ కుంభకోణానికి తెరలేపినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. దీంతో వరంగల్, ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ భారీ కుంభకోణాన్ని విచారించేందుకు ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పాటు ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో కలిపి సుమారు పది మంది వరకు టీమ్‌తో విచారణ చేపట్టారు. మహబూబాబాద్‌లోని రెండు ప్రైవేట్ అస్పత్రులు, హనుమకొండలోని ఒక అస్పత్రిలో సీఐడీ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన రోగుల వివరాలు, వారికి వైద్యం చేసిన వైద్యుల పేర్లు, ఏ రోగానికి ఏ చికిత్స చేశారో.. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు, రోగుల వివరాలను, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రికార్డులను సీఐడీ అధికారులు పరిశీలించినట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు అస్పత్రులపైనే కేసులు నమోదైనా.. మరో ఐదారుఅస్పత్రులపై కూడా ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది. వాటిపై కూడా సీఎంఆర్ఎఫ్ విభాగం అధికారులు సమాచారాన్ని సేకరిస్తున్నారని, సరైన ఆధారాలు లభిస్తే వాటిపై కూడా సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

స్కాంలో గులాబీ నేతల పాత్రపై ఆరా..?

గత ప్రభుత్వ హయంలోనే ఈ భారీ స్కాం జరిగినట్టుగా అధికారులు గుర్తించారు. గత 2023 ఏప్రిల్ నెల వరకు జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీపైనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో అప్పటి గులాబీ పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడి, పాత్ర ఏమైనా ఉందా అనే కోణంలో కూడా సీఐడీ విచారణను చేపట్టినట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహబూబాబాద్ జిల్లాలో సీఎంఆర్ఎఫ్ స్కాంలో అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే పాత్ర ఉందనే ప్రచారం జరుగుతోంది. వైద్యులపై ఒత్తిడి తెచ్చి భారీగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు నకిలీ రోగులకు పంపిణీ చేసి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు తాజా మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు కూడా ఈ స్కాంలో భారీగా వెనుకేసుకున్నారని, అలాగే హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని కొందరు మాజీ ఎమ్మెల్యేల పాత్ర ఉందనే చర్చ జరుగుతోంది. కొంతమంది మాజీ ఎమ్మెల్యేల పీఏలు కూడా సీఎంఆర్ఎఫ్ స్కామ్‌లో చక్రం తిప్పినట్టు సమాచారం. కొన్ని ప్రైవేట్ అస్పత్రుల యాజమాన్యాలతో సత్సంబంధాలు ఉండటంతో అప్పటి గులాబీ లీడర్లు సీఎంఆర్ఎఫ్‌ను తమకు అనుకూలంగా వాడుకున్నారనే ప్రచారం జరుగుతోంది. సీఎంఆర్ఎఫ్ సెక్షన్ అధికారి డాక్టర్ డీఎస్.మూర్తి ఇచ్చిన ఫిర్యాదులో కూడా రాజకీయ నేతలు, వారి అనుచరుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేయటంతోనే ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. 2023 ఏప్రిల్ వరకు ఇచ్చిన సీఎంఆర్ఎఫ్‌పైనే ఫిర్యాదులపైనే ప్రస్తుతం విచారణ జరుగుతోందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై తీగ లాగితే.. 'గులాబీ' డొంక కదులుతుందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. కాగా, సీఐడీ రంగంలోకి దిగటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ నేతల ప్రమేయం ఉందా లేదా అనేది తేలటంతో పాటు ప్రైవేటు అస్పత్రుల్లో జరిగిన సీఎంఆర్ఎఫ్ స్కాం ఎంత అనే అంశాలు కూడా త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అస్పత్రులు

రోహిణి మెడికేర్ ప్రవేటు లిమిటెడ్ (హనుమకొండ), సిద్ధార్థ హస్పిటల్ (మహబూబాబాద్), శ్రీసంజీవిని హస్పిటల్ (మహబూబాబాద్).

ఎంఏ తెలుగు ప్రవేశ గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 27: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు ప్రవేశాల గడువును పొడిగించినట్లు వరంగల్ జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబూరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 24తోనే ప్రవేశాల గడువు ముగియగా విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నెల 31 వరకు రూ.100 అలస్య రుసుముతో ప్రవేశాలు పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు తెలుగు యూనివర్సిటీ వెబ్‌పోర్టల్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

1న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 27: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్న ఎంపికలో 1జనవరి 2013 తరువాత జన్మించిన వారు పాల్గొనవచ్చునన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 4 బాలురు, 4 బాలికలను సెప్టెంబరు చివరి వారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు వెంట తీసుకొని సెప్టెంబరు 1న టీటీడీ కల్యాణ మండపంలో ఉదయ 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదిచాలని ఆయన కోరారు.

నేడు వరంగల్ -1 డిపోలో డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, ఆగస్టు 27: వరంగల్ -1 డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్ధిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లల్లో ప్రయాణించే ప్రయాణికులు డయల్ యువర్ కార్యక్రమంలో తమ సలహాలు, సూచనలు ఫోన్ నెంబర్‌లో 99592 26047 తెలపాలని కోరారు.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ

జనగామ రూరల్, ఆగస్టు 27: జనగామ మెడికల్ కళాశాలలో, జిల్లా ప్రభుత్వ జనరల్ అసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టులకు దరఖాస్తులను అహ్వానిస్తునట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వివిధ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్-1, అసోసియోట్ ప్రొఫెసర్-4, అసిస్టెంట్ ప్రొఫెసర్-6, సీనియర్ రెసిడెంట్-25లకు దరఖాస్తులను అహ్వానిస్తునట్లు ఆయన తెలిపారు. ఈ నెల 29, 30న ఎంసీహెచ్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

ట్యాంక్‌బండ్‌పై ఒద్దిరాజు సోదరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ప్రముఖ పాత్రికేయుడు దేవులపల్లి అమర్



సీనియర్ జర్నలిస్టు రాజమల్లుయాదవ్‌ను సన్మానిస్తున్న అమర్, ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు బాధ్యులు

ఇనుగుర్తి, ఆగస్టు 27: హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై తెలంగాణలో మొట్టమొదటి తొలి తెనుగు పత్రిక స్థాపించిన ఒద్దిరాజు సీతారామచందర్‌రావు, రాఘవ రంగారావు సోద రుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రముఖ పాత్రికేయుడు దేవులపల్లి అమర్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సుభాష్ ఆధ్వ ర్యంలో మంగళవారం ఇనుగుర్తిలో ఏర్పాటు చేసిన శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలోని మారుమూల ప్రాంతమైన ఇనుగుర్తిలో తొలి తెలుగు భాషలో ప్రచురితమైన తెనుగు పత్రికను స్థాపించిన ఒద్దిరాజు సోదరులు నైజాం ప్రభుత్వానికి వ్యతి రేకంగా పోరాడారని చెప్పారు. ఈ తెనుగు పత్రిక ఖ్యాతి ఇనుగుర్తికి మాత్రమే పరిమితం కావడం చాలా బాధాకర మన్నారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయా లని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సమయం ఏమి వి ంచిపో లేదని, ఈ గ్రామం నుంచి రాజ్యసభకు ఎంపికైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సైతం ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి ఒద్దిరాజు సోదరుల విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో సైతం తెనుగు పత్రిక ఖ్యాతిని ఇమడింప చేశారని కొనియాడారు.

అనంతరం మహబూబాబాద్ జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులు వేల్పుల రాజమల్లుయాదవ్, బండి సంపత్‌కుమార్, పర్కాల రవీందర్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమోంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ మంగ్యానాయక్, వద్దిరాజు పెద్దవెంకన్న, సాహితీవేత్తలు లక్ష్మీకాంతారావు, వద్దిరాజు రాంబాబు, సీతారామచందర్‌రావు, వేణుగోపాల్ రావు, వినయ్‌బాబు, అనిల్‌కుమార్, సతీష్, చంద్రప్రకాష్, కల్యాణ్‌చంద్ర, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎంజీఎం నిర్వహణ అధ్వానం

'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 27: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ పాలనలో పూర్తిగా అధ్వానంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో చేసిన ఓ పోస్టు చర్చనీయాంశమైంది. ఎంజీఎంలో పేద రోగులకు అందించేందుకు మందులు కూడా కరువయ్యానని, దాంతో రోగులు డబ్బులు చెల్లించి మరీ మందులు కొనుక్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే ఎంజీఎం సమస్యల వలయంలో ఉందని విమర్శించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2,711	2,572
మక్కలు (బిల్టీరకం)	2,885	2,572
పల్లికాయ (పచ్చిది)	4,300	3,400
పల్లికాయ (సూక)	6,310	5,200
కందులు	8,652	8,652
పెసళ్లు	6,150	2,659
పత్తి	7,600	5,000
పసుపు (కాడి)	12,233	11,666
పసుపు (గోల)	12,059	11,635
తేజ మిర్చి	12,500	8,500
తేజ ఏసీ	18,000	15,000
వండర్‌హాట్ ఏసీ	16,000	13,000
యూఎస్341 ఏసీ	14,000	11,000
తాలు మిర్చి	6,000	3,000

ఈఆర్‌సీ నియామకాల్లో పారదర్శకత లోపించింది

టీజీఈఆర్‌సీ అభ్యర్థుల ఆరోపణ

హనుమకొండ టౌన్, ఆగస్టు 27: తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులెటరీ కమిషన్‌లో నియమించబడ్డ ఉద్యోగుల ఎంపికలో పారదర్శకత లోపించిందని టీజీఈఆర్‌సీ అభ్యర్థులు ఆరోపించారు. గత మార్చిలో టీజీ ఈఆర్‌సీలో 11 పోస్టులకుగానూ నోటిఫికేషన్ ఇవ్వగా, టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల్లోని పలువురు ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. జూలై 17, 18, 19 తేదీల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. కాగా 11 పోస్టుల్లో పవర్ సెక్టార్‌లోని జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అవకతవకలు జరిగాయని, వెంటనే ఆ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ విభాగంలో ఫీల్డ్‌లో పనిచేస్తున్న అభ్యర్థులకు మాత్రమే డిప్యూటీ డైరెక్టర్స్, జాయింట్ డైరెక్టర్ పోస్టుల్లో ప్రాధాన్యత ఉంటుందని చెప్పి 24 యేళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం డీఈగా పనిచేస్తున్న వారిని కాదని కార్యాలయంలో పనిచేసే టీజీఎస్పీడీసీఎల్ డిస్కమ్‌కు చెందిన వ్యక్తికి ఉద్యోగం కట్టబెట్టారన్నారు. ఇంటర్వ్యూలకు వీడియోగ్రఫీ లేకుండా, షార్ట్‌లిస్టును, ఫలితాలను వెబ్‌సైట్‌లో పెట్టకుండా గోప్యంగా కొంతమందికి ఫోన్‌లు చేసి ఉద్యోగానికి ఎంపికయ్యారని తెలియజేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నియామకాలపై పలు అనుమానాలున్నాయని, వీడియో రికార్డు సమక్షంలో తిరిగి ఇంటర్వ్యూలు నిర్వహించాలని టీజీఈఆర్‌సీ బాధిత అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఏ ప్రతిపాదికన ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారో తెలియజేయాలని టీజీఈఆర్‌సీకి ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేశామన్నారు.

రామప్పకు మళ్లీ వస్తా..

దేశంలో ఇలాంటి శిల్పకళ ఎక్కడాలేదు.. : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



కోటగుళ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ వర్మ



ములుగు కలెక్టరేట్‌లో అధికారులతో..



కోటగుళ్ల శిల్పాలను పరిశీలిస్తున్న గవర్నర్

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 27: 'దేశం మొత్తం పర్యటించినా రామప్ప లాంటి సుందరమైన దేవాలయం మరెక్కడా లేదు. అలాంటి సుందరమైన రామప్పకు మళ్లీ వస్తా. కుటుంబ సమేతంగా వచ్చి సందర్శిస్తా' అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్‌తో కలిసి పర్యటించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయనకు దేవాలయ వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరుడికి గవర్నర్ ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆయన్ను పట్టువస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ రామప్ప దేవాలయం అబ్బురపరిచిందని, ఇక్కడి శిల్పకళా సంపద ఎంతో అద్భుతమన్నారు. దేశంలో ఇలాంటి సుందరమైన దేవాలయాన్ని ఇక్కడే చూస్తున్నానని, యునెస్కో గుర్తింపు లభించడం హర్షణీయమన్నారు. ఈ గుర్తింపు ఎప్పుడో దక్కాల్సిందన్నారు. రామప్ప సరస్సు ఒక సరోవరంలా ఉందని కితాబిచ్చారు. ఆయన వెంట ములుగు అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, ప్రొఫెసర్ పాండురంగారావు, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, పురావస్తు శాఖ జిల్లా అధికారి మల్లేశం, టూరిజం అధికారి సూర్యకిరణ్, దేవాదాయ శాఖ ఏసీ సునీత, తహసీల్దార్ సదానందం, పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ అధికారులు ఉన్నారు.

కోటగుళ్లను సందర్శించిన గవర్నర్

గణపురం : భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయుల కట్టడాలు, కోటగుళ్లను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితులు కుంభమేళా, మేళతాళాలతో ఆయనకు ఆలయంలోకి స్వాగతం పలికారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు గవర్నర్‌ను సన్మానించి, ఆశీర్వచనాలు అందజేశారు. కోటగుళ్ల ఆవరణలో గతంలో తవ్వకాల్లో బయల్పడిన శిల్పాలను ఆయన సందర్శించారు. సుమారు 30 నిమిషాల పాటు గవర్నర్ పర్యటన కొనసాగింది. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ మాట్లాడుతూ కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే గొప్ప కట్టడం కోటగుళ్లని కొనియాడారు. 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగల్లును పరిపాలించినప్పుడు ప్రజల సౌకర్యార్థం అద్భుత కట్టడాలు నిర్మించడం గొప్ప విషయమన్నారు. కాకతీయుల కళా సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



రామప్ప ఆలయం ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి

(5వ పేజీ తరువాయి)

దక్కేలా చొరవ చూపాలని మంత్రి సీతక్క గవర్నర్‌ను కోరారు. త్రిపుర డిప్యూటీ సీఎంగా, మంత్రిగా పనిచేసిన క్రమంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికోసం పాటుపడ్డారని, తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటగా ములుగు జిల్లా పర్యటనకు రావడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ములుగుప్రాంతంలో రాష్ట్రంలోనే అత్యధికంగా ఆదివాసీ, గిరిజన ప్రజలు నివసిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన సమ్మేళనమైన మేడారంసమ్మక్క, సారలమ్మ జాతర రెండేళ్లకోసారి జరుగుతుందని తెలిపారు. ఈప్రాంత సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారమందిస్తోందన్నారు.

క్రీడాకారులు, విద్యావేత్తలతో గవర్నర్ భేటీ

జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందిన విద్య, సామాజికవేత్తలు, కవులు, క్రీడాకారులతో ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గవర్నర్ జిష్ణుదేవ్ భేటీ అయ్యారు. వారితో కలిసి భోజనం చేశారు. అంతకుముందు మంత్రి సీతక్క జిష్ణుదేవ్ వర్మతో ప్రత్యేకంగా సమావేశమై జిల్లా ప్రాధాన్యతను వివరించారు. గవర్నర్ భేటీలో ప్రొఫెసర్ పాండురంగారావు, రచయిత రాచర్ల గణపతి, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పాలడుగు వెంకటేశ్వర్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అంబటి శ్రీజన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య, రెజ్లింగ్ క్రీడాకారిని చల్ల మౌనిక, జిమ్నాస్ట్ పి.రజిత, పర్యావరణ పరిశోధకుడు కాజాంపు రం దామోదర్, సోషల్ వర్కర్ కొమురం ప్రభాకర్ పాల్గొన్నారు. గవర్నర్ పర్యటనలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఓఎస్డీ మహేష్ గీతే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేటి పర్యటన ఇలా..

మంగళవారం రాత్రి లక్నవరం పర్యాటక కాటేజీలో బస చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ బుధవారం ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు లక్నవరం అందాలను వీక్షిస్తారు. ఆతర్వాత వరంగల్ చేరుకుని సాయంత్రం 6గంటలకు వరంగల్ కోటను సందర్శించి కాకతీయుల కాలంనాటి అపురూప శిల్పసంపదతో పాటు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన కోట అభివృద్ధి పనులను ఆయన పరిశీలిస్తారు. ఇక మూడోరోజైన గురువారం జనగామ జిల్లాలో పర్యటించనున్నారు.

పరీక్షల విభాగం ఉద్యోగులు నిజాయితీగా పనిచేయాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 27: వర్సిటీ పరీక్షల విభాగంలో పనిచేసే ఉద్యోగులందరూ నిజాయితీగా పనిచేస్తేనే వర్సిటీకి మంచి గుర్తింపు లభిస్తుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. మంగళవారం వర్సిటీలో ఎంపిక చేసిన బోధనేతర ఉద్యోగులకు నాలుగు వారాల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ చట్టం, స్టాట్యుట్యూట్, రోజువారి పరిపాలన, అకౌంట్స్, ఆడిట్, మాడ్యుల్‌లో పరీక్షల భాగం అనే అంశంపై కంప్యూటర్ సైన్స్ విభాగంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల ఫీజుల చెల్లింపు నుంచి ఫలితాల విడుదల వరకు ప్రక్రియను వివరించారు. పరీక్షల విభాగం పనితీరుపైనే వర్సిటీ పేరు, ప్రతిష్ఠలుంటాయని చెప్పారు. ఉద్యోగులు నిజాయితీగా, పారదర్శకంగా, జవాబుదారీగా పనిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో సెల్ఫ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనారావు, ఏఆర్ డాక్టర్ కోలా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వేయిస్తంభాలగుడికి గవర్నర్

విస్తృతంగా ఏర్పాట్లు.. భారీ భద్రత..



వేయిస్తంభాల గుడిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

హనుమకొండ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హనుమకొండ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన వేయిస్తంభాల గుడిని సందర్శించనున్న సందర్భంగా అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు భారీ బందోబస్తు కల్పిస్తున్నారు. మంగళవారం సాయంత్రం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ సీఐ సతీష్ కుమార్, ట్రాఫిక్ సీఐలతో పాటు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతరావు, ఆర్‌డీవో వెంకటేశ్, డీసీపీ సలీమా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఈవో వెంకటయ్య, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్‌ను ఆలయ తూర్పు ద్వారం గుండా అధికారిక లాంఛనాలతో పూర్ణకుంభంతో స్వాగతించి, గర్భాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పూజ అనంతరం ఆలయ ఆవరణలో పునర్నించిన కల్యాణ మండపాన్ని సందర్శిస్తారు. గవర్నర్ సాయంత్రం 4.40 గంటలకు వేయిస్తంభాల గుడిని సందర్శిస్తారు. అరగంట పాటు ఆలయంలో గడుపుతారు. సాయంత్రం 5.10 గంటలకు తిరిగి వెళతారు. అనంతరం అక్కడి నుంచి భద్రకాళి దేవాలయాన్ని సందర్శిస్తారు.

నందనం సొసైటీ సేవలు భేష్

సొసైటీని సందర్శించిన నాబార్డు సీజీఎం సుశీల చింతల

ఐనవోలు, ఆగస్టు 27: నందనం రైతు సేవా సహకార సంఘం (సొసైటీ) సేవలు భేషుగ్గా ఉన్నాయని నాబార్డు సీజీఎం సుశీల చింతల అన్నారు. మంగళవారం నందనం సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెకు పాలకవర్గం ఘన స్వాగతం పలికింది. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎంను ఆమె ప్రారంభించారు. సంఘం లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సొసైటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు.సంఘం లావాదేవీలు, లోన్ రికవరీ, బంగారం రుణాల డిపాజిట్లు వివిధ అంశాలపై నందనం సొసైటీ(టెస్కాబ్) ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ సీఈవో వజీర్‌సుల్తాన్, సొసైటీ సీఈవో సంపత్, డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, పద్మ, ఎలేంద్ర, రాంచంద్రయ్య, ఎసోబ్, కుమార్, సంపత్ పాల్గొన్నారు. ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని నాబార్డు సీజీఎం సుశీల చింతల సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు వేద ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావుతోపాటు నాబార్డు ప్రతినిధులు, దేవస్థానం మాజీ ఛైర్మన్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాధుల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• డివిజన్లలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

• ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 27: వ్యాధులు విజృంభిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం 52 డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని వైద్యశాఖను ఆదేశించారు. వైద్యశిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం అలీపుర బడిమసీద్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణాలపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల కావాలని అభ్యర్థించిన మహిళలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సైడ్‌డ్రైన్, కమ్యూనిటీ హాల్, ఇతరత్రా పనుల కోసం అంచనాలు ఇస్తే తక్షణమే నిధులు మంజూరు చేస్తానన్నారు. ఆరుగ్యారంటీల్లో భాగంగా ప్రజలను నుంచి వస్తున్న అభ్యర్థనలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మద్దినాల చెరువును నీటితో నింపాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రైతుల వినతి



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

వేలేరు, ఆగస్టు 27: వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో గల మద్దినాల చెరువును నింపాలని మల్లికుదుర్ల గ్రామస్థులు మంగళవారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలోకి కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆశించిన మేర వర్షాలు కురియకపోవడంతో మద్దినాల చెరువులోకి నీరు చేరలేదన్నారు. చెరువు ఆయకట్టు కింద సాగుచేసిన పంటలకు సాగు నీరు అందక ఎండిపోయే దశకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి చెరువును నింపాలని కోరారు. అలాగే ధర్మసాగర్ నుంచి గండిరామారం వెళ్లే పైపులైన్‌కు మధ్యలో సోడశపల్లి క్రాస్ వద్ద ఎర్రకుంటలోకి నీరు చేరేందుకు పైపు లైన్ నిర్మాణం కోసం గతంలో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఆ పనులను వేగ వంతం చేసి నీటితో చెరువులు నింపి పంటలకు సాగు నీరు అందించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి పంటలు ఎండిపోకుండా సాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ రవిందర్‌యాదవ్, రైతులు రాజు, సాంబరాజు, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా లాంటి వ్యవస్థను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి

కాళోజీ జంక్షన్, ఆగస్టు 27: ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన హైడ్రా లాంటి వ్యవస్థను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ కోరారు. మంగళవారం ఉదయం హనుమకొండలోని రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజధాని నగరంలో నిష్పక్షపాతంగా అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రా పని తీరును స్వాగతిస్తున్నామని అన్నారు. వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ.. వరంగల్ నగరంలోని దేవాలయ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండలోని పద్మాక్షి, సిద్ధేశ్వర ఆలయాల భూములతో పాటు వాటి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని వెలికి తీయాలన్నారు. భద్రకాళి చెరువులోని భూమిని అక్రమంగా కబ్జా చేస్తున్నారని ఆయన వివరించారు. అలాగే హనుమకొండ మండలంలోని భూములను కాపాడేందుకు హైడ్రాలాంటి ప్రత్యేక వ్యవస్థ అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సలహా సంఘం సభ్యులు రావుల రంజిత్‌కుమార్, కవిరాజ్, ఇందిర, జోత్స్న, సతీష్, న్యాయవాదులు హైమావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు27: హైదరాబాద్ తరహాలో వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు అనే అనుమానంతో ఇటీవల కాలంలో బల్దియా కూల్చివేతల కార్యక్రమం చేపట్టింది. ఇరవై, ముప్పై ఏళ్లుగా చెరువు శిఖం భూములలో గుడిసెలు, ఇండ్లు నిర్మించుకున్న పేదలకు నగర పాలక సంస్థ నుంచి స్థలాలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. దీంతో సుమారు 200 మందికి పైగా బాధితులు వరంగల్ నగరంలో కూల్చివేతలకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించినట్టు మంగళవారం వెల్లడించారు. బాధితుల పిటిషన్‌పై జస్టిస్ వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. వరంగల్ నగరంలో ఎలాం టి సర్వేలు నిర్వహించకుండా ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు ఉన్నాయని బల్దియా ఆరోపణలు చేస్తోందని, పిటిషన్‌ల తరఫు న్యాయవాది వాదించారు. 30నుంచి 60 చదరపు గజాలలోపే నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని న్యాయవాది వాదించినట్టు వారు తెలిపారు. నిరుపేదలను గుడిసెల నుంచి వెళ్లగొట్టవద్దని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గుడిసెలు వేసుకున్న నిరుపేదలు సంతోషం వ్యక్తం చేశారు.

నగరంలో డ్రగ్స్ కంట్రోల్ టీమ్ తనిఖీలు

వరంగల్ క్రైం, ఆగస్టు 27: డ్రగ్స్ కంట్రోల్ టీమ్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణ కోసం డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఇటీవల ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. డ్రగ్స్ కంట్రోల్ టీమ్ మంగళవారం నగరంలోని పలు చోట్ల తనిఖీ చేపట్టారు. జాగిలాలతో బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల పరిసరాల్లో తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తుల సమాచారం సేకరించారు. వీరి తనిఖీలతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా పోలీసులు బస్టాండ్‌లో తనిఖీలు చేయడంతో ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది.

భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్



కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు27: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు కార్మికులు ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌వోకు అందజేశారు. ధర్నాలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, ఆఫీసర్ బేరర్స్ పుల్ల అశోక్, ఆలకుంట మల్లయ్య, వల్లెపు రాజు, సుధాకర్, రానమల్ల వెంకటేష్, ప్రభాకర్, సూర్యనారాయణ, వనజ, ఉడుత శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి పల్లె దవాఖానాల్లో ట్రైయిడాట్ పరీక్షలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 27: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా)ల్లో ఇకనుంచి హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు సూచించారు. మంగళవారం ఎంజీఎం అకడమిక్ హాలులో ఎంఎల్ హెచ్‌పీలు, సంబంధిత ఏఎన్ఎంలకు దీనికి సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీకి సంబంధించిన వివిధ అంశాలతోపాటు టెస్టింగ్ మార్గదర్శకాలు, టెస్టింగ్ విధానాన్ని వివరించారు. ప్రస్తుతం ఐసీఆర్‌టీసీలు, ప్రాథమిక ఆరోగ్యయ కేంద్రాలలో ఈ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కూడా చేయనున్నట్లు తెలిపారు. వివిధ లైంగిక సంబంధిత వ్యాధులను వివరించి హైరిస్క్ గ్రూపులు, గర్భిణులకు తగిన కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, జిల్లా మాస్‌మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ స్వప్నమాధురి, రామకృష్ణ, కమలాకర్, సురేశ్, నరేశ్, మహేందర్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయండి..

5వ పేజీ తరువాయి

పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం కుడా కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎంను కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీవో అజిత్‌రెడ్డితో పాటు కుడా సిబ్బంది పాల్గొన్నారు.

కుడాలో సమీక్షా సమావేశం

కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో మంగళవారం హైరాబాద్ సీఎం అధికారి గౌతం జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. కుడా, జీడబ్ల్యుఎంసీల పరిధిలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీ గౌతం మాట్లాడారు. కుడా పరిధిలో జరుగుతున్న పనులలో వేగం పెంచి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 9లోపు కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలన్నారు. నయీంనగర్ వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, షేక్ రిజ్వాన్ బాషా, కుడా వైస్ ఛైర్మన్ అశ్విని తానాజీ వాకడే, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, హెచ్‌వో రమేష్, బల్దియా డీసీ రవీందర్, కుడా ఈఈ భీంరావు, ఏఈలు శ్రీకాంత్, సతీష్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌తో సంబరాలు



వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో బాణాసంచాలు పేల్చి సంబరాలు చేసుకుంటున్న భారత జాగృతి శ్రేణులు

వడ్డెపల్లి, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరై విడుదల కావడాన్ని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్ చౌరస్తాలో భారత జాగృతి శ్రేణులతో పాటు బీఆర్ఎస్ నేతలు బాణా సంచాలను పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం విజయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితను అన్యాయంగా జైలుకు పంపారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోదా కిరణ్, ఇమ్మడి లోహిత రాజు, జాగృతి రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రవీణ్‌కుమార్, కోగిల మహేష్, అమ్మ వేణు, శ్రీకాంత్‌చారి, ఆకుల మధు, నరేంద్ర, వినోద్, స్నేహిత్, రమేష్, రవి, మహేష్, వంశీ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

• మడికొండ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మడికొండలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఈదురు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాశేశ్వరపు రాజేందర్, తూర్పాటి అబ్బసాయిలు, గంగారపు వీరేష్, గోపనబోయిన రాజు, వస్కుల వెంకటస్వామి, నర్ర రమేష్, బుర్ర రమేష్, మిర్యాల రమేష్, మునిగాల డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

• హనుమకొండ చౌరస్తా: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయి తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం హనుమకొండ చౌరస్తాలో స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. నయీం ముఖ్య అతిథిగా హాజరై స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌గౌడ్, అబ్దుల్‌కలామ్, ఇస్మాయిల్, సుధాకర్, సలీం, మహిళ నాయకురాలు నాయిని సరస్వతి, ఆకుల విజయ, రమ, కె.దేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 27: శ్రావణమాసంలో బహుళ అష్టమి రోహిణి తిథితో కూడిన వేళ మంగళవారం వైష్ణవ సంప్రదాయపరులు శ్రీకృష్ణ అష్టమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట కృష్ణుని విగ్రహాలను అందంగా అలంకరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నగరంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో రాత్రి 7 గంటల నుంచి ప్రారంభమైన వేడుకలు 10 గంటల వరకు కొనసాగాయి. హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీ భూనీలా సమేత వెంకటేశ్వరాలయంలో ఆలయ అర్చకులు దేశికన్, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు జరిగాయి. ముఖ్యంగా వందలాది మంది మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. అదే విధంగా హనుమకొండ బ్రాహ్మణవాడలోని శ్రీగోదా రంగనాయక ఆలయంలో ఆలయ అర్చకులు కలకోట రాఘవచార్య, కలకోట నర్సింహాచార్యుల ఆధ్వర్యంలో కృష్ణ అష్టమి వేడుకలు జరిగాయి. ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయంలో, రెవెన్యూ కాలనీ రామాలయంలో, సీతారామచంద్రస్వామి చిన్న కోవెలలో మంగళవారం రాత్రి భక్తులతో కిటకిటలాడాయి.

• హనుమకొండ చౌరస్తా: హనుమకొండ కుమార్‌పల్లి జెండా సమీపంలో శ్రీకృష్ణ జయంతి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉట్లు కొట్టే కార్యక్రమంలో యువత, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుమార్‌పల్లి శ్రీకృష్ణ జయంతి కమిటీ సభ్యులు దోర్నాల నరేందర్ యాదవ్, గడల సురేందర్, అశోక్ యాదవ్, గజ్జి సాగర్ యాదవ్, రాజు యాదవ్, రవికాంత్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తున్న వార్డెన్లను సస్పెండ్ చేయాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 27: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో అలసత్వంతో పనిచేస్తూ విద్యార్థులను పట్టించుకోని హాస్టళ్ల వార్డెన్లను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు సక్రమంగా విధులకు రావడం లేదన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదన్నారు. ఇటీవల ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో నిర్వహించిన సర్వేలో హాస్టళ్లలో అనేక సమస్యలను విద్యార్థులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. వాటిని వార్డెన్లకు చెబుదామంటే హాస్టళ్లకు రావడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి సదరు వార్డెన్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.రెడ్డి, జశ్వంత్, పురుషోత్తం, సాయికుమార్, సాయి సందీప్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ న్యాయ కళాశాల గుర్తింపును కాపాడాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 27: కేయూ న్యాయ కళాశాల గుర్తింపు రద్దు అయిందని, వెంటనే చర్యలుచేపట్టి గుర్తింపును కాపాడాలని కేయూ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో కేయూ న్యాయ కళాశాల గుర్తింపు రద్దుపై ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నేతృత్వంలో నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం చేశారు. రాష్ట్రంలో న్యాయ కళాశాలల్లో ప్రవేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని, అయితే కేయూ న్యాయ కళాశాలలో ప్రవేశాలు పొందే అవకాశం లేకుండా వెబ్ ఆప్షన్‌తో తొలగించారని విద్యార్థులు పేర్కొన్నారు. గుర్తింపు రద్దుపై వర్సిటీ అధికారులు బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ కళాశాల గుర్తింపును పునరుద్ధరించి, విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు స్టాలిన్, పీడీఎస్‌యూ నేతలు రంజిత్, అరుణ్, రాకేశ్, ఉదయ్, వంశీ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 27: రైలునుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట వడ్డెపల్లి రైల్వే ట్రాక్‌కింద రైలునుంచి జారిపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు 25 ఏళ్లు ఉంటుంది. తెలుపు రంగు గుండ్రటి ముఖం, నలుపు రంగు జీన్‌ప్యాంట్, నలుపు రంగు షర్ట్, ఎరుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ రైలు టికెట్ ఉంది. అపస్మారక స్థితిలో ఉన్న ఇతడిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృత దేహాన్ని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఎలక్ట్రికల్ షెడ్డులో తప్పిన ప్రమాదం

కాజీపేట, ఆగస్టు 27 : ఎలక్ట్రికల్ షెడ్‌లో పెనుప్రమాదం తప్పింది. రైల్వే కార్మికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మరమ్మతుకు గురైన ఓ లోకోఇంజన్ మంగళవారం లోకోపైలెట్ నడిపి మరమ్మతులు చేశారు. పైలెట్ లోకోదిగిన కాసేపటికి లోకో కదిలి కాస్త ముందుకు వెళ్లి ఆగింది.. దీంతో రేకులషెడ్డు దెబ్బతింది. ఆ సమయంలో అక్కడ రైల్వే కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని రైల్వే కార్మికులు తెలిపారు.

విద్యా కార్యక్రమాల్లో జిల్లాను ముందంజలో ఉంచాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 27: విద్యా కార్యక్రమాల్లో జిల్లాను వెనుకబడి ఉంచకుండా జిల్లాను ముందంజలో ఉంచాలని డీఈవో డి.వాసంతి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఎంఈవోలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో వాసంతి మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులు పుస్తకాలు, యూనిఫామ్స్ లేకుండా ఉండటానికి వీలులేకుండా చూడాలన్నారు. ఇన్‌స్పైర్‌కు ప్రతీపాఠశాల నుంచి విద్యార్థులను నామినేషన్లు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో ఎ.శ్రీనివాస్, కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఏపీవో వినయ్‌కుమార్, ఎంఈవోలు రాంకిషన్‌రాజు, రవీందర్, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 28 ఆగస్టు 2024

ట్రావెలింగ్

ప్రయాణాల్లో కులాసాగా...

స్వదేశీ ప్రయాణాలైనా, విదేశీ ప్రయాణాలైనా మనతో పాటు మన కుటుంబ సభ్యుల ఆరోగ్యం నిక్షేపంగా ఉండేలా చూసుకోవాలి. అందు కోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించండి.



కారు ప్రయాణాల్లో...

మోషన్ సిక్‌నెస్: కొందరికి కారు ప్రయాణాలు సరిపడవు. వాంతులు వేధిస్తాయి. ఈ సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి రెండు గంటల ముందే తేలికపాటి ఆహారం తీసుకోవాలి. వాంతులను ఆపే మందులతో పాటు, నీళ్లు దగ్గర పెట్టుకోవాలి.

చేతులు శుభ్రం: రెస్ట్ స్టాప్‌లు, పెట్రోల్ బంకులు, రెస్టారెంట్ల దగ్గర ఆగుతూ ఉంటాం. కాబట్టి అంటువ్యాధులు సోకకుండా చేతులను తరచూ శుభ్రం చేసుకుంటూ ఉండాలి. లేదంటే హ్యాండ్ శానిటైజర్ ఉపయోగిస్తూ ఉండాలి.

ఫుడ్ సేఫ్టీ: వాంతులు, విరోచనాలు లాంటి జీర్ణసంబంధ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం బయటి భోజనాలకు బదులుగా పండ్లు, ప్రొటీన్ బార్స్, ఇంట్లో తయారు చేసుకుని వెంట తెచ్చుకున్న స్నాక్స్ మీదే ఆధారపడాలి.



విశ్రాంతి: గంటల తరబడి నిరంతరంగా ప్రయాణించకుండా ప్రతి రెండు గంటలకూ స్వల్ప విరామం తీసుకుంటూ వెళ్లాలి. ప్రయాణంలో మత్తును కలిగించే మందులు వేసుకోకూడదు.

విమాన ప్రయాణాల్లో...

విశ్రాంతి: ప్రయాణానికి ముందు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా సరిపడా నీళ్లు తాగాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

బాడీ ఫెటీగ్: తేలికపాటి బరువులనే హ్యాండ్ లగేజ్‌గా వాడుకోవాలి. మోయలేని బరువును భుజానికి, వీపుకు తగిలించుకోవడం వల్ల భుజం, వెన్ను నొప్పి వేధిస్తాయి. అలాంటి బరువైన బ్యాగులను చెకిన్‌కు పరిమితం చేయాలి.

స్ట్రెచింగ్: రెండు గంటలకు మించి విమాన ప్రయాణం చేసేవారు తరచూ స్ట్రెచింగ్ చేసుకోవడం అవ



సరం. అరికాళ్లు వాచిపోకుండా ఉండడం కోసం కాలి గిలకలను గుండ్రంగా తిప్పుతూ ఉండాలి. సీట్ బెల్ట్ సైన్ ఆగిపోయిన సమయంలో విమానంలోనే అటూ ఇటూ నడిచే ప్రయత్నం చేయాలి.

హెయిర్ బ్యాండ్: వెంట్రుకలు బిగుతుగా వెనక్కి లాగి కట్టేసే హెయిర్ బ్యాండ్స్ వల్ల తలనొప్పులు వేధిస్తాయి. కాబట్టి సాధ్యమైనంత వరకూ వెంట్రుకలను వదిలేసి ఉంచాలి.

విదేశీ ప్రయాణాల్లో...

మందులు సరిపడా: దైనందిన ప్రిస్క్రిప్షన్లకు తగ్గట్టు సరిపడా మందులను వెంటబెట్టుకెళ్లాలి. ప్రయాణానికి ముందు వైద్యులు సూచించే టీకాలు వేయించుకోవాలి.

వ్యాధులు: వెళ్లబోతున్న దేశంలో ప్రబలి ఉన్న వ్యాధుల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి. వ్యాధుల లక్షణాలు, ముందు జాగ్రత్త చర్యల గురించి కూడా అవగాహన ఏర్పరుచుకోవాలి.



ఆరోగ్య రక్ష: సన్‌స్క్రీన్స్, ఇన్‌సెక్ట్ రిపెల్లెంట్స్ వెంట తీసుకువెళ్లాలి. ఆహార జాగ్రత్తలు పాటించాలి. కొత్త పదార్థాలను తినేటప్పుడు అలర్జీలకు గురయ్యే అవకాశాలుంటాయనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరాలకు సంబంధించిన సాధారణ మందులతో పాటు పెయిన్ కిల్లర్స్, అలర్జీ మందులు వెంట తీసుకువెళ్లాలి.

జబర్దస్త్ 'జర్దోసి'

హంగు, హోదా దుస్తుల్లోనూ ప్రతిబింబించే సంక్లిష్టమైన ఎంబ్రాయిడరీలు సగటు మహిళలకు అందుబాటులో ఉండవనుకుంటే పొరపాటు. దశాబ్దాలుగా బంగారు, వెండి తీగల అల్లిక పనితనంతో ఆదరణ పొందుతూ వచ్చిన ప్రపంచప్రఖ్యాత జర్దోసి ఎంబ్రాయిడరీ దుస్తులు, ఇప్పుడు సెక్విన్లు, మోటిఫ్‌ల అలంకరణతో మహిళలందరికీ అందుబాటులోకొచ్చాయి. ఆ రకం జర్దోసి దుస్తుల ఫ్యాషన్ గురించి తెలుసుకుందాం!

ఫ్యాషన్



మొఘలుల మనసును మెప్పించి...

పర్షియా భాషలో జర్దోసికి బంగారు ఎంబ్రాయిడరీ అని అర్థం. క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలో మెసపటోమియాలో రూపం పోసుకున్న ఈ పనితనం, కాలక్రమంలో భారతదేశానికి చేరుకుంది. మరీ ముఖ్యంగా 16, 17వ శతాబ్దపు మొఘల్ చక్రవర్తులు ఈ పనితనానికి ముగ్ధులై, తమదైన శైలిని జోడించి జర్దోసికి కొత్త రూపురేఖలను జోడించారు. జర్దోసి కళాకారులు దుస్తుల ఎంబ్రాయిడరీని సృష్టించడం కోసం మూడు రకాల పద్ధతులను అవలంభించేవారు. అవేంటంటే...

- **ఫ్లాట్ జర్దోసి:** వస్త్రం మీద బంగారం, వెండి, రాగి తీగలతో డిజైన్లను కుట్టడం
- **ఎంబెలిష్‌మెంట్:** ఎంబ్రాయిడరీకి అదనపు హంగులను జోడించడం కోసం సెక్విన్లు, జాతి రాళ్లు, పూసలను జోడించడం
- **ఆర్ల్ వర్క్:** సంక్లిష్టమైన పనితనంతో కొక్కేన్ని పోలిన సూదులను ఉపయోగించి సంక్లిష్టమైన ఆకృతులను సృష్టించడం

నచ్చిన డిజైన్, నచ్చిన ఫ్యాబ్రిక్

జర్దోసి ఎంబ్రాయిడరీకి నేర్పు, ఓర్పు కలిగి ఉండాలి. సునిశిత దృష్టి, నైపుణ్యం కూడా మెండుగా కలిగి ఉండాలి. ఇంతటి శ్రమతో తయారైన జర్దోసి డిజైనర్ దుస్తులు కంటికింపుగా, మెరుపులు వెదజల్లుతూ ఎంతో హుందాగా ఉంటాయి. కాబట్టే బంగారం తీగల జర్దోసి వర్క్‌తో వెడ్డింగ్ లెహంగాలను రూపొందిస్తున్నారు. సున్నితమైన పువ్వుల మోటిఫ్స్‌తో చీరలను తయారుచేస్తున్నారు. జామెట్రీ ఆకృతులను కలిగిన షేర్వాణీలను కూడా తయారుచేస్తున్నారు. ధరించదగిన కళాకృతిలా దుస్తులను మలచడానికి తోడ్పడుతున్న జర్దోసి ఎంబ్రాయిడరీ నేడు బంగారం, వెండిలను మరిపించే చవకైన మెటీరియల్స్‌తో కూడా రూపొందుతున్నాయి. నచ్చిన డిజైన్, నచ్చిన రంగు, నచ్చిన ఫ్యాబ్రిక్‌ను ఎంచుకుని డిజైనర్ల సహాయంతో మనసుకు నచ్చే జర్దోసి వర్క్‌ను డిజైన్ చేసుకోగలిగే వెసులుబాట్లు కూడా అందుబాటులోకొచ్చాయి. అయితే పట్టు, వెల్వెట్, బ్రొకేడ్ మెటీరియల్స్ మాత్రమే బరువైన జర్దోసి పనితనాన్ని మోయగలుగుతాయి. కాబట్టి మెటీరియల్ ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలి.



అభాగ్యులకు కన్న బిడ్డలా

నాకూ అమ్మా నాన్నా ఉంటే బాగుండేది... పెరిగే వయసులో యోజన ఘూరత్ ఈ మాట అనుకోని క్షణం లేదు. ఇప్పుడామెకు నూట పాతికమందికి పైగా తల్లితండ్రులు... వేలాది మంది నిస్సహాయ వృద్ధులను ఆమె దత్తత తీసుకున్నారు. వారికి దూరమైన ఆదరణను అందిస్తూ... తను కోల్పోయిన ప్రేమను పొందుతున్నారు.



"నేను తల్లితండ్రులెవరో తెలియని అనాథను. నాకు ఊహ తెలిసేసరికి కోల్‌కతాలోని 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'లో ఉన్నాను. మదర్ థెరిసా సంరక్షణలో పెరిగాను. అక్కడి నన్స్ నాలాంటి అనాథలను ఆప్యాయంగా చూసుకొనేవారు. మా అవసరాలను కనిపెట్టి తీర్చేవారు. కానీ ఎక్కడైనా తల్లితండ్రులతో కలిసి వెళుతున్న పిల్లలు కనిపించినప్పుడు నా మనసెంతో బాధపడేది. నాకూ అమ్మా నాన్నా ఉంటే బాగుండేదని ఎప్పుడూ అనుకొనేదాన్ని. "మీరు వెళ్ళిన ప్రతిచోటా ప్రేమను వ్యాప్తి చెయ్యండి. మీ దగ్గరకు వచ్చినవారు ఎవరైనా... వారిలో సంతోషం నింపకుండా వెనక్కి పంపకండి" అని మదర్ థెరిసా చెప్పిన మాటలు నాలో బలంగా నాటుకున్నాయి. చదువు పూర్తి కాగానే... నాలాంటివారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నాను. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి వివిధ ప్రాంతాల్లో పని చేశాను. ఆ సమయంలోనే... దిక్కులేని వృద్ధులు ఎందరినో చూశాను. 'నా



తల్లితండ్రులు ఇలాంటి వాళ్ళే అయి ఉంటారా? నన్ను పోషించే శక్తి లేక వదిలేసి ఉంటారా? ఇప్పుడు వాళ్ళు ఎక్కడో ఇదే పరిస్థితిలో ఉన్నారా?' అని ఆలోచించేదాన్ని.

ఇది అంత తేలిక కాదు...

దాదాపు పదేళ్ళకు పైగా ఎన్నో స్వచ్ఛంద సంస్థల్లో కొనసాగిన తరువాత... వృద్ధుల కోసం నేనే సొంతంగా పని చెయ్యాలనుకున్నాను. 2010లో మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా బోయ్‌సార్‌లో 'స్మిట్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నాను. రైల్వే స్టేషన్లు, బస్టాండులు, ఆలయాల దగ్గర, వంతెనల కింద, ఆసుపత్రుల బయట నిస్సహాయంగా ఉండే వయోధికులకు ఆహారం, వసతి, వైద్యం అందించడంతోపాటు వారిలో నైరాశ్యాన్ని తొలగించి మానసిక స్థైర్యాన్ని నింపేదాన్ని. దీనికోసం ఎందరో ఉదారంగా ఎన్నో రూపాల్లో సాయం చేసేవారు. క్రమంగా వృద్ధుల సంఖ్య పెరిగింది. బోయసార్‌లో కొన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో ఠాణే జిల్లాలోని భివాండికి మారాం. మా సంస్థను 2017లో 'స్మిట్ ఓల్డేజ్ హోమ్ అండ్ కేర్ ఫౌండేషన్'గా రిజిస్టర్ చేశాను. నా కార్యక్రమాలను గమనించి... స్వచ్ఛందంగా సేవలు అందించడానికి చాలామంది ముందుకు వచ్చారు. అనాథలు, పేదలు, పిల్లలు వదిలేసినవారు, శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతున్నవారు... ఇలా అవసరంలో ఉన్న వృద్ధులకు నిరంతరాయంగా సేవలు కొనసాగిస్తున్నాను. ఇప్పటివరకూ 10,700 మందికి మా సంస్థ సేవలు అందించింది. 7,300 మందికి పైగా వివిధ దశల్లో ఆశ్రయం ఇచ్చింది. 5,200 మందిని నేను దత్తత తీసుకొని, వారి బాగోగులు చూస్తున్నాను. వారిలో 3,800 మందికి మా సంస్థ ద్వారా వివిధ పనుల్లో శిక్షణ అందించి... సాధికారత కల్పించాం. పూర్తిగా కోలుకున్నాక... కొందరు తమ కుటుంబాల దగ్గరకు తిరిగి వెళ్ళారు. మరికొందరు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న వృద్ధాశ్రమాలలో చేరారు. ఇలాంటి ఒక సంస్థను నడపడం తేలికైన విషయం కాదు. కనీస అవసరాల కోసం నెలకు పన్నెండు లక్షలకు పైగా ఖర్చవుతోంది. దాతల నుంచి, సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ సంస్థలు అందించే మొత్తాల నుంచి దాన్ని సమకూర్చుకోవాల్సి వస్తోంది.

సమాధానం దొరికింది...

ప్రస్తుతం మా హోమ్‌లో 126 మంది శాశ్వతంగా ఆశ్రయం పొందుతున్నారు. వారంతా దాదాపుగా మంచం మీద నుంచి కదలలేనివారే. ఆహారం తినిపించడం, కాలకృత్యాల్లో సాయపడడం, డైపర్లు మార్చడం... ఇలా ప్రతి పనీ నేను, మా వాలంటీర్లు చేస్తాం. అందరూ నన్ను తమ కూతురులా భావిస్తారు. కష్టసుఖాలు చెప్పుకొంటారు. తమ జీవితానుభవాలు వివరిస్తూ ఉంటారు. నేను ఎరుగని నా కన్నవారిని వాళ్ళలో నేను చూసుకుంటున్నాను. నిస్సహాయత, ఒంటరితనం అంటే ఏమిటో నాకు తెలుసు. వారికి కావలసింది మూడు పూటలా ఆహారం, నిద్రపోవడానికి ఒక మంచం మాత్రమే కాదు... వృద్ధాప్యంలో ఆరోగ్యపరమైన, భావోద్వేగపరమైన సమస్యలుంటాయి. తమతో కొంత సమయం గడిపి, తాము చెప్పేది వినేవారు కావాలని వారు కోరుకుంటారు. జీవితంలో అన్నీ కోల్పోయామనే నిరాశలో ఉంటారు. వారిలో నైతిక స్థైర్యం నింపడానికి నేను, మా వాలంటీర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. 'హోమ్‌లో ఉన్న వారందరూ ఒకే కుటుంబం' అనే భావన కలిగేలా చూస్తాం. వారిలో స్నేహభావాన్ని పెంపొందిస్తాం. ఓపిక, ఉత్సాహం ఉన్నవారిని చిన్న చిన్న పనుల్లో భాగస్వాముల్ని చేస్తాం. దివ్యాంగులు, ఇళ్ళ నుంచి తప్పిపోయిన పిల్లలకు కూడా హోమ్‌లో చోటు కల్పిస్తున్నాం. నారీ శక్తి ప్రతిభా సన్మాన్, సామాజిక్ సేవా పురస్కార్, సమాజ్ రత్న పురస్కార్, బెస్ట్ సోషల్ వర్కర్ ఆదర్శ మహారాష్ట్ర మహిళా సన్మాన్, సావిత్రి బాయి ఫూలే సన్మాన్... ఇలా అనేక పురస్కారాలను, గౌరవాలను అందుకున్నాను. ఇప్పుడు మా అమ్మాయిలు వర్షాలి, మయూరి కూడా ఫౌండేషన్ బాధ్యతలను పంచుకుంటున్నారు. ఇప్పటికీ మా సంస్థ అద్దె భవనంలోనే నడుస్తోంది. కనీసం మూడు వేలమందికి ఏకకాలంలో సరిపోయే సొంత భవనం నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఒకప్పుడు 'అమ్మా, నాన్నా ఎలా ఉంటారు? వాళ్ళను ఎక్కడ వెతకాలి?' అనే ప్రశ్నలు నన్ను వేధించేవి. నేను ఎంచుకున్న మార్గంలో వాటికి సమాధానం దొరికింది."

బ్యూటీ

ఓపెన్ పోర్స్ ఇలా మాయం

చర్మంలో తయారయ్యే స్వేదం, నూనెలు బయటకు వెళ్లిపోవడానికి ఓపెన్ పోర్స్ ఉపయోగపడతాయి. అయితే జిడ్డు, దుమ్ము, మృత చర్మకణాలు, అవసరానికి మించి నూనెలు స్రవించడం మూలంగా ఈ చర్మ రంధ్రాలు మరింత పెద్దవిగా మారిపోయి, ముఖ చర్మం మీద స్పష్టంగా కనిపించడం మొదలుపెడతాయి. అలాంటప్పుడు వీటిని కుంచించుకుపోయేలా చేసే చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

అలోవేరా ఇలా....

అలోవేరా ఆకుల అంచులను తొలగించి, పైనున్న తోలును తొలగించి, కత్తితో గాట్లు పెడితే చిక్కని అలోవేరా ఆకులో నుంచి బయటకొస్తుంది. దీన్ని గిన్నెలోకి వంపుకుని, వేళ్లతో ఒత్తి గుజ్జుగా చేసుకుని ముఖానికి పట్టించాలి. 15 నిమిషాల తర్వాత, గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు క్రమం తప్పక చేస్తే ఫలితం ఉంటుంది.

బొప్పాయి భలే

బొప్పాయిలో పపెయిన్ అనే యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది చర్మం మీద మచ్చలు, డాగులను చర్మంలో కలిసిపోయేలా చేస్తుంది. అలాగే చర్మరంధ్రాలు కూడా శుభ్రపడతాయి. కాబట్టి తాజా బొప్పాయి



ముక్కను నేరుగా గుజ్జుగా చేసి ముఖానికి అప్లై చేసుకోవాలి. గుజ్జును అప్లై చేయడానికి కాటన్ బాల్ ఉపయోగించడం మరింత మంచిది. ఇలా అప్లై చేసుకున్న తర్వాత 20 నిమిషాలు ఆగి, చల్లనీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయాలి.

పెరుగు ప్రయోజనం

పెరుగులో లాక్టిక్ యాసిడ్, ప్రొబయాటిక్స్ ఉంటాయి. పెరుగు చర్మానికి సహజసిద్ధ తేమను కూడా అందిస్తుంది. ఓపెన్ పోర్స్‌ను కూడా అరికడుతుంది. కాబట్టి తాజా పెరుగును చిలికి, ముఖం మీద ఒక పొరలా అప్లై చేసుకుని, 15 నిమిషాల తర్వాత చల్లనీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారానికోసారి చేస్తే సరిపోతుంది.

అంగవైకల్యం ఉన్నవారి పట్ల సమాజంలో చిన్న చూపు ఉంటుంది. ముఖ్యంగా మరగుజ్జులైతే ఆ వివక్ష మరింత ఎక్కువగా కనిపిస్తుంది. ఆ వివక్షలన్నింటినీ దాటుకొని- ఒక ప్రముఖ సంస్థకు క్రియేటివ్ హెడ్‌గా పనిచేస్తున్న దిశ కథ అందరికీ స్ఫూర్తిదాయకం.

ఊహలకు రెక్కలు తొడిగి..

"అంగవైకల్యం నేను కోరుకున్నది కాదు. నాకు అదొక శాపం. కానీ శాపాన్ని కూడా వరంగా మార్చుకోగలిగినప్పుడే మనం పరిపూర్ణమానవులం అవుతాం" అంటారు దిశ. ముంబైలో నివసించే 39 ఏళ్ల దిశకు చిన్నతనం నుంచి కాళ్లు, చేతులు ఎదగటం మానేసాయి. స్కూలుకు వెళ్తే పిల్లలు గేలి చేసేవారు. దిశకు స్కూల్లో ఎప్పుడూ మంచి మార్కులే వచ్చేవి. కానీ ఆమెకు తగినంత గౌరవం లభించేది కాదు. "మన దేశంలో మరగుజ్జులను జోకర్స్‌లా చూస్తారు. వారికీ ఒక జీవితం ఉంటుందనే విషయాన్ని ఎవరూ పట్టించుకోరు" అంటారు దిశ. స్కూలులోనే కాదు కాలేజీలో కూడా దిశకు మంచి మార్కులే వచ్చాయి. కాలేజీ తర్వాత ఆమెకు ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేయాలనే ఆశ ఉండేది. "ప్రతి కార్పొరేట్ కంపెనీకి కొన్ని విధివిధానాలు ఉంటాయి. అంగవైకల్యం ఉన్నవారిని వారు చేర్చుకోవటానికి ఇష్టపడరు. అంగవైకల్యం ఉన్న వారు తమ వద్ద చేరితే వర్క్ కల్చర్ పాడైపోతుందనుకుంటారు. ఈ విషయం నాకు ముందు తెలియదు. అందుకే నా క్వాలిఫికేషన్స్‌కు తగిన ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో అనేక కంపెనీలకు అప్లై చేసేదాన్ని" అంటారు దిశ. అప్లై చేసిన తర్వాత ఇంటర్వ్యూలకు పిలిచేవారు. ఆమెను చూసిన తర్వాత... ఉద్యోగాన్ని ఇచ్చేవారు కారు. ఇలా ఒకటి రెండు కాదు.. 17 ఉద్యోగాలు రాలేదు. 'మీరు ఎంపిక కాలేదు..' అని వచ్చే మెయిల్‌ను



చూసినప్పుడల్లా విపరీతమైన నిరాశ కలిగేది. అయితే సైర్యం మాత్రం ఎప్పుడూ కోల్పోలేదు. నేను ఏ తప్పూ చేయలేదు. నా అంగవైకల్యం నా తప్పు కాదు.." అంటారు దిశ. ఇలా కొద్ది కాలం గడిచిన తర్వాత ఒక గ్రాఫిక్ డిజైనింగ్ సంస్థలో దిశకు ఉద్యోగం దొరికింది. "ఆ రోజు నా ఆనందానికి హద్దులు లేవు. నన్ను నేను నిరూపించుకుంటానని ఆ రోజు శపథం చేశా. అదృష్టవశాత్తు అంతా మంచిగానే జరిగింది" అంటారామె. ఉద్యోగంలో చేరిన కొద్దికాలానికే ఆమె అంచెలంచెలుగా ఎదగటం మొదలుపెట్టారు. ప్రస్తుతం ఓ ప్రముఖ సంస్థలో క్రియేటివ్ హెడ్‌గా పనిచేస్తున్నారు.

నాలాగా ఎందరో...

మన దేశంలో లక్షల మంది మరగుజ్జులు ఉంటారు. వారిలో ఎక్కువ మంది జీవనోపాధి లేక అనేక కష్టనష్టాలను అనుభవిస్తున్నవారే! వీరందరికీ సాయం చేసే సంస్థలు ఏమి లేవు. వీరందరి కోసం దిశ ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ద లిటిల్ పీపుల్ ఆఫ్ ఇండియా' అనే సంస్థను స్థాపించారు. ప్రస్తుతం ఈ సంస్థలో 650 మంది సభ్యులు ఉన్నారు. "వీరికి వృత్తిపరంగా.. వైద్య పరంగా సాయం అందించటమే మా లక్ష్యం. మరగుజ్జుల పట్ల వివక్ష అంత త్వరగా పోదు. అందువల్ల వారికి తగిన చేయుత ఇవ్వటానికి ప్రయత్నిస్తాం." అంటారు దిశ. ఈ లక్ష్యాలతో పాటుగా- వివాహం చేసుకొని స్థిరపడాలనుకొనే వారికి చేయూత ఇవ్వడం అనేది తమ మరో లక్ష్యమంటారామె! "చాలామంది వివాహం చేసుకోవా

> నా ఎత్తుకు హద్దు ఉందేమో... కానీ నా సామర్థ్యానికి కాదు.



లనుకుంటారు. కానీ ఎవరిని సంప్రతించాలో తెలియదు. వారి కోసం ఒక వివాహ వేదికను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం" అంటారు దిశ. సమాజంలో వివక్షకు గురైన ఒక వర్గం కోసం ఆమె చేస్తున్న ప్రయత్నాలు స్ఫూర్తిదాయకం.



ఈ ఉంగరాలు స్మార్ట్

మీరు వ్యాయామం చేస్తున్నప్పుడు హార్ట్‌బీట్ ఎంత ఉందో తెలుసుకోవాలనుకుంటున్నారా? రాత్రి ఎంత సేపు ప్రశాంతంగా నిద్రపోయారో తెలుసుకోవాలనుకుంటున్నారా? ఇప్పటిదాకా ఇలాంటి విషయాలు తెలుసుకోవాలంటే స్మార్ట్ వాచీలే మనకు దిక్కు. ఇప్పుడు చేతికి ఉంగరాలు మాదిరిగా పెట్టుకొనే కొత్తరకం ఫిట్‌నెస్ బ్యాండ్‌లు అందుబాటులోకి వచ్చేసాయి. ప్రస్తుతం అనేక మంది సెలబ్రిటీలు వీటినే వాడుతున్నారు. చూడటానికి చాలా ఫ్యాషన్‌బుల్‌గా ఉండే ఈ స్మార్ట్ రింగ్స్ వెనక ఉన్న కథేమిటో చూద్దాం.



అంటే ఏమిటి?

ఇవి మన వేళ్లకు పెట్టుకొనే ఉంగరాల మాదిరిగానే ఉంటాయి. మన మొబైల్ ఫోన్లకు అనుసంధానమై ఉంటాయి. మన మొబైల్స్‌కు ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపుతూ ఉంటాయి.

ఏఏం చేయవచ్చు?

- ఒక రోజులో ఎన్ని అడుగులు వేశామో తెలుస్తుంది..
- హార్ట్‌బీట్ రేట్ ఎలా ఉందో తెలుస్తుంది..
- నిద్రలో ఎన్నిసార్లు లేచామో తెలుస్తుంది..
- కొన్ని అత్యాధునిక స్మార్ట్ రింగ్స్ ద్వారా రుతుస్రావం ఎప్పుడు అవుతుందో ముందే కనుగొనవచ్చు
- కొన్ని స్మార్ట్ రింగ్స్ ద్వారా డిజిటల్ పేమెంట్స్ కూడా చేయవచ్చు

నష్టాలేమిటి?

- చూడ్డానికి ఫ్యాషనబుల్ ఉంగరంలా ఉండే ఈ స్మార్ట్ బ్యాండ్‌లో సమాచారాన్ని నేరుగా చూడలేము. మొబైల్‌కు అనుసంధానించాలి.
- బ్యాటరీ లైఫ్ కూడా తక్కువగా ఉంటుంది.
- ఇతర ఫిట్‌నెట్ ట్రాకర్స్‌తో పోలిస్తే వీటి ఖరీదు ఎక్కువ.

నిమ్స్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- పారా మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ(పీజీడీఎన్ఎంటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 8 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(ఏదేని సైన్స్ సబ్జెక్టులు/లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. బయలాజికల్ సైన్సెస్ నుంచి 20 మార్కులకు; ఫిజికల్ సైన్సెస్ నుంచి 20 మార్కులకు; కమ్యూనిటీ మెడిసిన్, బయో స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్సెస్ జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. డిగ్రీ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు రావాలి.

- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 18 నుంచి
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ తేదీ:** అక్టోబరు 23
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 25
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** అక్టోబరు 29
- **కౌన్సెలింగ్ లెటర్స్ విడుదల:** నవంబరు 1
- **కౌన్సెలింగ్ తేదీ:** నవంబరు 5
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

దిక్సూచి

SCHOLARSHIP ALERT

Adani Gyan Jyoti

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility: Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only. Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.

- Applicants must have passed their higher secondary/pre-university/ intermediate/ CBSE/ ISC or equivalent board exams after 2023.
- Admission must be based on the merit rank from state or national-level entrance exams.
- Family income must not exceed INR 4,50,000 per annum from all sources.

Prizes & Rewards: Up to INR 3,50,000 (tuition fee) annually.
Last Date to Apply: 07-10-2024
Application mode: Online application only
Short Url: www.b4s.in/aj/AGSP5

Reliance Foundation Postgraduate

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility:

- Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences
- Must have secured 550 to 1,000 in the GATE examination

OR

- Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]
- Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree
Last Date to Apply: 06-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RFS10

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the postgraduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000
Last Date to Apply: 04-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/HDFC54

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/zWc6NZfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

'అమ్మ' అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా

- నటి రేవతిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సిద్ధిఖీ
- మీడియా ఆజ్యం పోస్తోంది కేంద్రమంత్రి సురేశ్ గోపి

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో మలయాళ చిత్రసీమ మరింత వేడెక్కుతోంది. ఆరోపణలతో మొదలై విమర్శలు, ఖండనలు, రాజీనామాలను దాటి వ్యవహారం కేసుల దాకా వెళ్లింది. మంగళవారం మరికొందరు నటీమణులు 'మీటూ' అంటూ ముందుకొచ్చారు. మల్లూవుడ్‌లో తాము ఎదుర్కొన్న వేధింపులను వారు బయటపెట్టగా, ఆధారాలు చూపాలంటూ వారిపై ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు ఎదురుదాడికి దిగారు. ఈ పరిణామాలతో కీలక స్థానాల్లో ఉన్న సినీ ప్రముఖులు సైతం ఆరోపణలకు సమాధానం చెప్పలేక తమ పదవులను త్యజిస్తున్నారు. ఇన్నాళ్లు చక్కటి అభిరుచితో సినిమాలను తెరకెక్కిస్తూ జాతీయ స్థాయిలో ఖ్యాతిని కూడగట్టుకున్న మలయాళ సినిమా ఇప్పుడు మహిళలపై వేధింపులతో వార్తలతో అపఖ్యాతి మూటగట్టుకుంటోందనేది సగటు ప్రేక్షకుడి ఆవేదన.

మూవీ ఆర్టిస్ట్ అసోషియేషన్ రద్దు

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ నేపథ్యంలో నటుడు మోహన్‌లాల్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు.







అమ్మ(అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కీలక వ్యక్తులపై లైంగిక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నైతిక బాధ్యతగా ఆయనతో పాటు మరో 17 మంది సభ్యులు తమ పదవులకి రాజీనామా చేశారు. అలాగే, ఈ చిత్రమండలిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, లైంగిక ఆరోపణల నేపథ్యంలో.. ఇటీవలే దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవి నుంచి వైదొలిగారు. నటుడు సిద్ధిఖీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. తన పరువుకు భంగం కలిగించారని నటి రేవతిపై ఆయన కేరళ డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. మలయాళ చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర మంత్రి సురేశ్ గోపి స్పందించారు. "చిత్ర సీమలో వస్తున్న లైంగిక ఆరోపణల గురించి మీడియా చేస్తున్న ప్రచారం ప్రజలని తప్పుదోవ పట్టిస్తోంది. స్వలాభం కోసం మీడియా ఇలా వాస్తవాలు తెలియకుండా ప్రచారం చేయడం సరికాదు" అని ఆయన అభిప్రాయపడ్డారు.

ముఖం చూపించి మాట్లాడు

నటుడు, 'అమ్మ' జాయింట్ సెక్రటరీ బాబూరాజ్‌పై ఓ జూనియర్ ఆర్టిస్ట్ ఇటీవలే లైంగిక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను ఆయన మంగళవారం ఖండించారు. "ఎవరైతే నాపై ఆరోపణలు చేశారో.. ముఖం చూపించి మాట్లాడాలని సవాలు విసురుతున్నాను" అని పేర్కొన్నారు. అయితే ఇటీవలే ఓ జూనియర్ ఆర్టిస్ట్ బాబూరాజ్‌పై ఆరోపణలు చేశారు. "బాబూరాజ్.. నన్ను ఓ సినిమాలో ఎంపిక చేశానని.. నా పాత్ర కోసం చర్చించడానికి దర్శకులు, నిర్మాతలు వస్తున్నారని.. తన ఇంటికి పిలిచాడు. తన మాటలు నమ్మి నేను వెళ్లాను. కాసేపటికి ఆయన.. సినిమాలో నీ పాత్ర కోసం చర్చలు జరుగుతున్నాయి.. కాసేపు విశ్రాంతి తీసుకోమ్మని ఓ రూమ్ చూపించారు. నేను రూమ్‌లో ఉండగా బాబూరాజ్ బలవంతంగా లోపలికి దూసుకొచ్చి నాపై లైంగిక దాడి చేశారు" అని ఆ జూనియర్ ఆర్టిస్ తన పేరు వెల్లడించకుండా సోషల్ మీడియాలో ఆరోపించారు.

బెంగాలీ ఇండస్ట్రీలోనూ...

మలయాళ పరిశ్రమలోనే కాదు బెంగాలీ చిత్రసీమలోనూ మహిళలపై వేధింపులు ఉన్నాయని నటి రితాభరి చక్రవర్తి ఆరోపించారు. "నాతోటి నటీమణులు, దర్శక, నిర్మాతలు, హీరోల చేతిలో వేధింపులను ఎదుర్కొన్నారు. బెంగాలీ చిత్రసీమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. జస్టిస్ హేమ కమిటీలాంటిదే ఇక్కడా ఏర్పాటు చేయాలి" అని రితాభరి సోషల్‌మీడియాలో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు.

నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలి



'ఇంతకుముందు ప్రమోషన్స్‌కు కూడా సమయం కేటాయించాలనే ఆలోచన ఉండేది కాదు. కంటెంట్ సినిమాను చూసుకుంటుందని అనుకొనేవాణ్ణి. అది నిజమే అయినా సినిమాను ప్రేక్షకుల దగ్గరకు చేర్చడం మన బాధ్యత. రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవారికి సినిమా గురించి ఆటోమేటిక్‌గా తెలుస్తుంది. రెగ్యులర్‌గా ఫాలో కాని వారు, ఇతర పనుల్లో బిజీగా ఉండేవారికి కూడా సినిమా సమాచారాన్ని అందించాలంటే ప్రమోషన్స్ పెద్ద స్థాయిలో చేయాలి. సినిమాను చూడాలనే ఆలోచన వారికి కలిగించాలి' అన్నారు నాని. ఆయన హీరోగా నటించిన 'సరిపోదా శనివారం' చిత్రం గురువారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నాని మీడియాకు వెల్లడించిన చిత్ర విశేషాలివి.

- ఈ సినిమాలో పాయింట్ చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది. సాధారణంగా నా సినిమాలన్నింటిలో తెలియని బరువుని నేనే మోస్తుంటాను. కానీ ఈ సినిమాలో ఎస్.జె. సూర్య, వివేక్ ఆ బరువు మోశారు. నేను కొంచెం బ్యాక్‌సీట్ తీసుకున్నా. పెర్ఫార్మెన్స్ పరంగా సూర్య, ప్రియాంక, మురళీశర్మ.. ఇలా అందరిపై భారం ఉంది.
- ఈ సినిమాలో సూర్య పోషించిన పాత్రకు ఆయన తప్ప మరో చాయిస్ లేదు. అద్భుతంగా నటించారు. నా ప్రతి సినిమాకూ దర్శకుడి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌లా పని చేస్తాను. నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలని కోరుకుంటాను. సినిమా రిలీజైన తర్వాత అందరూ హ్యాపీగా ఉన్నారని తెలిస్తే సక్సెస్ అయ్యానని ఫీలవుతా.
- ఈ సినిమాకు 'సరిపోదా శనివారం' అని పేరు పెట్టడానికి ఎమోషనల్ రీజన్ ఉంది. నా ఫేవరేట్ మూమెంట్ అది. సినిమా ప్రారంభమైన ఐదు నిముషాలకు వస్తుంది. స్క్రీన్‌ప్లే, నేరేషన్ చాలా ఎక్సయిటింగ్‌గా ఉంటుంది.

ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం



రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మించారు. దర్శకుడు మారుతి సమర్పకుడు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'శివసాయి సినిమాను డీల్ చేసే విధానం అద్భుతంగా ఉంది. నిర్మాత కిరణ్ ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో సపోర్ట్ చేశారు. మారుతితో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో తీరింది. ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం ఇది' అన్నారు. 'వినాయకచవితి రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. పొద్దున్నే పూజ చేసుకుని సాయంత్రం సినిమాకి వచ్చేయండి' అని కోరారు దర్శకుడు శివసాయి. మంచి సినిమా చూశామనే నమ్మకం ఉందనీ, అందరికీ నచ్చుతుందని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

ఆ కళలో ఆరితేరలేదు



నా సినిమాలకు విస్తృత ప్రజాదరణ లభించేలా ప్రచారం చేసే కళలో నేను నిష్ణాతుణ్ణి కాను అని జాతీయ ఉత్తమ నటుడు, కన్నడ హీరో రిషబ్ శెట్టి అన్నారు. ఆయన స్వీయ నిర్మాణంలో రూపొందిన చిత్రం 'లాఫింగ్ బుద్ధ'. ఈ చిత్రం శాటిలైట్, ఓటీటీ బిజినెస్ పూర్తిగా నిరాశపరిచిందని ఆయన చెప్పారు. 'లాఫింగ్ బుద్ధ' ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ గురించి రిషబ్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. 'కన్నడ చిత్ర పరిశ్రమలో ప్రీ రిలీజ్ బిజినెస్ ఆశాజనకంగా లేదు. పెద్ద సినిమాలకు సైతం ఈ విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు, కొన్ని చేదు అనుభవాల దృష్ట్యా కన్నడ సినిమాలను కొనేందుకు ఓటీటీ వేదికలు ముందుకు రావడం లేదు. 'లాఫింగ్ బుద్ధ' చిత్రానికి ప్రీ రిలీజ్ బిజినెస్ జీరో' అని ఆయన చెప్పారు.


కొత్తగా..

వినోదం పంచే ప్రేమగాథ



నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన 'సుందరకాండ' చిత్రం టీజర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ మంగళవారం నిర్వహించింది. తన స్వప్న సుందరి కోసం అన్వేషించే క్రమంలో ఆయన పండించిన వినోదం అలరించింది. నారా రోహిత్ మాట్లాడుతూ 'ఇదొక వినూత్న ప్రేమగాథ, నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది' అన్నారు. ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని మా చిత్రం ఇస్తుంది అని దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి చెప్పారు.

దసరాకు సూపర్ హీరో



సుధీర్‌బాబు కథానాయకుడిగా అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. తండ్రీ కొడుకుల ప్రేమ, అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి కావొచ్చింది. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. దసరాకు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

తల్లి మనసుకు అద్దం పట్టే సినిమా



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజ్, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రధారులు. షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు దర్శకుడు శ్రీనివాస్ (సిప్పి) చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్‌ను పూర్తి చేస్తామని నిర్మాత ముత్యాల కిశోర్ తెలిపారు.

ఐదు భాషల్లో కొటేషన్ గ్యాంగ్



జాకీ ష్రాఫ్, ప్రియమణి, సన్నీ లియోన్, సారా అర్జున్ ప్రధాన పాత్రలు పోషించిన 'క్యూజీ' చిత్రం ఈ నెల 30న ఐదు భాషల్లో విడుదల కానుంది. తెలుగు వరల్డ్ వైడ్ హక్కుల్ని వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రసన్నకుమార్, దామోదర ప్రసాద్ హాజరయ్యారు. ఇది మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్‌టైనర్ అని వేణుగోపాల్ చెప్పారు. అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని చిత్ర సమర్పకుడు ఎస్టీఆర్ శ్రీను చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో కళింగ



ధ్రువ వాయు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కళింగ'. ప్రజ్ఞా నయన్ హీరోయిన్. సెప్టెంబర్ 13న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ధ్రువ వాయు మాట్లాడుతూ 'తెలుగులో ఇంతవరకూ రాని కాన్సెప్ట్‌తో 'కళింగ రూపుదిద్దుకుంది. ఇది రెగ్యులర్ మూవీ కాదు' అన్నారు. ఈ సినిమాను చాలా వరకూ అవుట్‌డోర్‌లో, ఫారెస్ట్‌లో తీశామనీ, సినిమా అద్భుతంగా వచ్చిందని నిర్మాతలు పృథ్వీ యాదవ్, దీప్తి కొండవీటి చెప్పారు.

నిరుద్యోగి ప్రేమకథ



విప్లవ్ ప్రధాన పాత్ర పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఈసారైనా'. ఉద్యోగం కోసం వెదుక్కుంటున్న ఓ యువకుడు ప్రేమలో పడడం, చివరకు ఉద్యోగాన్ని పొందాడా, ప్రేమలో విజయం సాధించాడా అనేది ఆసక్తికరమని దర్శకుడు విప్లవ్ చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో అశ్విని అయలూరు హీరోయిన్. సంకీర్త్ కొండ సహ నిర్మాత.









విధి వంచించినా.. తలవంచని ధైర్యం.. వైకల్యం సవాళ్లు విసిరినా.. అచంచల ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమిస్తూ.. వినువీధిలో గెలుపు గీతం వినిపిస్తూ.. అణువణువునా స్ఫూర్తిని నింపే విశ్వక్రీడా సంరంభం.. పారాలింపిక్స్‌కు నేడు తెరలేవనుంది. తమ మనోబలం ఎంత గొప్పదో చాటి చెప్పేందుకు పారా ఒలింపియన్లు ఈ క్రీడలను వేదికగా చేసుకోబోతున్నారు. వారి దేశాలకు గర్వకారణంగా నిలవాలన్న లక్ష్యంతో ఆకాశమే హద్దుగా చెలరేగేందుకు సిద్ధమైన ఈ క్రీడాకారులకు ఎవరైనా సలాం కొట్టాల్సిందే.

ఆకాశమే హద్దు!

నేటి నుంచి పారాలింపిక్స్

భారత్ నుంచి 84 మంది బరిలోకి..

పారిస్: వందేళ్ల తర్వాత వినూత్నరీతిలో సమ్మర్ ఒలింపిక్స్‌ను నిర్వహించిన పారిస్ నగరంలో మరో క్రీడా సందడి. బుధవారం నుంచి సెప్టెంబరు 8 వరకు ఈ ఫ్యాషన్ నగరిలో పారాలింపిక్స్ సందడి నెలకొనబోతోంది. 22 క్రీడాంశాలు, 549 విభాగాల్లో 180 దేశాల నుంచి 4400 మంది పారా అథ్లెట్లు పతకాల కోసం బరిలోకి దిగబోతున్నారు. రాత్రి 11.30కు మొదలయ్యే పారాలింపిక్స్ ఆరంభోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. గతానికి భిన్నంగా నగరం మధ్యలో ఓపెన్ ఎయిర్‌లో చారిత్రాత్మక డి ల కాంకార్డ్, చాంప్స్‌-ఎలీస్‌లో బుధవారం రాత్రి ఆరంభ వేడుకలను నిర్వహించనున్నారు. మార్చ్ పాస్ట్‌లో పాల్గొనే 100 మంది సభ్యుల భారత బృందానికి జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ పతాకధారులుగా ముందుండి నడిపించనున్నారు. సుమారు 65 వేల మంది ఈ కార్యక్రమ వీక్షణకు హాజరవుతారని అంచనా. పోటీలు గురువారం మొదలవుతాయి.

జంబో బృందంతో..

పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు ఆరు మెడల్స్‌కే పరిమితమయ్యారు. కానీ ఆ లోటును భర్తీ చేసేందుకు దేశ పారా అథ్లెట్లు సిద్ధమవుతున్నారు. ఎందుకంటే రియో పారా గేమ్స్‌లో నాలుగు పతకాలే సాధించిన భారత్.. తమ పారాలింపిక్స్ చరిత్రలోనే తొలిసారిగా టోక్యోలో 19 మెడల్స్‌తో మెరిసింది. ఐదు స్వర్ణాలు, 8 రజతాలు, ఆరు కాంస్యాలతో పట్టికలో 24వ స్థానంతో ఆకట్టుకుంది. అందుకే రెట్టించిన ఉత్సాహంతో ఈసారి 84 మంది బృందం..12 క్రీడాంశాల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అదే టోక్యో క్రీడలకు 54 మందే వెళ్లడం గమనార్హం. మరోవైపు ఈసారి పారాగేమ్స్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు అథ్లెట్లు కూడా ప్రాతినిధ్యం వహించబోతున్నారు.

టార్గెట్ 25

ఇటీవలి అంతర్జాతీయ పోటీల్లో భారత అథ్లెట్లు రాణిస్తున్న తీరుతో సర్వత్రా పారా గేమ్స్ పతకాలపై అంచనాలు పెరిగాయి. కనీసం 25 నుంచి 30 మెడల్స్ లక్ష్యంగా బరిలోకి దిగబోతున్నారు. ముఖ్యంగా ఆర్చరీ, అథ్లెటిక్స్, షూటింగ్‌లో ఎక్కువగా ఆశిస్తున్నారు. స్టార్ హైజంపర్ మరియప్పన్ తంగవేలు, టోక్యోలో రెండు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన మహిళా షూటర్ అవని లేఖారాతో పాటు మరో షూటర్ నర్వాల్, షట్లర్ కృష్ణ నాగర్, మనోజ్ సర్కార్, సుహాస్, జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ మరోసారి పోడియం ఎక్కాలని భావిస్తున్నారు. అయితే వరల్డ్ చాంపియన్ షట్లర్ ప్రమోద్ భగత్ స్వర్ణ ఆశలు గల్లంతయ్యాయి. డోపింగ్ నిబంధనలు పాటించకపోవడంతో అతడిపై వేటు పడింది.

టీనేజ్ సెన్సేషన్


తొలిసారి పారాలింపిక్స్ ఆడనున్న 17 ఏళ్ల ఆర్చర్ శీతల్ దేవిపై అందరి దృష్టి ఉండబోతోంది. రెండు చేతులూ కోల్పోయినా ఆమె కాళ్లతోనే బాణాలను సంధిస్తూ గతేడాది వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రజతం అందుకుంది. అలాగే 2022 ఆసియన్ పారాగేమ్స్‌లో రెండు స్వర్ణాలు, రజతం సాధించింది. మహిళల పారా కాంపౌండ్ ఓపెన్ కేటగిరీలో తనే వరల్డ్ నెంబర్‌వన్. తాజాగా మహిళల కాంపౌండ్ ఓపెన్, మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఓపెన్‌లో పాల్గొంటున్న శీతల్‌పై స్వర్ణ ఆశలే ఉన్నాయి.

'గ్లోబల్' జోరు

ఏ దేశానికి చెందిన క్రీడాభిమానులనైనా ఆకర్షించే గ్లోబల్ స్టార్లు వారంతా. ప్రస్తుత పారాగేమ్స్‌లోనూ సత్తా చాటాలనుకుంటున్నారు. ఇటలీకి చెందిన పారా స్విమ్మర్ సిమోన్ బర్లామ్ తన స్వర్ణాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్నాడు. ఇక డచ్‌కు చెందిన వరల్డ్‌నెంబర్ వన్ వీల్‌చెయిర్ టెన్నిస్ ప్లేయర్ డీడె డి గ్రూట్ టోక్యోలో సింగిల్స్, డబుల్స్‌లోనూ స్వర్ణ పతకాలు ఖాతాలో వేసుకుంది. అలాగే పారా అథ్లెటిక్స్‌లో మార్సెల్ హగ్ (స్విస్), మార్కస్ రెహ్మ్ (జర్మనీ), ట్రయాథ్లాన్‌లో అలెక్సిస్ (ఫ్రాన్స్), స్విమ్మర్ మోర్గాన్ స్టిక్నీ (యూఎస్ఏ), లెజెండరీ స్విమ్మర్ జెస్సికా లాంగ్ (అమెరికా), మరో స్విమ్మర్ అలీ ట్రూవిట్ (అమెరికా), రన్నర్ హంటర్ ఉడ్‌హిల్ (అమెరికా), సైక్లింగ్‌లో ఒక్సానా మాస్టర్స్ (అమెరికా) బరిలోకి దిగబోతున్నారు.

ఎనిమిది మందితో శరణార్థి జట్టు

సమ్మర్ ఒలింపిక్స్ మాదిరే పారాగేమ్స్‌లోనూ శరణార్థి జట్టు బరిలోకి దిగబోతోంది. ఈసారి గేమ్స్ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది మంది ఈ టీమ్‌లో ఉన్నారు. వీరితో పాటు ఇద్దరు గైడ్ రన్నర్స్ కూడా సహాయకంగా పాల్గొంటారు. ఆరు దేశాలకు చెందిన వీరు అథ్లెటిక్స్, పవర్‌లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, ట్రయాథ్లాన్, వీల్‌చెయిర్ ఫెన్సింగ్‌లో సత్తా చూపబోతున్నారు. ఇందులో నలుగురికి గతంలో పారాలింపిక్స్‌లో ఆడిన అనుభవం ఉంది.



ఐసీసీకి జై షా



చైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నిక
డిసెంబరు ఒకటిన బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: బీసీసీఐ కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రస్తుత చీఫ్ గ్రెగ్ బార్క్‌లే (న్యూజిలాండ్) మూడోసారి పోటీపడకూడదని నిర్ణయించుకున్న నేపథ్యంలో..జై షా ఒక్కడే పోటీలో మిగలడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. దాంతో జై షా (35) ఐసీసీకి చిన్న వయస్సులో చైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తిగా రికార్డు సృష్టించాడు. వచ్చే డిసెంబరు ఒకటిన బార్క్‌లే నుంచి అతడు బాధ్యతలు చేపట్టనున్నాడు. 2019 అక్టోబరు నుంచి బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగుతున్న షా..జనవరి 2021 నుంచి ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నాడు. జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ తర్వాత ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఐదో భారతీయుడు జై షా.

క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం..: క్రికెట్‌ను ప్రపంచం నలుమూలలకు విస్తరింపజేసి ఆటకు మరింత ప్రాచుర్యం కల్పిస్తామని కొత్త చైర్మన్ జైషా చెప్పాడు. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడం ఆ దిశగా కీలక ముందడుగుగా అతడు పేర్కొన్నాడు.

ఎన్నిక ఇలా..

చైర్మన్ పదవికి నామినేషన్ల దాఖలుకు మంగళవారం చివరిరోజు. ప్రపంచ క్రికెట్‌లో బలమైన సభ్య దేశాలు ' సెనా' (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)లలో ఒక బోర్డు జై షా నామినేషన్‌ను ప్రతిపాదిస్తే..మరో క్రికెట్ బోర్డు సమర్థించినట్టు తెలిసింది. మరెవరూ నామినేషన్ వేయకపోవడంతో జై షా ఎన్నిక ఏకగ్రీవమైంది. టెస్ట్‌లు ఆడే దేశాలు 12, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, అసోసియేట్ సభ్య దేశాలు నామినేట్ చేసే ఇద్దరు, ఒక స్వతంత్ర మహిళా డైరెక్టర్ కలిపి..ఐసీసీలో మొత్తం 17 ఓట్లున్నాయి.

మహిళల టీ20 వరల్డ్‌కప్ జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలో 15 మంది సభ్యుల మహిళల టీ20 ప్రపంచకప్ జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఉమా ఛెత్రి మినహా ఆసియా కప్‌లో ఆడిన 14 మందికి జట్టులో చోటు లభించింది. వికెట్ కీపర్ బ్యాటర్ యాస్తిక భాటియా, స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ టీమ్‌లోకి పునరాగమనం చేశారు.

జొకో, గాఫ్ సులువుగా..

యూఎస్ ఓపెన్



న్యూయార్క్: నొవాక్ జొకోవిక్ యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో సునాయాసంగా గెలుపొందాడు. మంగళవారం జరిగిన మొదటి రౌండ్‌లో..రెండో సీడ్ జొకోవిచ్ 6-2, 6-2, 6-4తో ఆల్బాట్ (మాల్డోవా)ను చిత్తు చేశాడు. ఫ్లషింగ్ మెడోస్‌లో జొకోకిది 89వ విజయం. తద్వారా ఈ టోర్నీలో ఫెడరర్ అత్యధిక విజయాల రికార్డును నొవాక్ సమం చేశాడు. మహిళల మొదటి రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కొకొ గాఫ్ (అమెరికా) 6-2, 6-0తో గ్రచేవాను, టాప్ సీడ్ స్వియటెక్ 6-4, 7-6 (6)తో రఖిమోవాను, రెండో సీడ్ సబలెంకా 6-3, 6-3తో హాన్‌ను, 8వ సీడ్ క్రెజికోవా 7-6 (3), 6-3ను ఓడించారు.

నగాల్ తొలి రౌండ్‌తోనే..: భారత స్టార్ సుమిత్ నగాల్ మొదటి రౌండ్‌తోనే తిరుగుముఖం పట్టాడు. హాలెండ్‌కు చెందిన టల్లోన్ గ్రీక్స్‌పూర్‌తో జరిగిన మ్యాచ్‌లో 1-6, 3-6, 6-7 (8)తో సుమిత్ వరుస సెట్లలో ఓటమిపాలయ్యాడు. ఇక నిషియోకా (జపాన్)తో కలిసి నగాల్ డబుల్స్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు.



ఏఐ క్యాపిటల్‌గా హైదరాబాద్

- సెప్టెంబరు 5-6 తేదీల్లో గ్లోబల్ ఏఐ సమ్మిట్
- 200 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు
- తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌ను ఏఐ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)కు పెరిగిపోతున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సెప్టెంబరు 5,6 తేదీల్లో హైదరాబాద్‌లో తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మిట్‌లో దాదాపు 2,000 మంది నిపుణులు పాల్గొననున్నారని మంత్రి తెలిపారు. అలాగే ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం.. నాస్కామ్, హైసియా వంటి పరిశ్రమ ప్రతినిధులతో కలిసి పని చేస్తోందన్నారు.

పీపీపీ విధానంలో ఏఐ సిటీ

కాగా కొత్తగా అభివృద్ధి చేయనున్న ఫోర్త్ సిటీలో భాగంగా ముచ్చర్లలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)లో దీన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో తీసుకున్న చర్యలు, చర్చల అనంతరం ఏఐ సిటీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే దానిపై స్పష్టత వస్తుందని మంత్రి తెలిపారు.

ఏఐ నైపుణాల్లో శిక్షణ

ఏఐ పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా ఏఐ, జెన్‌ఏఐలో దాదాపు 10,000 మంది విద్యార్థులకు హైసియా శిక్షణను అందించనుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందుకు టాస్క్, టీ-హబ్, టీఎస్ఐసీ, ఇతర కీలక ప్రభుత్వ శాఖలు తోడ్పాటునందించనున్నాయన్నారు. అలాగే 1,000 మంది ఫ్యాకల్టీకి ఏఐ ఫ్యూచర్ స్కిల్స్‌లో శిక్షణను అందించనుంది. కాగా పాఠశాల విద్యా స్థాయిలోనే ఏఐకి ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం యోచిస్తోందని, అందుకనుగుణంగా కరిక్యులమ్‌ను రూపొందించాలని చూస్తున్నట్లు తెలిపారు.

నాలుగేళ్లలో ఐటీ ఎగుమతుల్లో రెండింతల వృద్ధి

గడిచిన ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ.2.75 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు. వచ్చే నాలుగేళ్ల కాలంలో ఐటీ ఎగుమతులను రెండింతలు పెంచాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకు ఏఐ సిటీ తోడ్పాటు ఉంటుందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఏఐతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు ఉన్నాయని, కొత్త టెక్నాలజీలు వచ్చినప్పుడు కొంత కాలం పాటు ఆ ధోరణి కనిపిస్తుందన్నారు. ఈ భయాలను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా పరిశ్రమకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దే అవకాశం లభిస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు.

హైదరాబాద్ జీసీసీల్లో జీతాలు అదుర్స్



జీతాలపరంగా దేశంలో మూడో స్థానం
ఢిల్లీ, ముంబై, పుణె, కోల్‌కతా కంటే ఎక్కువ

టీమ్‌లీజ్ డిజిటల్ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ జాబ్స్ ముఖచిత్రం మారిపోతోంది. నిన్నమొన్నటి వరకు ఐటీ, ఫార్మా రంగాల్లోనే అత్యధిక ఉద్యోగాలు ఉండేవి. ఇప్పుడు బహుళ జాతి సంస్థల (ఎంఎన్‌సీ)కు చెందిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఈ విషయంలో ఐటీ కంపెనీలతో పోటీపడుతున్నాయి. ఐటీ సేవల కంపెనీలతో పోలిస్తే 12 నుంచి 20 శాతం అధిక జీతాలు ఇస్తూ నిపుణులైన ఎంట్రీ, మిడ్ లెవల్, సీనియర్ ఉద్యోగులను ఎగిరేసుకుపోతున్నాయి. దేశంలో అత్యధిక జీతాలు ఇచ్చే జీసీసీల పరంగా చూస్తే, హైదరాబాద్ ప్రస్తుతం మూడో స్థానంలో ఉందని టీమ్‌లీజ్ డిజిటల్ రూపొందించిన నివేదిక వెల్లడించింది. ఢిల్లీ, ముంబై, పుణె, కోల్‌కతా వంటి నగరాలతో పోలిస్తే ప్రస్తుతం హైదరాబాద్‌లోని జీసీసీలే అధిక జీతాలు ఇస్తున్నాయి.

అధిక డిమాండ్ వీరికే..

హైదరాబాద్‌లోని మౌలిక సదుపాయాలు, నిపుణులైన ఉద్యోగుల లభ్యత అనేక ఎంఎన్‌సీలను ఆకర్షిస్తున్నాయని టీమ్‌లీజ్ డిజిటల్ బిజినెస్ హెడ్ కృష్ణ విజ్ వెల్లడించారు. అమెరికా, యూరప్ దేశాలతో పోలిస్తే భారత్‌లో జీసీసీ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులు తక్కువ కావటంతో ఎంఎన్‌సీలు హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డేటా సైన్స్, డేటా ఇంజనీరింగ్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ రంగాల్లో నైపుణ్యాలు ఉన్న ఐటీ నిపుణులను ఈ జీసీసీలు అధిక జీతాలతో తన్నుకుపోతున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు సైతం ఈ కేంద్రాలు రూ.9.5 లక్షల నుంచి రూ.11.1 లక్షల వార్షిక జీతాలు ఇస్తున్నాయి. ఇక మంచి అనుభవం ఉన్న మిడ్ అండ్ సీనియర్ ఉద్యోగులకైతే రూ.16.1 లక్షల నుంచి రూ.21.1 లక్షల వరకు ఆఫర్ చేస్తున్నాయి.

1,600కు పైగా జీసీసీలు

ప్రస్తుతం మన దేశంలో 1,600కు పైగా జీసీసీలు ఉన్నాయి. 2030 నాటికి వీటి సంఖ్య 2,400కు చేరనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 180 జీసీసీలు ఉన్నాయి. దేశంలోని జీసీసీల్లో ఇది 13 శాతం. 2030 నాటికి మరో 800 జీసీసీలు ఏర్పాటు కానున్నాయి. అప్పటికి జీసీసీల్లో హైదరాబాద్ వాటా 26 శాతానికి చేరుతుందని అంచనా. దేశవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో ప్రస్తుతం 16 లక్షల మందికి పైగా పని చేస్తున్నారు. వీరిలో 14 శాతం మంది హైదరాబాద్ జీసీసీల్లో పని చేస్తున్నారు. ఇక దేశవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో పని చేసే ఉద్యోగుల్లో 25 శాతం మంది మహిళలు ఉన్నారు. వచ్చే రెండు మూడేళ్లలో ఇది 35 శాతానికి పెరగనుంది. అనేక ఎంఎన్‌సీలు తమ వ్యూహాత్మక విస్తరణలో భాగంగా, మన దేశంలో తమ జీసీసీలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ కేంద్రాల్లో ఐటీ ప్రొడక్ట్స్, సర్వీసెస్ నిపుణులకూ డిమాండ్ పెరుగుతోంది. దీంతో 2026 నాటికి ఈ రెండు రంగాలే 1.4 కోట్ల మంది ఉద్యోగులతో మన జీడీపీలో 8 శాతం వరకు సమకూరుస్తాయని అంచనా.

కొరవడిన నైపుణ్యాలు

ఐటీ రంగంలో డిజిటల్ నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అయితే మన దేశ ఇంజనీర్లలో కృత్రిమ మేధ (ఏఐ)పై పట్టున్న ఇంజనీర్లు పట్టుమని 2.5 శాతానికి మించి లేరు. ప్రోగ్రామింగ్‌లోనూ ఇదే పరిస్థితి. ఐటీ రంగంలో పని చేస్తున్న ఇంజనీర్లలో కేవలం 5.5 శాతం మందికి మాత్రమే బేసిక్ ప్రోగ్రామింగ్‌లో నైపుణ్యాలు ఉన్నట్టు టీమ్ లీజ్ డిజిటల్ నివేదిక తెలిపింది. దీంతో దాదాపు 86 శాతం కంపెనీలు ఈ రంగాల్లో తమ ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకు రీస్కిల్లింగ్ చేపట్టాయి.

మార్కెట్లోకి టీవీఎస్ జుపిటర్ 110



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టీవీఎస్ మోటార్ కంపెనీ.. తెలంగాణ మార్కెట్లోకి సరికొత్త టీవీఎస్ జుపిటర్ 110 స్కూటర్‌ను విడుదల చేసింది. నెక్స్ట్ జెనరేషన్ ఇంజన్, ఫ్యూచరిస్టిక్ ఫీచర్లతో దీన్ని తీసుకువచ్చినట్లు టీవీఎస్ జుపిటర్ ఏజీఎం (మార్కెటింగ్) వైభవ్ శేఖర్, కంపెనీ ఏరియా మేనేజర్ (తెలంగాణ) విశాల్ విక్రమ్ సింగ్ తెలిపారు. 113.3 సీసీ, సింగిల్ సిలిండర్, 4 స్ట్రోక్ ఇంజన్, ఇన్నోవేటివ్ ఐగో అసిస్ట్ టెక్నాలజీ, ఫుల్లీ డిజిటల్ కలర్ ఎల్‌సీడీ స్పీడోమీటర్, డ్యూయల్ హెల్మెట్ స్థలం, ఎమర్జెన్సీ బ్రేక్ వార్నింగ్ ఈ స్కూటర్ ప్రత్యేకతలని వారు పేర్కొన్నారు. డ్రమ్, డ్రమ్ అల్లాయ్, డ్రమ్ ఎక్స్‌సీ, డిస్క్ ఎక్స్‌సీ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ జుపిటర్ ప్రారంభ ధర రూ.77,100 (తెలంగాణ ఎక్స్‌షోరూమ్).



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,030 ▲	66,940 ▲	93,500 ▲
ముంబై	71,762 ▼	65,734 ▼	85,962 ▼

ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ

ముంబై: పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో మంగళవారం ఈక్విటీ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లతో ట్రేడయింది. గత కొద్ది రోజుల ర్యాలీలో సూచీలు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న కారణంగా ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పరుగులు తీశారు. టెలికాం, టెక్నాలజీ, ఐటీ షేర్లు గణనీయంగా లాభపడినా మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకారం సూచీల జోరుకు కళ్లెం వేసిందని విశ్లేషకులంటున్నారు. ఇంత ఆటుపోట్ల వాతావరణంలో కూడా నిఫ్టీ 7.15 పాయింట్ల స్వల్ప లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 25,017.75 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ 13.65 పాయింట్ల లాభంతో 81,711.76 వద్ద క్లోజయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ గరిష్ఠంగా 81,919.11, కనిష్ఠంగా 81,600.51 పాయింట్ల మధ్యన కదలాడింది.

భారత్‌లో మరో 5లక్షల ఉద్యోగాలు: యాపిల్

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్ కంపెనీ భారత్‌పై మరింత దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా వచ్చే నెల 9న విడుదల చేసే ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ మోడల్స్‌ను భారత్‌లో తయారు చేసేందుకు సిద్ధమవుతోంది. దీనివల్ల ఈ ఆర్థిక సంవత్సరం చివరికి ప్రత్యక్షంగా రెండు లక్షలు, పరోక్షంగా మూడు లక్షల కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని అంచనా. కొత్త ఉద్యోగాల్లో 70 శాతం వరకు మహిళలే ఉంటారని భావిస్తున్నారు. తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ వద్ద ఉన్న ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో ఈ ఐఫోన్లు తయారవుతాయని సమాచారం. ఫాక్స్‌కాన్ ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

కొత్త సీఎఫ్‌ఓగా కేవన్ పరేఖ్: మరోవైపు భారత సంతతికి చెందిన కేవన్ పరేఖ్‌ను కొత్త సీఎఫ్ఓగా నియమిస్తున్నట్టు యాపిల్ కంపెనీ ప్రకటించింది. ఆయన వచ్చే ఏడాది జనవరి 1న బాధ్యతలు స్వీకరిస్తారు. పరేఖ్ గత 11 ఏళ్లుగా యాపిల్ ఫైనాన్సియల్ ప్లానింగ్, అనాలసిస్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు.

బిజినెస్

ఇంట్రానాసల్ కొవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధి: ఐఐఎల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) మరో ఘనత సాధించింది. ముక్కు ద్వారా (ఇంట్రానాసల్) తీసుకునే కొవిడ్-19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఆస్ట్రేలియాకు చెందిన గ్రిఫిత్ యూనివర్సిటీతో కలిసి ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్టు తెలిపింది. దీంతో కొవిడ్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా ఇంజెక్షన్ లేకుండా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవచ్చు. ప్రస్తుతం కొవిడ్ వ్యాప్తి చాలా వరకు తగ్గినా ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వారానికి దాదాపు 1,700 మంది ఈ వైరస్‌తో చనిపోతున్నారు. ఇంజక్షన్ రూపంలో కొవిడ్ వ్యాక్సిన్ తీసుకునేందుకు భయపడేవారికి ఐఐఎల్-గ్రిఫిత్ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడనుంది.

వన్‌మనీలో కేశవ్ రెడ్డి పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పని చేసే అకౌంట్స్ అగ్రిగేటర్ స్టార్టప్ కంపెనీ 'వన్‌మనీ'లో మరో స్టార్టప్ కంపెనీ ఈక్వల్ వ్యూహాత్మక పెట్టుబడి పెట్టింది. అయితే పెట్టుబడి మొత్తం ఎంత? అనే విషయాన్ని రెండు కంపెనీలు వెల్లడించలేదు. ఈక్వల్ స్టార్టప్ కంపెనీని జీవీకే గ్రూప్ వైస్ చైర్మన్ సంజయ్ రెడ్డి కుమారుడు కేశవ్ రెడ్డి ప్రమోట్ చేశారు. ఈ కంపెనీ ప్రస్తుతం అనేక కంపెనీలకు ఐడెంటిటీ వెరిఫికేషన్ సేవలు అందిస్తోంది. వన్‌మనీ, ఈక్వల్ ప్రస్తుతం 250కుపైగా బీఎఫ్ఎస్ఐ కంపెనీలకు కేవైసీ సేవలు అందిస్తున్నాయి. తాజా భాగస్వామ్యంతో రెండు సంస్థలు 97 శాతం సక్సెస్ రేటుతో నెలకు 5.5 కోట్ల లావాదేవీలూ పూర్తి చేస్తాయని భావిస్తున్నారు.

కాకినాడ ప్లాంట్‌కు పెట్టుబడులు రెడీ

ఏఎం గ్రీన్ అమ్మోనియా

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ఏర్పాటు చేసే గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ పెట్టుబడులను గ్రీన్‌కో గ్రూప్ ఖరారు చేసింది. అయితే ఈ పెట్టుబడి ఎంత అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఏఎం గ్రీన్ అమ్మోనియా బీవీ పేరుతో గ్రీన్‌కో గ్రూప్ ఈ ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. గత ఏడాది టేకోవర్ చేసిన ఒక యూరియా ప్లాంట్‌లో కొన్ని మార్పులు చేసి.. దాన్ని ఏటా 10 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసే ప్లాంట్‌గా మార్చాలని గ్రీన్‌కో భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28 వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	495
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	108
వరంగల్	109	గుంటూరు	105
కరీంనగర్	109	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	98
కర్నూలు	109	నెల్లూరు	98
విశాఖపట్నం	104	అనంతపురం	105
గోదావరి	108		

శిశు విహార్ కేంద్రంలో చేరిన కలెక్టర్ కూతురు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 27: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిశు విహార్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే... మంగళవారం తన కూతురు స్వర ధోత్రే(3)ను చేర్పించి ఆదర్శంగా నిలిచారు. మిషన్ శక్తి పాలన పథకంలో భాగంగా శిశు విహార్ కేంద్రాన్ని సమీకృత కలెక్టర్ భవన సముదాయంలో జూన్‌లో ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల సంరక్షణతో పాటు పోషకాహారాన్ని అందిస్తారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన శిశువిహార్ కేంద్రాల్లో ఆసిఫాబాద్ శిశు విహార్ మూడోది. ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తన కూతురు శిశు విహార్ కేంద్రంలో చదువుకోవడం సంతోషంగా ఉందన్నారు. శిశు విహార్‌లో ఒకటి నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకుంటారని, సమయానికి పోషకాహారం అందిస్తారని తెలిపారు. ఆటపాటలు బొమ్మలతో ప్రాథమిక విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు.

గిరిజనబిడ్డలు విద్యకు దూరం కావడమా?:

» టీచర్లు లేక బడులు మూతబడితే ఎలా: హరీశ్



హైదరాబాద్, ఆగస్టు27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ తప్పిదం వల్ల గిరిజన బిడ్డలు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గిరిజనులు అధికంగా నివసించేచోట వారికి చదువుకునే అవకాశం లేకపోవడం బాధాకరమని అన్నారు. ఉపాధ్యాయులు లేని కారణంగా గిరిజన ప్రాంతాల్లో ఏకంగా 43 పాఠశాలలు మూతబడితే ఎలాగని ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు. దీనికి పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని, ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి.. ఆ పాఠశాలలను వెంటనే తెరిపించాలని హరీశ్ డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో మందుల్లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైద్య విభాగాలు చేతులెత్తేయడంతో చేసేదిలేక ప్రైవేటు ఫార్మసీల్లో కొనాల్సి వస్తోందని హరీశ్ ఆరోపించారు. ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కయిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ మందుల కొరత ఉందని ఆయన ఆరోపించారు. మూడు నెలలకు సరిపడా మందుల బఫర్ స్టాక్ పెట్టుకోవాల్సి ఉన్నప్పటికీ.. ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోందని ఆయన ప్రశ్నించారు.

ఒవైసీ బెదిరింపులకు భయపడొద్దు

» సీఎం రేవంత్ సంకల్పం భేష్: ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): చెరువులను కాపాడాలని సీఎం రేవంత్ సంకల్పం తీసుకోవడం అభినందనీయమని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ సంకల్పం పూర్తి కావాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఒవైసీ బ్రదర్స్ బెదిరింపులకు సీఎం రేవంత్ భయపడొద్దని సూచించారు. వేల మంది యువత మద్దతు ఉందని అక్బరుద్దీన్ బెదిరిస్తున్నారని రాజాసింగ్ ఆరోపించారు గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డిని కూడా ఇలానే భయపెడితే, ఆయన భయపడకుండా ఓవైసీ బ్రదర్స్‌ను జైలులో వేశారని చెప్పారు. ఉచిత విద్య పేరుతో ఓవైసీ సోదరులు కోట్లు దోచుకుంటున్నారని, చెరువును ఆక్రమించి ఫాతిమా కాలేజీని నిర్మించారని ఆరోపించారు. అసదుద్దీన్ ఒవైసీ బంగ్లా కూడా ప్రభుత్వ స్థలంలోనే ఉందని, దానిని విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అన్నారు.

జీవో 33పై మరికొందరు పిటిషన్లు

» వీరికీ మునుపటి ఉత్తర్వులు వర్తిస్తాయన్న హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్‌లో కాంపిటెంట్ కోటా ప్రవేశాలకు ఎవరు స్థానికులు అన్న విషయమై ప్రభుత్వం జారీచేసిన జీవో 33ను సవాల్ చేస్తూ మరింత మంది విద్యార్థులు హైకోర్టులో మంగళవారం పిటిషన్‌లు దాఖలు చేశారు. నీట్ పరీక్షకు ముందు వరుసగా నాలుగు సంవత్సరాలు (ఇంటర్, పది, తొమ్మిది తరగతులు) తెలంగాణలోనే చదివి ఉండటంతోపాటు పరీక్షలు సైతం ఇక్కడే రాసి ఉండాలని ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఇంటర్ ఇతర రాష్ట్రాల్లో చదవిన తెలంగాణ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేస్తున్నారు. తహసీల్దార్ జారీచేసే నివాస ధ్రువీకరణ పత్రం ఉంటే వారిని స్థానికులుగానే పరిగణించాలని హైకోర్టు ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. నూతనంగా పిటిషన్‌లు దాఖలు చేసిన వారికి సైతం అవే మధ్యంతర ఉత్తర్వులు వర్తిస్తాయని, వారందరి దరఖాస్తులు స్వీకరించి మెడికల్ కౌన్సెలింగ్‌కు అనుమతించాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం పేర్కొంది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

లేక్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ.. రేవంత్: ఈరవత్రి

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): భావితరాలు, రాష్ట్ర భవిష్యత్తు కోసం హైడ్రాను ఏర్పాటు చేసి.. పులిమీద స్వారీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రియల్ హీరోగా నిలిచారని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. లేక్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అనే పేరును రేవంత్‌రెడ్డి తెచ్చుకుంటే.. ఫేక్ మ్యాన్ ఆఫ్ తెలంగాణగా కేసీఆర్ నిలిచిపోయారని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం తథ్యం

» బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాశ్

హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్‌లో గులాబీ పార్టీ విలీనం తథ్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాశ్ ఆరోపించారు. ముహూర్తం కూడా త్వరలోనే ఖరారు అవుతుందంటూ కాంగ్రెస్ వర్గాల్లోనే ప్రచారం జరుగుతోందని చెప్పారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో సుభాశ్ మాట్లాడుతూ... రాజ్యసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని పోటీలో పెట్టలేదని తద్వారా కేసీఆర్... కాంగ్రెస్ అభ్యర్థికి పరోక్షంగా మద్దతిచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అనుభవజ్ఞులైన న్యాయవాదులు కవితకు బెయిల్ రావడంలో తీవ్రంగా శ్రమించారని సుభాశ్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి కుంభకోణాలపై దర్యాప్తు నిలిచిపోవడం దేనికి సంకేతమని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కబ్జాలో ఉన్న విద్యా సంస్థలకు టైం ఇస్తాం

» ఆలోగా యాజమాన్యాలే ఆక్రమణలను తొలగించాలి
» లేని పక్షంలో సెలవుల్లో మేమే చర్యలు తీసుకుంటాం
» పేదల ఇళ్లు, చిన్న గృహాలను కూల్చబోం: రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'చెరువుల పరిరక్షణ ముఖ్యం. విద్యార్థుల భవిష్యత్తు అంతకంటే ప్రధానం. చెరువు ఎఫ్‌టీఎల్‌లో విద్యా సంస్థల భవనాలుంటే.. యాజమాన్యాలకు కొంత సమయం ఇస్తాం' అని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా) కమిషనర్ రంగనాథ్ అన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో భవనాలను కూల్చివేస్తే పిల్లలకు ఇబ్బంది అవుతుందని తల్లిదండ్రుల నుంచి కూడా విజ్ఞప్తులు వస్తున్నాయని ఆయన తెలిపారు. బండ్లగూడలోని సల్కం చెరువు, ఇతర చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ మంగళవారం బీజేపీ కార్పొరేటర్లు రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. పలు చెరువుల్లో ఆక్రమణల వివరాలను రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ వారితో మాట్లాడారు. రాజకీయ చదరంగంలో హైడ్రా పావు కాదలచుకోలేదని, రాజకీయాలకు అతీతంగా చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఆక్రమణలు తొలగిస్తామని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమించిన జాబితాలో పాఠశాలలు, కళాశాలల భవనాలు ఉంటే మాత్రం కొంత సమయం ఇస్తామని.. పిల్లలకు ఇబ్బంది లేకుండా వాళ్లే కూల్చివేతలను చేపట్టాలన్నారు. లేని పక్షంలో విద్యాసంవత్సరం ముగిసిన అనంతరం సెలవుల సమయంలో హైడ్రా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. మల్లారెడ్డి, ఒవైసీ ఎవరి విద్యా సంస్థలైనా.. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. పేదలు, చిన్న ఇళ్ల మీదకు వెళ్లబోమని.. ఎవరూ వెళ్లినా ఊరుకోబోమని స్పష్టం చేశారు. కాగా, చెరువులు ఆక్రమించి భవనాలు నిర్మించిన మల్లారెడ్డి, అక్బరుద్దీన్ లాంటి వాళ్లు పిల్లల వద్ద రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యను వ్యాపారంగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, కార్పొరేటర్లు శ్రవణ్, వంగ మధుసూదన్‌రెడ్డి తదితరులు రంగనాథ్‌ను కోరారు.



చెరువుల్లో ఆక్రమణలను తొలగించాలని రంగనాథ్‌కు విజ్ఞప్తి చేస్తున్న బీజేపీ నేతలు

17 నుంచి ప్రజాపాలన

(మొదటిపేజీ తరువాయి)

వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. డెంగీ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆస్పత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే పనులు ముమ్మరం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని ఆదేశించారు. పనిచేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్.. సమన్వయంతో పని చేయాలన్నారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకోవాలన్నారు.

గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం..

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాన్ని గోషామహల్‌లో నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అక్కడ పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉన్న 32 ఎకరాల స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యంగా ఎంచుకున్న 'స్పీడ్' (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై సీఎం మంగళవారం సచివాలయంలో తొలి సమీక్ష నిర్వహించారు. స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం, 15 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 కొత్త పారామెడికల్ కాలేజీలు, జిల్లాల్లో మహిళా సంఘాలకు సమాఖ్య భవన నిర్మాణ అంశాలపై చర్చించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని రాబోయే 50ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేయాలన్నారు. ఆస్పత్రిలో అన్ని విభాగాలతోపాటు, అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు నిర్మించాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దాలన్నారు. పేషంట్లకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా విశాలమైన ప్రాంగణాలు, తగిన ఖాళీ ప్రదేశం ఉండేలా డిజైన్ రూపొందించాలని చెప్పారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి దామోదర

ఇందుకోసం అనుభవజ్ఞులైన ఆర్కిటెక్టుల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని సంరక్షిస్తామని, దానిని చారిత్రక కట్టడంగా భావించి పునరుద్ధరిస్తామని సీఎం చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా ఈ పనులు చేపడతామని, ఆ ప్రాంగణాన్ని పర్యాటక ప్రాంతంగా మారుస్తామన్నారు. గోషామహల్‌లోని పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్సులకు సంబంధించిన 32 ఎకరాలు తీసుకుంటున్నందుకుగాను ఆ శాఖకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ఆదేశించారు. దీనికోసం పేట్లబురుజులోని పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ చుట్టూ ఉన్న స్థలాన్ని పరిశీలించాలని సూచించారు. ఇక రాష్ట్రంలో కొత్తగా నిర్మించే ఆస్పత్రుల పనులను వేగవంతం చేయాలని, 15 నర్సింగ్ కాలేజీల భవనాలను ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది నుంచే నర్సింగ్ కాలేజీలను ప్రారంభించాలని, తాత్కాలికంగా అద్దె భవనాల్లో నిర్వహించే ఏర్పాట్లు చూడాలని చెప్పారు.

22 సమాఖ్య భవనాలు..

మహిళా స్వయం సహాయక సంఘాలకు పది జిల్లాల్లో సమాఖ్య భవనాలున్నాయని, మిగతా 22 జిల్లాల్లో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఒక్కో భవనానికి ఎకరం స్థలం కేటాయించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. స్థలాలను వెంటనే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని శిల్పారామం పక్కన మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడెకరాల స్థలాన్ని వెంటనే ఆ విభాగానికి బదిలీ చేయాలని ఆదేశించారు. మహిళా శక్తి సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ఏడాది పొడవునా విక్రయించుకునేందుకు స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ స్థాయి అతిథులు, ప్రముఖులు, జాతీయ నేతలు ఎవరు వచ్చినా ఈ సెంటర్‌ను తప్పక సందర్శించేలా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రానికే ఇది తలమానికమైన పర్యాటక ప్రాంతంగా మారాలని సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

కూల్చివేతల్లో నష్టపోయిన వారికి బిల్డర్ల నుంచి పరిహారం

» ఎఫ్‌జీజీ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలను 'హైడ్రా' కూల్చివేస్తున్న కారణంగా నష్టపోయే పేద, మధ్య తరగతి ప్రజలకు బిల్డర్ల నుంచి పరిహారం ఇప్పించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈమేరకు ముఖ్యమంత్రికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి మంగళవారం లేఖ రాశారు. బిల్డర్లు అపార్ట్‌మెంట్లు, విల్లాలను నిర్మించి విక్రయిస్తుంటారని, ఈ స్థలాలు, భూములను రిజిస్ట్రేషన్ చేయించి, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల నుంచి తగిన నిర్మాణ అనుమతులు తీసుకుంటున్నారని తెలిపారు. కానీ కొనుగోలు చేసిన పదేళ్ల తర్వాత.. ఆ స్థలాలు, భూములు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ హైడ్రా కూల్చివేస్తోందన్నారు. హైడ్రా చర్యలను స్వాగతించాల్సిందేనని, అయితే.. ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేసిన అమాయక ప్రజలు బిల్డర్ల కారణంగా నష్టపోతున్నారని తెలిపారు. బిల్డర్లతో కుమ్మక్కై తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ, తప్పుడు అనుమతులిచ్చిన హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నిబంధనల ప్రకారమే గెస్ట్‌హౌస్

» అక్రమ నిర్మాణమని తేలితే నేనే కూల్చేస్తా
» ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27: రంగారెడ్డి జిల్లా కొత్వాల్‌గూడ-హిమాయత్ సాగర్‌లో నిబంధనల ప్రకారమే తాను గెస్ట్‌హౌస్ నిర్మించానని, అక్రమ నిర్మాణం అని తేలితే దానిని తానే కూల్చివేస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. కొత్వాల్‌గూడ సర్వే నంబర్ 13లో తన కుమారుడి పేరిట 14.14 ఎకరాల పట్టా భూమి ఉందని చెప్పారు. ఈ భూమిని 1999లో కొనుగోలు చేశామని, 2005లో అనుమతి తీసుకుని నిబంధనల మేరకు చిన్నపాటి నిర్మాణం చేపట్టామని వివరించారు. కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

హైడ్రా స్పీడ్ పెంచేలా..!

» సంస్థ ముందుకు వేలల్లో ఫిర్యాదులు
» పరిశీలనకు సరిపడా సిబ్బంది కరువు
» 72 బృందాల ఏర్పాటుకు హైడ్రా యోచన
» ఉద్యోగులు కావాలని ప్రభుత్వానికి వినతి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణల కూల్చివేతలను మరింత ముమ్మరం చేసేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా) రంగం సిద్ధం చేస్తోంది. కబ్జాలపై వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి తనిఖీలకు బృందాలను పెంచాలని భావిస్తోంది. ప్రస్తుతం ఆరు బృందాలు చెరువుల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నాయి. ఈ సిబ్బంది సరిపోకపోవడంతో భారీగా ఫిర్యాదులు పేరుకుపోతున్నాయని సంస్థ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా అవసరమైన సిబ్బందిని సమకూర్చుకునేలా అనుమతి ఇవ్వాలంటూ హైడ్రా మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు తెలుస్తోంది. ఔటర్ వరకు 2,050 చదరపు కి.మీ. విస్తీర్ణంలోని ప్రాంతాలకు సంబంధించి 72 బృందాలను ఏర్పాటు చేయాలని హైడ్రా భావిస్తోంది. మొత్తంగా సంస్థలోని అన్ని విభాగాలకు 3,500 మంది ఉద్యోగులు అవసరమని అంచనా వేస్తోంది. సరిపడా సిబ్బంది అందుబాటులోకి వస్తే ఫిర్యాదుల పరిశీలన వేగవంతమవుతుందని సంస్థ ధీమాగా ఉంది. ప్రస్తుతం టెండర్ ద్వారా ఎంపిక చేసిన ఏజెన్సీతో కూల్చివేతలు చేపడుతున్నారు. యంత్రాలు, ఇతర పరికరాలను ఆ ఏజెన్సీనే సమకూర్చుకుంటోంది. పరిశీలనా బృందాల సంఖ్య పెరిగిన పక్షంలో కూల్చివేతలూ భారీ స్థాయిలో చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏజెన్సీలనూ సిద్ధం చేయనున్నారు.



ఫాక్ సాగర్‌ను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఫాక్ సాగర్‌ను పరిశీలించిన రంగనాథ్

జీడిమెట్లలోని ఫాక్ సాగర్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. విషయం తెలుసుకున్న పక్కనున్న బస్తీల వాసులు ఆయనను కలిశారు. 30, 40 ఏళ్ల క్రితం నుంచి అక్కడే ఉంటున్నామని.. కూల్చివేస్తే రోడ్డున పడతామని చెప్పారు. పేదల ఇళ్ల జోలికి రాబోమని.. వారి ఇళ్లను కూల్చడం తమ ఉద్దేశం కాదని రంగనాథ్ వివరించారు. ఫాక్ సాగర్‌ను మరోసారి పరిశీలించాలని ఆయన నిర్ణయించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో 20కిపైగా చెరువులు ఆక్రమణకు గురయ్యాయని హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. రంగనాథ్ రాకతో ఆక్రమణదారుల్లో వణుకు మొదలైంది.

నాలా కబ్జా చేసి కట్టారు

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండటంతో దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నివేదికనే బయటకు రాకుండా తొక్కి పెట్టారు. ఇపుడు ఈ నివేదిక బయటపడింది. దీని ఆధారంగానే మరోసారి సర్వే జరిపి రెండు, మూడు రోజుల్లో చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

నాడు రేవంత్‌పై కేసు.. జైలుకు

జన్వాడలో ఫామ్‌హౌస్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారంటూ రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆరోపించారు. అక్రమ నిర్మాణమని నిరూపించేందుకు అప్పట్లో రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ స్థలాన్ని సందర్శించారు. ఫామ్‌హౌస్ చుట్టుపక్కల కేటీఆర్ భార్య, బంధువుల భూములు ఉన్నట్లు పేర్కొనే డాక్యుమెంట్లను బయటపెట్టారు. ఇదే సమయంలో ఓ డ్రోన్ ద్వారా ఈ ఫామ్‌హౌస్ ఫోటోలు తీశారనే ఆరోపణతో రేవంత్‌పై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేసు పెట్టి ఆయనను జైలుకు పంపింది. ఈ వివాదం సందర్భంలోనే రేవంత్‌రెడ్డి.. ఈ ఫాంహౌస్ 111 జీవో పరిధిలో ఉందని పేర్కొంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో కేసు వేశారు. దీంతో ఫామ్‌హౌస్ వివరాలు వెల్లడించాలని ట్రైబ్యునల్ నోటీసులు జారీ చేసింది. దీనిపై కేటీఆర్ అనుయాయులు హైకోర్టును ఆశ్రయించగా స్టే లభించింది. ఆ తర్వాత కాలంలో 111 జీవోను రద్దు చేయడంతో దీనిపై పెద్దగా ఎవరూ దృష్టి సారించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం కావడం.. హైడ్రాను ఏర్పాటు చేయటం, ఆ సంస్థ అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతుండటంతో మరోసారి జన్వాడ ఫాంహౌస్ చర్చల్లోకి వచ్చింది.



జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద అధికారులు

జన్వాడ ఫామ్‌హౌస్ పరిశీలన

శంకర్‌పల్లి, మేడ్చల్ టౌన్, ఆగస్టు 27 : జన్వాడ రెవెన్యూ పరిధిలో మాజీ మంత్రి కేటీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్‌ను రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఫామ్‌హౌస్‌తోపాటు సమీపంలోని ఫిరంగి కాలువను పరిశీలించి ఆక్రమణలపై ఆరా తీశారు. కాలువ సర్వే బుధవారం నిర్వహించనున్నారు. అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చేస్తున్న నేపథ్యంలో జన్వాడ ఫామ్ హౌస్ వద్ద అధికారుల పరిశీలన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హైడ్రా పరిధి హైదరాబాద్ వరకే కావడం, ఫామ్ హౌస్ 111 జీవో పరిధిలో ఉండడంతో కూల్చివేతపై సందేహాలు ఉన్నాయి. సుమారు 27 ఎకరాల్లోఉన్న ఈ ఫామ్ హౌస్ తనది కాదని కేటీఆర్ చెబుతున్నప్పటికీ ఆయన భార్య శైలిమ, అత్త, స్నేహితుడు బద్వేల్ ప్రదీప్‌రెడ్డి పేరున భూములు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. 2020లో జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారన్న ఆరోపణలపై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని అప్పట్లో జైలుకు పంపిన సంగతి తెలిసిందే. కాగా, మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడ గ్రామాన్ని హైడ్రా కమిషన్ రంగనాథ్ మంగళవారం సందర్శించారు. జీడిమెట్ల ఫాక్‌సాగర్‌తో పాటు దూలపల్లి, మైసమ్మగూడను సందర్శించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మల్లారెడ్డి యూనివర్సిటీ సమీపంలోని కాలువను, ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు.

జగన్ అండతో సజ్జన్ బచ్‌గయా!

» 'మిస్టరీ లవ్‌స్టోరీ'లో కీలక మలుపు
» ముంబైలో సజ్జన్ జిందాల్‌పై నటి రేప్ కేసు
» జగన్‌ను ఆశ్రయించిన పారిశ్రామికవేత్త
» ఆమెను దారికి తెచ్చేందుకు ఇక్కడ కేసు
» రంగంలోకి ఐపీఎస్‌లు కాంతిరాణా, గున్నీ
» జిందాల్‌పై కేసు విత్‌డ్రా కోసం బెదిరింపు

ల్యాండ్ సెటిల్‌మెంట్లు చూసి ఉంటారు!
ఫైనాన్స్ సెటిల్‌మెంట్లు చూసి ఉంటారు!
ఆస్తుల సెటిల్‌మెంట్లూ చూసి ఉంటారు!

కానీ... ఇది 'లవ్' సెటిల్‌మెంట్! దేశంలోనే బడా పారిశ్రామిక వేత్త ఒకరిని కాపాడేందుకు చేసిన బెదిరింపుల సెటిల్‌మెంట్! అందులోనూ ఒక ముఖ్యమంత్రి ఆదేశంతో... ప్రభుత్వ సలహాదారు రంగంలోకి దిగి... ఇద్దరు ఐపీఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరీ చేసిన సెటిల్‌మెంట్! మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'మిస్టరీ లవ్ స్టోరీ'లో ఇదో భారీ మలుపు!

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

సజ్జన్ జిందాల్! జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ మేనేజింగ్ డైరెక్టర్! దేశంలోనే అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల్లో ఆయన ఒకరు! అలాంటి ప్రముఖుడిపై గత ఏడాది ముంబైకి చెందిన ఒక నటి 'రేప్' కేసు పెట్టింది. అప్పట్లో ఇదో సంచలనం. అయితే... కొద్ది రోజులకే అదే నటి సజ్జన్ జిందాల్‌పై కేసును వాపస్ తీసుకుంది! కేసు పెట్టడానికి, వాపస్ తీసుకోవడానికి మధ్య విజయవాడ కేంద్రంగా ఒక భారీ 'సెటిల్‌మెంట్' నడిచింది. అక్కడ 'బాధితురాలి'గా సజ్జన్ జిందాల్‌పై కేసు పెట్టిన ముంబై నటిని... ఇక్కడ నిందితురాలిగా చేర్చి ఒక కేసు పెట్టారు. ఆమెను, ఆమె తల్లిదండ్రులనూ అరెస్టు చేసి నెలకుపైగా జైలులో ఉంచారు. తీవ్రంగా హింసించారు. ఇక్కడ బెయిలుపై విడుదలైన తర్వాత... అక్కడ సజ్జన్ జిందాల్‌పై పెట్టిన రేప్ కేసును ఆమె ఉపసంహరించుకున్నారు. వెరసి... జిందాల్‌ను రక్షించేందుకు ఏకంగా అప్పటి ప్రభుత్వ పెద్దలే రంగంలోకి దిగి, ముంబై నటిపై కేసు పెట్టి, ఆమెను అరెస్టు చేయించి, బెదిరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేప్ కేసులో ఇరుక్కుని...

ముంబై నటి 2023 డిసెంబరులో సజ్జన్ జిందాల్‌పై రేప్ కేసు పెట్టింది. ఇది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సజ్జన్ జిందాల్ చిక్కుల్లో ఇరుకున్నారు. ఆమె కేసు విత్‌డ్రా చేసుకోకుంటే కోర్టు విచారణ ఎదుర్కోక తప్పదు! దీంతో... ఆమెతో రాజీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ రాజీ ఎపిసోడ్‌లో వైసీపీ నేత, 2014లో పెనమలూరు వైసీపీ అభ్యర్థి, ఓ మోస్తరు పారిశ్రామికవేత్త అయిన కేవీఆర్ విద్యాసాగర్ కూడా ప్రవేశించారు. ఆయనకు సదరు ముంబై నటితోపాటు సజ్జన్ జిందాల్‌తోనూ పరిచయముంది. దీంతో... కేసు వాపసు తీసుకునేందుకు ఆమెను ఒప్పించేందుకు ప్రయత్నించారు.



సజ్జన్ జిందాల్‌తో జగన్ (ఫైల్)

కానీ, అందుకు ఆమె ససేమిరా అన్నారు! దీంతో ఆమెను దారికి తెచ్చుకునేందుకు 'మనదైన స్టైల్‌లో ముందుకెళదాం' అన్నట్లుగా ఈ మ్యాటర్‌ను అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్లారు. సజ్జన్ జిందాల్‌కు జగన్ సన్నిహితుడనే విషయం అందరికీ తెలుసు. ఇక... విద్యాసాగర్‌కూ జగన్‌తో మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ క్రమంలో... సజ్జన్ జిందాల్, విద్యాసాగర్ ఇద్దరూ కలిసి ఈ ఏడాది ఫిబ్రవరిలో జగన్‌ను కలిసినట్లు సమాచారం. ఆ తర్వాతే... 'కౌంటర్' వ్యూహం అమలులోకి వచ్చింది.

ఇబ్రహీంపట్నంలో కేసు

జగన్‌తో సజ్జన్ జిందాల్ భేటీ అనంతరం... ఈ వ్యవహారాన్ని నేరుగా డీల్ చేసేందుకు సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి రంగంలోకి దిగినట్లు సమాచారం. తమ వ్యూహంలో భాగంగా విద్యాసాగర్ అదే ముంబై నటిపై విజయవాడ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఆమె తనను బ్లాక్ మెయిల్ చేసిందనీ, కొన్ని సంతకాలు చేయించుకుందనీ ఆరోపించారు. సలహాదారు ఆదేశాలతో అప్పటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా ఆగమేఘాల మీద స్పందించారు. అప్పటి డీసీపీ విశాల్ గున్నీ నేతృత్వంలో ప్రత్యేక బృందం ముంబైకి వెళ్లింది. అక్కడ... ముంబై నటిని, ఆమె తల్లిదండ్రులను అరెస్టు చేశారు. ఆ తర్వాత నటి కుటుంబ సభ్యులను దారుణంగా వేధించినట్టు తెలుస్తోంది. నాడు కమిషనరేట్‌లో ఉంటూ చక్రం తిప్పి, ఇప్పుడు వీఆర్‌లో ఉన్న ఒక ఎస్ఐ... నటి పట్ల దారుణంగా ప్రవర్తించినట్టు తెలిసింది. ఆ నటితోపాటు ఆమె కుటుంబ సభ్యులను చిత్రహింసలు పెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత పోలీసులు అసలు విషయం చెప్పారు. ముంబైలో సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసును వాపసు తీసుకుంటే... ఇక్కడ ఈ కేసులో ఉపశమనం ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో వారి బంధువులు వచ్చి పోలీసులతో మాట్లాడి రాజీకి అంగీకరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న అరెస్టుకాగా... మార్చి 8న ఆ నటి, కుటుంబ సభ్యులు బెయిలుపై విడుదలై ముంబై వెళ్లిపోయారు. ఆపై వారం రోజులకే, అంటే మార్చి 16న సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసును ఆమె ఉపసంహరించుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన కొద్దిరోజుల తర్వాత ఇబ్రహీంపట్నంలో నమోదైన కేసు విషయంలో 'రాజీ' కుదిరింది. కేసు విచారణ కోర్టులో ఉండడంతో లోక్ అదాలత్‌లో వైసీపీ నేత, నటి రాజీపడుతున్నట్టుగా కాగితాల్లో చూపించారు. రేప్ కేసు నుంచి సజ్జన్ జిందాల్ ఇలా బయటపడ్డారు!

కృష్ణా ప్రాజెక్టులకు నిలకడగా వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కృష్ణా, భీమా నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదికి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయానికి సోమవారం సాయంత్రం 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 129.72 టీఎంసీలకు గాను 124.47 టీఎంసీల నీటిని నిల్వచేశారు. రిజర్వాయర్ నుంచి 1,50,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయానికి 1,30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 25 గేట్లు ఎత్తి 1,51,460 క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా 34.04 టీఎంసీల నీరు ఉంది. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 1,85,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. జలాశయ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా 8.65 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి 1,78,948 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు 1,32,709 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68,744 క్యూసెక్కులను వదులుతున్నారు. జలాశయ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 211.47టీఎంసీల నీరు ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండటంతో (312టీఎంసీలు) ఎగువ నుంచి వస్తున్న 79,260క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో గోదావరి నదిపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 9,886 క్యూసెక్కుల వరద వస్తోంది.

మిగిలిన ఇంజనీరింగ్ సీట్ల భర్తీ కోసం
30 నుంచి స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): మిగిలిపోయిన ఇంజనీరింగ్ సీట్ల భర్తీ కోసం ఈ నెల 30వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలో కన్వీనర్ కోటా ఇంజనీరింగ్ సీట్ల భర్తీ కోసం ఇప్పటికే కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. కౌన్సెలింగ్ తర్వాత కూడా భర్తీ కాకుండా మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నారు. తాజాగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్ల వివరాలను బుధవారం ఆయా కాలేజీలు ప్రకటించాల్సి ఉంటుంది. అదే రోజు స్పాట్ అడ్మిషన్ల కోసం కాలేజీల వారీగా నోటిఫికేషన్లను జారీ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఈనెల 30 నుంచి సెప్టెంబరు 2 వరకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించాలి. ఈ స్పాట్ అడ్మిషన్లలో సీట్లను పొందిన అభ్యర్థుల వివరాలను సెప్టెంబ రు 3వ తేదీన ఆన్‌లైన్‌లో ప్రదర్శించాలి. ఈ నెల 4వ తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి, సమాచారాన్ని కన్వీనర్‌కు సమర్పించాలి. వచ్చేనెల 10వ తేదీలోపు మేనేజ్‌మెంట్ కోటాలోని ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలకు ఆదేశాలను జారీ చేశారు.

నేటి నుంచి డిఎస్సీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల సమర్పణ

డిఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు బుధవారం నుంచి తమ సర్టిఫికెట్లను సమర్పించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ఈ మేరకు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. దీని ప్రకారం ఉపాధ్యాయ పోస్టులకు పోటీ పడుతున్న స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2వ తేదీలోపు సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే వీటిని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్లను నిపుణుల కమిటీ పరిశీలించనుంది.

వచ్చే పదేళ్లు అధికారం మాదే: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రుణమాఫీపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రజాకంటక పాలనకు విసుగు చెందే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారనే విషయం గుర్తుపెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. రుణమాఫీపై అసత్యాలు ప్రచారం చేస్తూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాన్ని మానుకోకపోతే బీఆర్ఎస్‌కే నష్టం వాటిల్లుతుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఏవైనా సాంకేతిక కారణాల వల్ల అర్హులైన రైతులకు మాఫీ జరగకపోతే వాళ్లకు తప్పక న్యాయం చేస్తామని ఆయన స్పష్టతనిచ్చారు.

డీజీపీతో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరాత్ విన్ ఓవెన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజకీయ ఆర్థిక సలహాదారు నళిని రఘురామన్ కూడా డీజీపీతో సమావేశమైన వారిలో ఉన్నారు. ఈ సమావేశంలో ఇరు విభాగాల పరస్పర సహకారం, పలు అంశాలపై అధికారులు చర్చించారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఎంపిక జాబితా విడుదల

రాష్ట్రంలో భర్తీ చేయాలని నిర్ణయించిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఖరారు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు మంగళవారం వెల్లడించారు. ఈ పోస్టులకు ఎంపికైన మొత్తం 171 మంది అభ్యర్థులకు సంబంధించిన వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులోఉంచినట్టు చెప్పారు. కాగా, గ్రౌండ్ వాటర్ శాఖలోని పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను 31న నిర్వహించన్నున్నట్టు అధికారులు ప్రకటించారు.

డీఎస్సీకి 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక

» సెప్టెంబరు మొదటి వారంలో ఫలితాలు..?

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా ఒక్కో పోస్టుకు ముగ్గురు (1:3 నిష్పత్తి) అభ్యర్థుల చొప్పున మెరిట్ జాబితాను ఎంపిక చేయాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. సెప్టెంబరు మొదటి వారంలో డీఎస్సీ ఫలితాలను వెల్లడించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబరు మొదటి వారంలో తుది కీతో పాటు, ఫలితాలను వెల్లడించాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా మొదట అభ్యర్థులందరి ఫలితాలను ప్రకటించనున్నారు. అనంతరం టెట్ మార్కుల వెయిటేజీని కలిపి, ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల చొప్పున మెరిట్ జాబితాను ప్రకటించాలని నిర్ణయించారు.

మీడియా అండ్ కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా శ్రీరామ్ కర్రి



హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖలో మీడియా అండ్ కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా సీనియర్ జర్నలిస్టు, రచయిత శ్రీరామ్ కర్రి నియమితులయ్యారు. రెండేళ్ల కాంట్రాక్టు ఒప్పందంపై శ్రీకాంత్‌ను డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం. హనుమంతరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

మూసీని.. మూసేసి..!

వ్యర్థాలతో నింపి ప్లాట్లుగా విక్రయం.. పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు

» ఇప్పటికీ కొనసాగుతున్న ఆక్రమణలు
» టిప్పుఖాన్ బ్రిడ్జ్ వద్ద యథేచ్ఛగా లేఅవుట్లు
» బాపూఘాట్ వరకు పూర్తిగా కబ్జా
» జియాగూడలో కలుస్తున్న కబేళా వ్యర్థాలు
» పురానాపూల్‌లో శ్మశానం, దర్గా విస్తరణ
» చాదర్‌ఘాట్ కాజ్ వే ద్వారాలకూ కబ్జా చెర
» అంబర్‌పేటలో మట్టితో నింపేస్తున్న వైనం
» నాగోల్‌లో బఫర్‌జోన్‌లోనే లేఅవుట్లు

(ఆంధ్రజ్యోతి హైదరాబాద్ సిటీ నెట్‌వర్క్)



ఆక్రమణకు గురైన మూసీ పరీవాహక ప్రాంతం

అనంతగిరి కొండల్లో జన్మించి.. వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి-భువనగిరి, నల్లగొండ జిల్లాల మీదుగా మఠంపల్లి వద్ద కృష్ణాలో కలిసే మూసీనదిని ఎక్కడికక్కడ మూసేస్తున్నారు..! రేవంత్ సర్కారు లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా మూసీని అభివృద్ధి చేయాలని కృతనిశ్చయమైనా.. రూ. లక్షన్నర కోట్ల అంచనా వ్యయమయ్యే ఈ మహా క్రతువుకు అడుగడుగునా అడ్డంకులుగా కబ్జాలు, పూడికలు, డంపింగ్ యార్డులు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం కూడా హైదరాబాద్ నగర దాహార్తిని తీర్చి.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పంటపొలాలకు నీరందించిన మూసీ.. ఇప్పుడు ఆక్రమణలతో కుంచించుకుపోయింది. కొన్ని చోట్ల ఉనికినే కోల్పోయే పరిస్థితిలో ఉంది. 'ఆంధ్రజ్యోతి' బృందం నార్సింగ్ ఔటర్ నుంచి.. నాగోల్‌లోని మూసీ బ్రిడ్జి వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపగా.. విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. మూసీని మూసేసిన వైనంపై.. 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..!

గండిపేట వరకే స్వచ్ఛత..!

అనంతగిరి కొండల నుంచి గండిపేట సమీపం వరకు మాత్రమే మూసీ నది నీరు స్వచ్ఛంగా ఉంటోంది. ఆ తర్వాత పూర్తిస్థాయిలో కలుషిత జలాలు ప్రవహిస్తున్నాయి. గండిపేట నుంచి టిప్పుఖాన్ బ్రిడ్జి వరకు నాలుగు కిలోమీటర్ల మేర మూసీ నది ఉండగా.. రెండు కిలోమీటర్ల మేర ఆర్మీ ఆర్టిలరీ సెంటర్ మీదుగా ప్రవహిస్తోంది. మిగతా రెండు కిలోమీటర్లలో.. నార్సింగ్, గండిపేట, మంచిరేవుల, పీరంచెరువు గ్రామ పంచాయతీల పరిధుల్లో.. బఫర్ జోన్లు ఆక్రమణలకు గురయ్యాయి. యథేచ్ఛగా నిర్మాణాలు వెలుస్తున్నా.. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్కనే ఉన్న ఐటీ కారిడార్ బహుళ అంతస్తుల డ్రైనేజీ మొత్తం మూసీలోనే కలుస్తోంది. అంటే.. కోకాపేట, నార్సింగ్, పుప్పాల్‌గూడ, మణికొండ, రాయదుర్గంతోపాటు.. మాదాపూర్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల మురుగుకు మూసీ అడ్డా అవుతోందన్న మాట.



మూసీ ఒడ్డున ఉన్న భవనాలు

టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి లేఅవుట్లు

టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి అత్తాపూర్ వంతెన వరకు మూసీని రెండు వైపులా మట్టితో నింపేసిన భూబకాసురులు.. యథేచ్ఛగా కబ్జాచేసి, లేఅవుట్లు వేశారు. ఆరు కిలోమీటర్ల మేర ఈ కబ్జాలు, అక్రమ నిర్మాణాలు కనిపిస్తున్నాయి. లంగర్‌హౌస్ బాపూనగర్ బస్తీ వెనక కబ్జా పరిస్థితి తారాస్థాయిలో ఉంది. బాపూఘాట్, డిఫెన్స్ కాలనీ వెనక వైపున్న మూసీ బఫర్ జోన్‌లో ఏకంగా రాజకీయ నాయకులే లేఅవుట్లు వేశారు. అంతేకాదు.. టోలిచౌకి, హకీంపేట్ ప్రాంతాల్లోని దాదాపు 100 కాలనీల మురుగునీరు బాపూఘాట్ వద్ద మూసీలో కలుస్తోంది. టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి అత్తాపూర్ వరకు మూసీ తీరమంతా చెత్త డంపింగ్ యార్డుగా మారిపోయింది.

పురానపూల్ వద్ద హిందూ శ్మశానవాటిక, ఒక దర్గా ఉంది. ఈ రెండూ మూసీ నదిలోనే కొనసాగుతున్నాయి. రోజురోజుకూ ఈ రెండూ విస్తరిస్తూ.. మూసీని కుంచించుకుపోయేలా చేస్తున్నాయి. దూద్ బౌలిలోని రమ్నాస్‌పురలో ఉన్న పశువధశాల నుంచి

విస్తరిస్తున్న శ్మశానవాటిక, దర్గా

కూడా మూసీలోకి వ్యర్థాలను వదులుతున్నారు. చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జి కింద 18 ద్వారాలుండగా.. అటూఇటూ కలిపి.. 10 ద్వారాలు మూసుకుపోయేలా మట్టితో పూడ్చేశారు. దీంతో కేవలం 8 ద్వారాలే కనిపిస్తున్నాయి. చాదర్‌ఘాట్ పరిసరాల్లో మూసీ చాలా వరకు కబ్జాకు గురైంది. అంబర్‌పేట్ వరకు కబ్జాదారులు మూసీలో అరటి, కొబ్బరిచెట్లను పెంచుతూ.. వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారు.

షాక్ కొడుతున్న మూసీనది

వాహెద్‌నగర్‌లో మూసీని మట్టితో పూడ్చడంతో పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్తు తీగలతో 'ఎర్త్' వస్తుంది. దీంతో.. ఇక్కడ ఆడుకోడానికి వచ్చిన చిన్నారులు పలుమార్లు విద్యుదాఘాతానికి గురయ్యారు. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు కూడా ఇక్కడ కనిపిస్తాయి. ముసారాంబాగ్ బ్రిడ్జి కింద మట్టి, కోళ్ల వ్యర్థాలతో మూసీని కప్పేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో మూసీని ఆక్రమించి దుకాణాలను నిర్మిస్తున్నారు. ఇక కొత్తపేట డివిజన్‌లోని జనప్రియ అవెన్యూ, సత్యానగర్ కాలనీల వద్ద పచ్చటి తడ్డి పొలాలు ఉన్నాయి. మూసీలో ఎగువ ప్రాంతాల మురుగు మూసీలోకి ప్రవహిస్తోంది. పరిసర కాలనీల మురుగను పైప్‌లైన్ల ద్వారా మూసీలో కలుపుతున్నారు.

రామంతాపూర్ భగాయత్‌లో..

రామంతాపూర్, ఉప్పల్ భగాయత్ గడ్డి భూములలో మాజీ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పేరిట బస్తీలు వెలిశాయి. ఇవన్నీ మూసీ బఫర్‌జోన్‌లో ఏర్పాటైనవే కావడం గమనార్హం..! సందేట్లో సడేమియా అన్నట్లు కొందరు నేతలు ఇక్కడ లేఅవుట్లు వేసి, ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారు. ఇక్కడ ప్లాట్లు కొన్నవారికి రంచన్‌గా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ.. ఇతర విభాగాల అనుమతులు లభిస్తున్నాయి. ఇక్కడ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా.. అధికారులు, విజిలెన్స్ విభాగం వీటి జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగోల్ ప్రాంతంలోనూ మూసీని కబ్జా చేస్తూ లేఅవుట్లు, వెంచర్లు వెలుస్తున్నాయి. దీనిపై నీటిపారుదల శాఖ, హెచ్ఎండీఏ అధికారులకు చేస్తున్న ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూసీ బఫర్‌జోన్‌లో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు కొనసాగుతున్నాయి.

అంబర్‌పేటలో మట్టితో కప్పేస్తున్నారు

అంబర్‌పేట డివిజన్‌లో దుర్గానగర్, న్యూదుర్గానగర్, అహ్మద్‌నగర్, నరేంద్రనగర్, తదితర ప్రాంతాలు మూసీని ఆనుకుని ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మూసీనది క్రమంగా కబ్జాలతో కుంచించుకుపోతోంది. కొందరు ప్లాట్లు చేసి, విక్రయించగా.. ఇంకొందరు గడ్డిని పెంచుతున్నారు. దీంతో దోమల వృద్ధికి ఈ ప్రాంతాలు దోహదపడుతున్నాయి. ఫలితంగా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తిచెందుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు.. వ్యర్థాలను యథేచ్ఛగా మూసీలో వేస్తున్నారు.

కార్వాన్‌లో మండపాల నిర్మాణం

కార్వాన్ గిర్కపల్లి, రాంసింగ్‌పుర, మొఘల్-కా-నాలా, అంద్రూనీ/బైరూనీ కార్వాన్ ప్రాంతాల్లో మూసీ పరివాహక ప్రాంతాన్ని కొంతమంది కబ్జాదారులు ఆక్రమించారు. రాంసింగ్‌పుర ప్రాంతంలో పరీవాహక ప్రాంతంలో మండపాలను నిర్మించారు. ఈ ప్రాంతంలో మూసీ నది వెడల్పు పూర్తిగా తగ్గిపోయి.. చిన్న కాలువలా కనిపించడం గమనార్హం..! పక్కనే ఉన్న జియాగూడలో సుమారు 15 గోదాములు మూసీ బఫర్‌జోన్‌లో కొనసాగుతున్నాయి. పహిల్వాన్లు, రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఈ గోదాములకు నెలవారీ అద్దెను వసూలు చేస్తున్నారు. నెలరోజుల క్రితం అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి.. రెండ్రోజుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించినా.. ఇప్పటికీ ఆ దిశలో చర్యలు తీసుకోకపోవడం గమనార్హం..! మొఘల్-కా-నాలా, కేసరి హనుమాన్, గిర్కపల్లి ప్రాంతాల్లో మూసీ బఫర్ జోన్‌లో దుకాణాలు కొనసాగుతున్నాయి. ఇక జియాగూడలోని కబేలాలో మేకలు, గొర్రెల వ్యర్థాలను పైప్‌లైన్ల ద్వారా మూసీలోకి వదిలేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాలు దుర్గంధంగా తయారవుతున్నాయి. గౌలిగూడలోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీ సమీపంలోని మూసీ ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి అనధికారికంగా నర్సరీని కొనసాగిస్తున్నాడు.



ఆపరేషన్ మూసీ!

12 వేల కుటుంబాల తరలింపు.. సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం

» నిరాశ్రయులకు పక్కా ఇళ్లు
» తరలింపు వేళ ప్రత్యేక ఆర్థిక సాయం
» పట్టా భూములున్న వారికి పరిహారం
» టీడీఆర్ బాండ్లు, ఉపాధి అవకాశాలు
» ఇప్పటికే పూర్తైన ఇంటింటి సర్వే
» ఎన్నికల నాటికి ప్రాజెక్టు పూర్తి!



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): మూసీనదికి పూర్వ వైభవాన్ని కల్పించాలని కంకణబద్ధమైన రేవంత్ సర్కారు.. పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 'ఆపరేషన్ మూసీ'కి సన్నాహాలు చేస్తోంది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో బఫర్ జోన్లలో నివసిస్తున్న 12 వేల కుటుంబాలను తరలించాలని నిర్ణయించింది. అంతర్గతంగా చేసిన కసరత్తు ఇప్పటికే ఓ కొలిక్కి రాగా.. కార్యాచరణకు అవసరమయ్యే నిధులను రుణంగా తీసుకోవాలని భావిస్తోంది.

పూర్తయిన సర్వే..

అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీనది గండిపేట వరకు స్వచ్ఛంగానే ఉంటోంది. అక్కడి నుంచి ఘట్‌కేసర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర ఆక్రమణలతో కుంచించుకుపోయింది. మురుగునీటితో కలుషితమవుతోంది. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా.. మూసీ సుందరీకరణకు సిద్ధమైన రేవంత్ ముందు వేల కుటుంబాలను తరలించడం ఒక పెద్ద సవాలుగా ఉంది. సర్వే దాదాపు పూర్తయినా.. కార్యాచరణకు నిధులు సమకూరితే.. చకచకా పనులు సాగిపోయేలా పక్కా ప్రణాళికను సిద్ధమైంది. మూసీ సుందరీకరణకు బఫర్ జోన్‌లో ఆక్రమణలను తొలగించడంతో పాటు.. కొంత భూసేకరణ అవసరం. ఈ నేపథ్యంలో అధికారులు బఫర్‌జోన్‌ను ఆక్రమించుకుని, నివసిస్తున్న కుటుంబాలెన్ని? నదిని ఆక్రమించిన కుటుంబాలెన్ని? సుందరీకరణకు అదనంగా ఎంత మేర భూసేకరణ అవసరం? అనే అంశాలపై సర్వే పూర్తి చేశారు.

తరలింపే అతి పెద్ద సవాలు

అధికారుల సర్వేలో.. మూసీ సుందరీకరణకు రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ మొదలు.. మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్‌కేసర్ వరకు సుమారు 12 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఈ ప్రక్రియ పూర్తయితేగానీ, అడుగు ముందుకు పడని పరిస్థితి..! ఈ నేపథ్యంలో ఎదురయ్యే సమస్యలేంటి? తెరపైకి వచ్చే డిమాండ్లు ఏమిటి? ఎలా సంసిద్ధమవ్వాలి? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించారు. ఎలాంటి వ్యతిరేకత ఎదురవ్వకుండా.. ఓ ప్యాకేజీని సిద్ధం చేశారని సమాచారం. తరలించాల్సిన కుటుంబాల సామాజిక-ఆర్థిక పరిస్థితులను గుర్తించి, దారిద్ర్యరేఖకు దిగువన, ఎగువన ఉన్న కుటుంబాల చిట్టాను సిద్ధం చేశారని తెలిసింది.

సంతృప్తికరమైన ప్యాకేజీతో..

సర్వేలో గుర్తించిన 12 వేల కుటుంబాలు.. ఇళ్లను, వాణిజ్య సముదాయాలను నిర్మించుకున్న భూములు వేర్వేరు కేటగిరీల్లో ఉన్నాయి. పట్టా భూములతో పాటు.. ప్రభుత్వ, దేవాదాయ, పట్టణ భూపరిమితి చట్టం, వక్ఫ్, అసైన్డ్, ఇనాం, మూసీ బఫర్‌జోన్ భూములు ఉన్నట్లుగా నిర్ధారించారు. సర్వేలో భాగంగా వాణిజ్య సముదాయాల్లో వ్యాపారులపైనా దృష్టి సారించారని తెలిసింది. వారి వ్యాపార పరిధి ఎంత వరకు ఉంది? టర్నోవర్ ఎంత? అనే వివరాలను సేకరించారు. భూములు, వాణిజ్య సముదాయాల వారీగా తరలింపుపై సంతృప్తికరమైన ప్యాకేజీలతో ముందుకెళ్లాలని సర్కారు నిర్ణయించింది. తరలింపు సమయంలో ఎదురయ్యే సవాళ్లు, కోర్టు కేసుల విషయంలోనూ ఎలా ముందుకు సాగాలి? అన్నదానిపై అధికారులు పక్కా ప్రణాళికతో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఇళ్లను పోగొట్టుకునే వారికి.. వారు ఉంటున్న ప్రాంతాల సమీపంలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొందరికి టీడీఆర్ బాండ్లను ఇవ్వాలని నిర్ణయించింది. వాణిజ్య సముదాయాల యజమానుల విషయంలోనూ ప్రత్యేక ప్యాకేజీతో ముందుకు వెళ్లనున్న ట్లు తెలుస్తోంది. సంతృప్తికరమైన ప్యాకేజీతో 12 వేల కుటుంబాలు స్వచ్ఛందంగా తరలివెళ్లేలా చర్యలు తీసుకుంటోంది. ఇక ఈ ప్యాకేజీలకు, మూసీ సుందరీకరణకు కావాల్సిన నిధులను రుణాల రూపంలో స మకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. వచ్చే అసెంబ్లీ ఎన్నికలనాటికి ఈ ఆపరేషన్ ను పూర్తిచేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిసింది.

అన్నారం బ్యారేజీలో
అధ్యయనం పూర్తి

మహదేవపూర్, ఆగస్టు 27: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీలో నీటి ప్రవాహంపై శాస్త్రవేత్తల మొదటి దశ అధ్యయనం మంగళవారం పూర్తయింది. ఎన్డీఎస్ఏ సూచించిన సిఫార్సుల మేరకు సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో బ్యారేజీలో పరీక్షలను ఇప్పటికే నిర్వహించగా మరికొన్ని చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో పుణెకు చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలు బ్యారేజీ వద్ద ఆదివారం నుంచి ఏడీసీపీ ఆధునిక పద్ధతిలో పరికరాలను ఉపయోగిస్తూ నాటు పడవల్లో ప్రయాణిస్తూ పరిశీలన చేశారు. మొదటి దఫా అధ్యయనం మంగళవారం పూర్తి కాగా నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. మరోమారు అధ్యయనం చేయనున్నారు.

కాళేశ్వరం విచారణ
కమిషన్ గడువు మళ్లీ పెంపు!

హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును మరికొంత కాలం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత కమిషన్ వేసినప్పుడు మూడునెలల్లో విచారణ పూర్తిచేసి, జూన్ 30వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే జూన్ 30వ తేదీలోగా విచారణ ఏ కీలక దశకు చేరుకోలేదు. దాంతో రెండునెలల పాటు కమిషన్ గడువును పొడిగించింది. రెండో దఫా ఇచ్చిన గడువు ఈనెల 31వ తేదీతో ముగియనుంది. విచారణ ప్రక్రియ ఇప్పుడే కీలక దశల్లో ఉందని గుర్తించిన నీటిపారుదలశాఖ, కమిషన్ గడువును పెంచే ఫైలును ప్రభుత్వానికి పంపింది. ప్రస్తుతం క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ప్రారంభ దశలోనే ఉంది. నిర్మాణంలో పాల్గొన్న ఇంజనీర్లు, విధాన నిర్ణయాల్లో భాగస్వాములైన ఐఏఎస్‌లు మిగిలే ఉన్నారు. ఇక మంగళవారంతో ఇప్పటిదాకా నిర్దేశించుకున్న క్రాస్ ఎగ్జామినేషన్ షెడ్యూల్ ముగిసింది. బుధవారం సాయంత్రం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్నారు. కోల్‌కతాకు వెళుతూ కీలక ఐఏఎస్‌లకు చెందిన అఫిడవిట్లు అన్నీ వెంట తీసుకెళ్లి.. అధ్యయనం అనంతరం... ఎవరెవరికీ ఏయే ప్రశ్నలు అడగాలనే దానిపై ఆయన నిర్ణయం తీసుకోనున్నారు. ఈ దఫా సెప్టెంబరు తొలివారంలోనే హైదరాబాద్‌కు తిరిగి వచ్చి... క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునః ప్రారంభించే అవకాశాలున్నాయి. దాంతో విచారణకు మరికొంతకాలం గడువు అవసరమని గుర్తించిన ప్రభుత్వం... రెండు నెలలు లేదా... తదుపరి విచారణ పూర్తయ్యేదాకా గడువు ఇస్తూ ఉత్తర్వులు వెలువరించే అవకాశాలున్నాయి.

రుణమాఫీ ప్రక్రియ మధ్యలో ఉంది



» వారం పదిరోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి
» రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలను గుర్తిస్తాం
» మరో 18వేల కోట్లు ఖాతాల్లో జమ చేస్తాం
» రైతు సంఘాల ధర్నాలో మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఖమ్మం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు రుణమాఫీ ప్రక్రియ మధ్యలో ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వా రం పదిరోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి చేసి, రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలను గుర్తిస్తామని, యాప్ ద్వారా వారికి రుణమాఫీ వర్తింపజేస్తామని చెప్పారు. మిగిలిన రూ.18 వేల కోట్ల రుణమాఫీ సొమ్ము తప్పకుండా రైతు ఖాతాల్లో జమచేసి తీరుతామని, ఎవరూ ఆందోళన చెం దాల్సిన అవసరం లేదన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద సీపీఎం, సీపీఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా వద్దకు చేరుకున్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఐదేళ్లగా 42 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.2 లక్షల లోపు మొత్తం రూ.31వేల కోట్ల రుణబాకీ ఉందని తెలిపారు. ఆయా బ్యాంకులు ఇచ్చిన జాబితాల ప్రకారంగానే దశలవారీగా రైతు రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ రాష్ట్రంలో రూ.2లక్షలలోపు రుణాలున్న 22 లక్షలమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మాఫీ నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.18వేల కోట్లు జమ చేయాల్సి ఉందన్నారు. ఇంటింటి సర్వే ద్వారా రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలను నిర్ధారణ చేసి యాప్ ద్వారా పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. రూ.2 లక్షలపైన బకాయి ఉన్నవారు సుమారు 12వేల మంది రైతులున్నారని, త్వరలో మంత్రివర్గ భేటీలో వీరిందరి విషయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

బ్యాంకు డేటాలో తప్పులుంటే సరిచేయాలి

రైతులు రుణమాఫీ పథకానికి అర్హులై బ్యాంకుల నుంచి వచ్చిన డేటాలో తప్పులుంటే సరిచేయాలని మంత్రి తుమ్మ ల అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులు నిర్ధారణ కాని రైతులకోసం ప్రత్యేక యాప్ రూపొందించామని తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో ట్రయల్ రన్ చేసినట్లు తెలిపారు. నేటినుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో మండల వ్యవసాయశాఖ అధికారులు(ఏవో)లు ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలు అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. మంగళవారం రైతువేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లలో ఉన్న ఏఈవోలు, ఏవోలతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఆగస్టు 15 నాటికి 22,37,848 లక్షల మంది రైతులకు 2 లక్షల లోపు ఉన్న పంట రుణమాఫీ చేశామని తెలిపారు. రేషన్ కార్డులు లేకుండా కుటుంబ నిర్ధారణ కాని రైతుల వివరాలు సేకరించి పోర్టల్‌లో నమోదు చేయటం జరుగుతుందన్నారు. తప్పుగా నమోదైన 1,24,604 ఆధార్ వివరాలను బ్యాంకులకు సరిచేయడానికి ఇచ్చామని, ఇప్పటివరకు 41,339 ఆధార్ వివరాలను సరిచేసినట్లు తెలిపారు.

మాకూ టైం వస్తది.. వడ్డీతో సహా చెల్లిస్తాం!



నేను కేసీఆర్ బిడ్డను..

తప్పు చేసే ప్రసక్తే లేదు: ఎమ్మెల్సీ కవిత

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంతో ఆమె తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం భావోద్వేగానికి గురైన కవిత.. 'మాకూ టైం వస్తది. మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన వారికి వడ్డీతో సహా చెల్లిస్తాం' అని హెచ్చరించారు. కవిత బెయిల్ వచ్చిన నేపథ్యంలో కవిత భర్త అనిల్, కుమారుడు ఆర్య, సోదరుడు కేటీఆర్ తోపాటు హరీశ్‌రావు తదితరులు జైలు వద్దకు చేరుకున్నారు. వైద్య పరీక్షలతోపాటు జైలు నిబంధనలన్నీ పూర్తయిన తర్వాత రాత్రి 9.10 గంటలకు జైలు నుంచి కవిత బయటికొచ్చారు. సోదరుడు కేటీఆర్‌ను ఆమె ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. కేటీఆర్ తన చెల్లి నుదుటిపై ముద్దు పెట్టారు. అనంతరం ఆమె తన భర్త అనిల్, కుమారుడు ఆర్యను కౌగిలించుకున్నారు. ఆ తర్వాత పార్టీ నేతలందరికీ అభివాదం చేశారు. జై తెలంగాణ, జైజై తెలంగాణ.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యుల గురించి ప్రస్తావిస్తున్న క్రమంలో ఆమె కన్నీరు పెట్టుకున్నారు. "అందరికీ నమస్కారం. ఐదున్నర నెలల తర్వాత అందరినీ కలవడం సంతోషం. 18 ఏళ్ల రాజకీయాల్లో ఉన్నా. ఎన్నో ఎత్తు పల్లాలు చూశా. కానీ, వ్యక్తిగతంగా నా కుటుంబాన్ని, పిల్లలను వదిలి ఐదున్నర నెలలు ఉండడం ఇదే తొలిసారి. ఇలాంటి ఇబ్బందులు పెట్టిన వారందరికీ తప్పకుండా వడ్డీతో కలిపి చెల్లిస్తాం. మాకూ టైం వస్తది. కష్టకాలంలో మా కుటుంబానికి అండగా ఉన్న అందరికీ పాదాభివందనాలు. నేను తెలంగాణ బిడ్డను. కేసీఆర్ బిడ్డను. తప్పుచేసే ప్రసక్తే లేదు. నేను మొండిదాన్ని. చట్టబద్ధంగా నా పోరాటం కొనసాగిస్తా." అని కవిత చెప్పారు. కవిత జైలు నుంచి నేరుగా వసంత్ విహార్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మహిళా కార్యకర్తలు ఆమెకు దిష్టి తీసి స్వాగతం పలికారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కవిత కుటుంబ సభ్యులతో కలిసి రాత్రికి బీఆర్ఎస్ కార్యాలయంలోనే బస చేయనున్నట్లు ముఖ్య నేత ఒకరు తెలిపారు. బుధవారం రౌస్ అవెన్యూ కోర్టులో కవితతోపాటు మరో నలుగురిపై సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌పై విచారణ జరగనుంది. దానికి ఆమె వర్చువల్‌గా హాజరవుతారు. మధ్యాహ్నం కవిత, కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు హైదరాబాద్‌కు బయల్దేరతారు.

అనిల్, వద్దిరాజు పూచీకత్తు..

కవితకు సుప్రీంకోర్టు సీబీఐ కేసులో రూ.10 లక్షలు, ఈడీ కేసులో రూ.10 లక్షల చొప్పున పూచీకత్తుతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ మొత్తాలను కవిత భర్త అనిల్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చెల్లించారు. రౌస్ అవెన్యూ కోర్టులో పూచీకత్తు సొమ్మును జమ చేశారు. అనంతరం కోర్టు 4.20 గంటలకు కవిత రిలీజ్ వారెంట్ జారీచేసింది. ఆ కాపీని అనిల్, వద్దిరాజులు తిహాడ్ జైలు సిబ్బందికి అందజేశారు.

న్యాయం గెలిచింది

- సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు: కేటీఆర్
- బండి సంజయ్ పోస్ట్‌పై అభ్యంతరం



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై ఆమె సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఊరట లభించింది, న్యాయం గెలిచింది అని సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అదే సమయంలో కవిత బెయిల్ అంశంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన పోస్ట్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బండి వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి ఇంత చవకబారుగా మాట్లాడతారా ? అంటూ దుయ్యబట్టారు. దురుద్దేశంతో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణగా పరిగణించి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేశారు.


కాంగ్రెస్ న్యాయవాదులకు కంగ్రాట్స్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ సమష్టి కృషితోనే కవితకు బెయిల్
- కేసీఆర్ రాజకీయ చతురతకు హాట్సాఫ్: బండి సంజయ్



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల సమష్టి కృషి వల్లే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ మద్యం కేసులో బెయిల్ వచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. కవితకు బెయిల్ ఇప్పించడంలో విజయం సాధించినందుకు కంగ్రాట్స్ అంటూ కాంగ్రెస్, ఆ పార్టీ న్యాయవాదులను ఎద్దేవా చేశారు. మీ అవిశ్రాంత కృషి చివరికి ఫలించిందని విమర్శిస్తూ ఎక్స్‌లో మంగళవారం ఆయన ఓ పోస్ట్ పెట్టారు. బీఆర్ఎస్ నేత బెయిల్‌పై బయటకు వచ్చారని, కాంగ్రెస్ నేత రాజ్యసభలోకి వెళుతున్నారని, కేసీఆర్ అద్భుతమైన రాజకీయ చతురతకు హాట్సాఫ్ అని పేర్కొన్నారు. బెయిల్ కోసం వాదించిన వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వగా, కాంగ్రెస్ పార్టీ ఆ వ్యక్తిని రాజ్యసభకు నామినేట్ చేసిందని అన్నారు. ఈ క్విడ్ ప్రో కో వ్యవహారంలో భాగస్వాములు అభినందనలు తెలిపారు. విలీనం మాటా, ముచ్చట పూర్తయ్యాయని, ఇక అప్పగింతలే మిగిలాయని ఎద్దేవా చేశారు. కాగా, బండి సంజయ్ చేసిన ఈ పోస్ట్‌ను బీఆర్ఎస్ నేత కేటీఆర్, మాజీ ఎంపీ బొయినపల్లి వినోద్‌కుమార్ తీవ్రంగా తప్పుబట్టారు. అయితే, బీజేపీ నేతలు వారికి కౌంటరిచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ చదువుకున్న మూర్ఖుడంటూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజయ్ చేసిన పోస్ట్‌లో తప్పేముంది, కవితకు బెయిల్ ఇవ్వాలని వాదించిన వ్యక్తికి కాంగ్రెస్ రాజ్యసభ టిక్కెట్ ఇవ్వడం నిజం కాదా ? అని ప్రశ్నించారు. అలాగే, కేటీఆర్ చదువుకున్న అజ్ఞాని అని, వినోద్ కుమార్ స్వయం ప్రకటిత మేధావి అని బీజేపీ నేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ దుయ్యబట్టారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే బెయిల్: పొన్నం



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కవడం వల్లనే కవితకు బెయిల్ సాధ్యపడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు అధికారంలో ఉన్న గత పదేళ్లు చెట్టాపట్టాలేసుకొని ఉన్నాయన్నారు. అందుకే తాము ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అంటూ వాళ్ల నాటకాల్ని ఎండగట్టామన్నారు. కేంద్రంలోని ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ సహకరించిన విషయాన్ని పొన్నం గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు కావడం వల్లనే ఆమెకు బెయిల్ లభించిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు కవితకు బెయిల్‌తో బయటపడ్డాయని, ఇక బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఒక్కటే మిగిలిందన్నారు. ఎమ్మెల్యేలతో పాటుగా కేటీఆర్ ఢిల్లీకి వెళ్లిందే బీజేపీతో డీల్ సెట్ చేసుకుని కవితకు బెయిల్ ఇప్పించడానికని ఆరోపించారు. లిక్కర్ కేసులో కవితకు బెయిల్‌తో బీఆర్ఎస్, బీజేపీ బంధం బయటపడిందని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కేటీఆర్‌కు తన చెల్లి ఏ నేరంపైన జైలుకు వెళ్లిందో చెప్పుకునే ధైర్యం కేటీఆర్‌కు ఉందా అంటూ టీపీసీసీ అధికార ప్రతినిధి బండ్రు శోభారాణి అన్నారు.

కవితకు బెయిల్

(మొదటి పేజీ తరువాయి)



జైలు నుంచి బయటకు వచ్చాక భావోద్వేగంతో కేటీఆర్ చేయిపై ముద్దు పెడుతున్న కవిత

చట్టంలోని సెక్షన్ 45(1) కింద మహిళలకు బెయిల్ మంజూరు చేసే నిబంధనను.. కవిత రాజకీయ నాయకురాలు అయినందున వర్తింపజేయలేమన్న ఢిల్లీ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఏ స్థానంలో ఉన్నా మహిళ.. మహిళేనని పేర్కొంది. ఈ మేరకు, బెయిల్ ఇవ్వటానికి నిరాకరిస్తూ హైకోర్టు జూలై 1వ తేదీన ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్లను ఆమోదిస్తూ బెయిల్ మంజూరు చేసింది. రెండు కేసుల్లోనూ రూ.10 లక్షల చొప్పున పూచీకత్తులు సమర్పించాలని, పాస్‌పోర్టును విచారణ కోర్టు న్యాయమూర్తి వద్ద డిపాజిట్ చేయాలని, సాక్షులను ప్రభావితం చేయడం కానీ బెదిరించడం కానీ చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు విచారణలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని పేర్కొంది. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో, స్థానిక ఢిల్లీ కోర్టు జైలు నుంచి కవిత విడుదలకు అనుమతిస్తూ రిలీజ్ వారెంట్లను జారీ చేసింది. దీంతో తిహాడ్ జైలు నుంచి కవిత విడుదలయ్యారు.

కవితపై దర్యాప్తు పూర్తయ్యింది!

జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కవితకు బెయిల్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ అందుకుగల కారణాలను వివరించింది. ఢిల్లీ మద్యం కేసులో కవితకు సంబంధించి ఈడీ, సీబీఐ దర్యాప్తు ఇప్పటికే పూర్తి చేశాయని గుర్తు చేసింది. కాబట్టి, ఆమె ఇంకా కస్టడీలో (జైలులో) ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కేసుపై ఢిల్లీ స్థానిక కోర్టులో జరుగుతున్న విచారణను ప్రస్తావిస్తూ.. కేసులో మొత్తం 493 మంది సాక్షులున్నారని, 50 వేల పేజీల పత్రాల ఆధారాలు ఉన్నాయని.. అంతమంది సాక్షులను విచారించి, ఆయా ఆధారాలను కింది కోర్టు పరిశీలించి విచారణను పూర్తి చేయటం సమీప భవిష్యత్తులో సాధ్యమయ్యే విషయం కాదని తేల్చి చెప్పింది. కాబట్టే, కవితకు బెయిల్ మంజూరు చేస్తున్నామని తెలిపింది.

మీ దర్యాప్తు నిజాయితీగా లేదు!

విచారణ సందర్భంగా సీబీఐ, ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. కేసులో కొందరు అప్రూవర్లు కవితకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చారని పేర్కొన్నారు. ఒక అప్రూవర్ చెప్పిన అంశాలను చదివి వినిపించారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'మీరు నిజాయితీగా ఉండాలి. కేసులో నిందితుడైన వ్యక్తినే సాక్షిగా మారుస్తున్నారు. రేపు ఎవరినైనా మీ ఇష్ట ప్రకారం ఎంచుకుని అప్రూవర్‌గా తీసుకోవచ్చు. ఇతరులను నిందితులుగా పేర్కొనవచ్చు. ఇదేం పద్ధతి? ఈ విధంగా మీరు వ్యవహరించలేరు. మీరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని చాలా స్పష్టంగా, సహేతుకంగా తెలుస్తోంది. ఇలాంటిది చూడాల్సి వచ్చినందుకు చింతించాల్సి వస్తోంది' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ రాజు జోక్యం చేసుకోబోయారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'మీరు ఇంకా వివరాల్లోకి వెళ్తామంటే.. మేం కూడా అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటాం. దర్యాప్తు సంస్థల నిజాయితీ, నిష్పాక్షికతలను పరిశీలించాల్సి ఉంటుంది. మీరు వినాలనుకుంటే మరింత సేపు వాదించండి' అని స్పష్టం చేశారు. దీంతో కవితకు బెయిల్ ఇవ్వొద్దని దాదాపు గంటపాటు వాదించిన ఎస్వీ రాజు మిన్నకుండిపోయారు. అంతకు ముందు, కవితను ప్రశ్నించటానికి సమన్లు జారీ చేసినప్పుడే ఆమె తన సెల్‌ఫోన్‌లో కాల్ రికార్డులను, ఫేస్ టైమ్ డాటాను తొలగించి ఫార్మాట్ చేశారని ఎస్వీ రాజు తెలిపారు. దీనిపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ.. ఫోన్ అనేది ప్రైవేటు ఉపకరణమని, ఎవరైనా ఫోన్‌లోని వివరాలు ఇతర్లతో పంచుకుంటారా అని ప్రశ్నించారు. ఫోన్‌లోని మెసేజీలను తొలగించడం మామూలేనని, తనకు కూడా ఆ అలవాటు ఉందన్నారు. స్కూలు, కాలేజీ గ్రూపులు ఎన్నో మెసేజీలను పోస్టు చేస్తుంటాయి.. వాటిని తొలగించటం సాధారణ విషయమన్నారు. అయితే మొత్తం డాటాను తొలగించటం సాక్ష్యాలను ధ్వంసం చేయడమేనని, కవిత చాలా సున్నితమైన డాటాను డిలీట్ చేశారని, దీనిని సాధారణ ఫార్మాటింగ్‌గా భావించరాదని రాజు అన్నారు. దీనికి జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'మీరు నేరం రుజువు చేయకముందే నేరం చేశారని భావిస్తున్నారు. ఆమె నేరం చేసినట్లు మీ వద్ద సాక్ష్యాలేమున్నాయి' అని ప్రశ్నించారు.

అందరూ సమానమంటారు కదా?

విచారణ సందర్భంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) సెక్షన్ 45(1)పై ధర్మాసనం ప్రత్యేకంగా దృష్టి సారించింది. మహిళలకు బెయిల్ ఇచ్చే అంశంలో చట్టం కొన్ని మినహాయింపులు ఇచ్చిందని.. పీఎంఎల్‌ఏ సెక్షన్ 45(1) కూడా అదే విషయాన్ని ప్రస్తావిస్తోందని తెలిపింది. ఈ సెక్షన్ ప్రకారం.. నిందితుడు నేరానికి పాల్పడలేదని, బెయిల్ మీద విడుదలైతే ఎటువంటి నేరానికి పాల్పడే అవకాశం లేదని న్యాయమూర్తి భావించినప్పుడు బెయిల్ ఇవ్వవచ్చు. అయితే, మహిళలతోపాటు కొన్ని వర్గాల నిందితులకు ఈ రెండు షరతులను కూడా పక్కనపెట్టి బెయిల్ ఇచ్చే అవకాశం సెక్షన్ 45(1) కల్పిస్తోంది. దీనికి అనుగుణంగా తనకు బెయిల్ ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టును కవిత తరఫు న్యాయవాదులు కోరినప్పుడు.. 'కవిత ఉన్నత విద్యావంతురాలు. రాజకీయాల్లో, సామాజికసేవలో తనదైన ముద్ర వేశారు. కాబట్టి, ఆమెను అణచివేతకు గురైన ఓ సాధారణ మహిళగా చూడలేం' అంటూ హైకోర్టు బెయిల్‌ను నిరాకరించింది. దీనిపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్రంగా స్పందించింది. అందరినీ సమానంగా చూడాలని, సీఎం అయినా ఎంపీ అయినా ఎటువంటి మినహాయింపు ఇవ్వరాదని దర్యాప్తు సంస్థలు తమ ఎదుట తరచూ వాదిస్తున్న సంగతిని గుర్తు చేసింది. ఇదే కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రచారం చేసేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరితే సీబీఐ, ఈడీలు అందుకు అభ్యంతరం తెలుపుతూ.. సీఎం అయినా, సాధారణ వ్యక్తి అయినా ఒక్కటేనని వాదించాయి. సుప్రీంకోర్టు తాజాగా దీనినే పరోక్షంగా ప్రస్తావించింది. కవితను అందరు మహిళలతో సమానంగా హైకోర్టు చూడలేదని, ఆమెకు సెక్షన్ 45(1) ద్వారా లబ్ధి జరగకుండా అడ్డుకోవటం ద్వారా తీర్పు విషయంలో హైకోర్టు పూర్తిగా తప్పుదోవపట్టిందని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను పూర్తిగా పక్కనపెడుతున్నామని, లేకపోతే ఆ కోర్టు పరిధిలో ఉన్న అన్ని న్యాయస్థానాల్లో విద్యావంతులైన మహిళలకు బెయిల్ లభించటం కష్టమవుతుందని తెలిపింది.

కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఇదే కేసులో సహ నిందితుడైన మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ, విచారణలో ఆలస్యం జరిగినప్పుడు బెయిల్ మంజూరు చేసే విషయం పరిశీలించాలని తీర్పులో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. సీబీఐ, ఈడీ చార్జిషీట్, ప్రాసిక్యూషన్ ఫిర్యాదులను దాఖలు చేశాయని, కవిత ఇప్పటికే ఈడీ కేసులో అయిదు నెలలు, సీబీఐ కేసులో నాలుగు నెలలు జైలులో గడిపారన్నారు. రెండు కేసుల్లో 493 మంది సాక్షులతోపాటు, 50 వేల పేజీలకు పైగా పత్రాలు ఉన్నాయని, సమీప భవిష్యత్తులో కింది కోర్టులో విచారణ ముగిసే అవకాశం

సిసోడియా బెయిల్ అంశం ప్రస్తావన

లేదన్నారు. కవిత మాజీ ఎంపీ, శాసనమండలి సభ్యురాలని.. ఆమె ఎక్కడికీ పారిపోయే అవకాశం లేదని చెప్పారు. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45(1) కవితకు వర్తించదని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రశ్నించారు. కవిత నుంచి ఇప్పటి వరకూ ఈడీ, సీబీఐలు ఎలాంటి డబ్బునూ స్వాధీన పరుచుకోలేదని రోహత్గీ గుర్తు చేశారు. కవిత తన పాత సెల్‌ఫోన్లను తన వద్ద పని చేసే వారికి ఇచ్చారని, ఇచ్చేముందు వాటిని ఫార్మాట్ చేశారని, సాక్ష్యాధారాలను ధ్వంసం చేయటానికే ఇలా చేశారన్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు. కాగా అరుణ్ పిళ్లై వాంగ్మూలాన్ని ఏఎస్‌జీ రాజు ప్రస్తావించినప్పుడు.. స్వతంత్ర సాక్ష్యాలు లేనప్పుడు సహ నిందితుడి ప్రకటనలపైనే పూర్తిగా ఆధారపడవచ్చా అని జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. రాఘవ్ మాగుంట, బుచ్చిబాబు కూడా వాంగ్మూలాలు సమర్పించారని రాజు తెలుపగా.. వీరంతా అప్రూవర్లుగా మారకముందు కవిత పేరు ఎక్కడా చెప్పలేదని రోహత్గీ గుర్తు చేశారు. అప్రూవర్లు చేసిన కళంకిత ప్రకటనలు తప్ప ఎలాంటి సాక్ష్యాలు ఈడీ, సీబీఐల వద్ద లేవన్నారు. మద్యం కుంభకోణంలో కవిత పాత్రను ముందు నుంచి వివరిస్తానని రాజు చెప్పగా రోహత్గీ అడ్డుకున్నారు. కింది కోర్టులో మాదిరిగా ఇక్కడ వాదనలు చేయకూడదని జస్టిస్ విశ్వనాథన్ ఇరువర్గాలకు చెప్పారు. గంటలకు గంటలు మీ వాదనలను వినలేమని ఆయన రాజుకు తెలిపారు. బెయిల్‌పై విస్తృత వాదనలు అక్కర్లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసులో వాస్తవాలున్నాయా లేదా అన్న వాటి జోలికి పోవడం లేదని, అప్రూవర్లుగా మారి, క్షమాభిక్ష పొందిన సాక్షుల ప్రకటనలపైనే ఆధారపడటం సరైంది కాదని తెలిపింది.

కవిత అరెస్టు అక్రమమని సుప్రీం చెప్పింది..

కవితను అరెస్టు చేయడానికి దర్యాప్తు సంస్థల దగ్గర అసలు మెటీరియల్ లేనేలేదు. అరెస్టు అక్రమం అని మేము మొదటి నుంచి చెబుతున్నాం. ఈ రోజు సుప్రీం కోర్టు కూడా అదే చెప్పింది. ఈ కేసులో 500 మంది సాక్షులు ఉన్నారు. అందరినీ విచారించడానికి సుమారు 20 వేల రోజులు పడుతుంది. నేరం రుజువైతే ఏడేళ్ల శిక్ష పడే కేసు ఇది. కవితకు సంబంధించి ఒక్క రూపాయి కూడా ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఎటువంటి సాక్ష్యం లేదు. కడిగిన ముత్యంలా బయటికి వస్తానని అరెస్టు అయినప్పుడు కవిత చెప్పారు. ఇవాళ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చూస్తే అది నిజం కాబోతుంది. ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరుగా రూ.10 లక్షల పూచీకత్తు, పాస్ పోర్టు సరెండర్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పుడు బెయిల్ వచ్చింది. తర్వాత కేసు కూడా వీగిపోతుంది

- మోహిత్ రావు, కవిత తరఫున మొదటి నుంచి ఉన్న న్యాయవాది

బిడ్డా.. ఎట్లున్నవ్?

కుమార్తె కవితకు ఫోన్‌లో కేసీఆర్ పలకరింపు!

జైలు నుంచి బయటికొచ్చి కారెక్కగానే తండ్రికి ఫోన్



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'బిడ్డా... ఎట్లున్నవ్ ? పాణం మంచిగున్నదా?' ఢిల్లీ మద్యం కేసులో బెయిల్‌పై విడుదలైన తన కుమార్తె కవితను మాజీ సీఎం కేసీఆర్ అడిగిన ప్రశ్నలివి. మంగళవారం రాత్రి తిహాడ్ జైలు నుంచి విడుదలై బయటికొచ్చిన కవిత కారులో ఎక్కి కూర్చోగానే తన తండ్రి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలిసింది. నాన్నా.. అని పిలుస్తూ భావోద్వేగానికి గురయ్యారు. కాసేపటి దాకా ఆమె నోటి వెంట మాటలు రాలేదు. తండ్రి గొంతు వినగానే ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా కుమార్తెను ఓదార్చిన కేసీఆర్.. బిడ్డా... ఎట్లున్నవ్? పాణం మంచిగున్నదా? అని అడిగారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. అంతేకాక, బాధపడకు! ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో! అని కేసీఆర్ జాగ్రత్తలు చెప్పినట్లు సమాచారం. కవిత కూడా కేసీఆర్‌ను... మీ ఆరోగ్యం ఎలా ఉంది? బాగున్నారా? అని కుశల ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. కాగా, తిహాడ్ జైలు నుంచి విడుదలైన కవిత మంగళవారం రాత్రి ఢిల్లీలోనే ఉండనున్నారు. భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, ఇతర కుటుంబసభ్యులతో కలిసి బుధవారం మధ్యాహ్నం ఆమె హైదరాబాద్ చేరుకోనున్నారు. హైదరాబాద్ చేరిన వెంటనే నేరుగా ఎర్రవల్లిలో ఉన్న కేసీఆర్ వద్దకు వెళ్లనున్నారు.

జైలు నుంచి బెయిల్ దాకా 166 రోజులు!

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుమారు 166 రోజులు జైలు జీవితం గడిపారు. ఈ ఏడాది మార్చి 15న ఈడీ అరెస్టు చేసినప్పటి నుంచి ఆమె జైలులోనే ఉన్నారు. ఈడీ కేసులో జైలులో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ ఆమెను అరెస్టు చేసింది. తన కుమారుడికి పరీక్షలు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత తొలిసారి రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం నిరాకరించింది. అనంతరం ఈడీ, సీబీఐ కేసుల్లో సాధారణ బెయిల్ ఇవ్వాలని కోరుతూ ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా మళ్లీ నిరాశే ఎదురైంది. ఆపై, ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం హైకోర్టు కూడా బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో కవితతోపాటు మరో నలుగురిపై అభియోగాలు మోపుతూ సీబీఐ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఈ చార్జిషీట్‌లో తప్పులున్నాయని, మద్యం పాలసీతో తనకు సంబంధం లేదని, అక్రమంగా కేసులో ఇరికించారని ఆరోపిస్తూ కవిత మరోసారి ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న ఆమె హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆగస్టు 7న సుప్రీం కోర్టును ఆశ్రయించగా 27న బెయిల్ మంజూరైంది.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ ముందు టపాసులు కాలుస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కోర్టు హాల్‌లో కేటీఆర్ భావోద్వేగం

కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన ప్రకటనతో ఆమె సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, కవిత భర్త అనిల్ కోర్టు హాల్‌లోనే భావోద్వేగానికి గురయ్యారు. తీర్పు చెప్పడం పూర్తయిన వెంటనే న్యాయస్థానం నుంచి బయటికి వచ్చిన కేటీఆర్‌ను బెయిల్‌పై స్పందించాలని మీడియా కోరగా ఆయన మాట్లాడకుండా వెళ్లిపోయారు. కాగా, కవిత భర్త అనిల్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తదితరులు సోమవారమే ఢిల్లీకి చేరుకున్నారు. కవిత బెయిల్ అంశంపై కేటీఆర్, హరీశ్‌రావు సోమవారం సాయంత్రం న్యాయనిపుణులతో చర్చించారు.

ఢిల్లీ లిక్కర్ స్కాం.. పరిణామ క్రమం

- ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా మద్యం కుంభకోణంలో విచారణకు ఆదేశించడంతో 2022 ఆగస్టు 17న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది
- సీబీఐ కేసు ఆధారంగా ఈడీ కూడా ఆగస్టు 22న ఈసీఐఆర్ ఫైల్ చేసింది
- ఈ కేసుకు సంబంధించి 2022 నవంబరు 25న తొలి చార్జిషీట్ దాఖలైంది. ఆ చార్జిషీట్‌లో హైదరాబాద్ సౌత్ గ్రూప్‌తోపాటు ఇతర కీలక విషయాలను ప్రస్తావించారు
- 2022 సెప్టెంబరు నుంచి అరెస్టులు మొదలయ్యాయి. మొదట ఇండో స్పిరిట్ యజమాని సమీర్ మహేంద్రును.. ఆ తర్వాత శరత్ చంద్రారెడ్డి, బినయ్ బాబు, విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, అమిత్ అరోరా అరెస్టయ్యారు.
- 2023 ఫిబ్రవరి 26న ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది
- 2023 జూన్‌లో శరత్ చంద్రారెడ్డి, సెప్టెంబరులో మాగుంట రాఘవరెడ్డి, దినేశ్ అరోరా అప్రూవర్లుగా మారారు
- పలు మార్లు విచారణ అనంతరం ఈడీ అధికారులు 2024 మార్చి 15న కవితను అరెస్టు చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టయ్యారు.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి కవితకు బెయిల్ సంకేతం!

లేదంటే వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీల పొత్తు.. మోదీకి కేసీఆర్ ఇచ్చే రిటన్ గిఫ్ట్ ఇదే

- 17 నెలల దాకా సిసోడియాకు బెయిలే రాలేదు
- లిక్కర్ మాఫియాకు కింగ్ అయిన కవితకు ఐదు నెలల్లో ఎలా వచ్చింది?
- తెలంగాణలో కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్
- కవితకు బెయిల్ వస్తుందని ముందే కేటీఆర్ ఎలా చెబుతారు?
- ఆయనపై కోర్టు చర్యలు తీసుకోవాలి: తూర్పు జగ్గారెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ కేసులో కవితకు బెయిల్.. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనానికి సంకేతమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి అన్నారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలూ పొత్తు పెట్టుకుంటాయని వ్యాఖ్యానించారు. కవిత బెయిల్‌కుగాను ప్రధాని మోదీకి కేసీఆర్ ఇచ్చే రిటన్ గిఫ్ట్ ఇదేనన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో బీఆర్ఎస్ పార్టీ చేసుకున్న ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేని బీజేపీ.. ఇక్కడి అధికార కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్‌ను కలుపుకొని పోయే పనిలో ఉందన్నారు. కవిత బెయిల్ కండిషన్‌లో భాగంగానే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ డమ్మీ పాత్ర పోషించిందని, బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయించిందని ఆరోపించారు. "మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తది అనే పరిస్థితి నుంచి మూడో స్థానానికి ఎందుకు పడిపోయింది? కవిత కోసం సొంత లోక్‌సభ నియోజకవర్గాన్నే కేసీఆర్ వదులుకున్నడు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు తగ్గడానికి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోవడమే కారణం" అన్నారు. బీజేపీ గెలిచిన లోక్‌సభ నియోజకవర్గాల్లో రేపు ఎన్నికలనగా బీఆర్ఎస్ పార్టీకి ఏజెంట్లే లేరని, ఆ పార్టీ ఎమ్మెల్యేలూ పోలింగ్ కేంద్రాల వద్దకు రాలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులూ.. ఓట్లు బీజేపీకి వేయాలని ప్రచారం చేశారని ఆరోపించారు. ఉత్తరాదిన బలహీనపడిన బీజేపీ.. దక్షిణాదికి వచ్చేసరికి ఏపీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో పొత్తు పెట్టుకుని సీట్లు గెలిచిందన్నారు. తెలంగాణలో బెయిల్ కండిషన్ ముందు పెట్టి బీఆర్ఎస్‌ను బలహీన పరచడం ద్వారా సీట్లు గెలుచుకుందన్నారు. బీజేపీకి ఒక పావులాగా బీఆర్ఎస్ పార్టీ పనిచేస్తోందన్నారు. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని బలహీన పరిచేందుకు బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక ఒప్పందానికి వచ్చాయని, ఇందులో భాగంగా తొలుత బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాబోతున్నట్లు ప్రచారం చేసి.. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ఆయన అన్నారు.

కేటీఆర్‌పై కోర్టు చర్యలు తీసుకోవాలి

బెయిల్‌కు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు.. జడ్జి ప్రకటించే దాకా బెయిల్ వస్తుందా.. రాదా? అన్నది తెలిసే అవకాశమే లేదని, కానీ.. కవితకు బెయిల్ వస్తుందంటూ కేటీఆర్‌తో పాటుగా బీఆర్ఎస్ సోషల్ మీడియా గత మూడు రోజులుగా ప్రచారం చేస్తోందన్నారు. బెయిల్ వస్తుందంటూ ముందే చెప్పిన కేటీఆర్‌పైన కోర్టు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తామేమీ జడ్జిని తప్పు పట్టడంలేదని, బెయిల్ వస్తుందంటూ జడ్జి చెప్పకముందే బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుందన్నదే తమ వాదనన్నారు. కవితకు బెయిల్ వస్తుందంటూ మూడు రోజుల ముందే హడావుడి చేసినందుకు కేసీఆర్ కుటుంబంపై న్యాయవ్యవస్థ చర్యలు తీసుకోవాలన్నారు.

ఐదు నెలల్లోనే కవితకు బెయిల్ ఎలా?

లిక్కర్ కేసులో సిసోడియాకు 17 నెలల తర్వాత బెయిల్ వస్తే.. లిక్కర్ మాఫియాకు కింగ్ అయిన కవితకు ఐదు నెలల్లోనే బెయిల్ ఎలా వచ్చిందని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఆమెకు బెయిల్.. బీజేపీతో చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగమేనన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి | దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 28 ఆగస్టు 2024



ఆంధ్ర యూనివర్సిటీలో

డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు సంబంధిత స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

రిమైండర్

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.
- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ) ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజెడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్ఆర్ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ప్రింట్ మెటీరియల్ కోసం చెల్లించాల్సిన ఫీజు:** సెమిస్టర్‌కు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com



ఉస్మానియా వర్సిటీలో

ఓడీఎల్ కోర్సులు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఫస్ట్ ఫేజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. బీఏ, బీబీఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని రెగ్యులర్ ప్రోగ్రామ్‌లతో సమానంగా పరిగణిస్తారు. అభ్యర్థులు రెగ్యులర్ కోర్సుతోపాటు ఒక ఓడీఎల్ ప్రోగ్రామ్ చేసుకోవచ్చు.



ఎంబీఏ, ఎంసీఏ: ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ లేదా డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2024/ఏపీ ఐసెట్ 2024/పీజీఆర్ఆర్‌సీడీఈ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ప్రోగ్రామ్ ఫీజు: ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.20,000; ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.15,000

ఎంఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఉర్దూ, హిందీ, సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఏ(హిందీ/ఉర్దూ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత లాంగ్వేజ్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. లేదా సంబంధిత మాధ్యమంలో పదోతరగతి వరకు చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: సైకాలజీకి రూ.10,000; మిగిలిన స్పెషలైజేషన్‌లకు రూ.8,000

ఎంకాం: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: ఏడాదికి రూ.9,000

ఎమ్మెస్సీ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మేథమెటిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్); స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. వీటికి బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అర్హులే.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: మేథమెటిక్స్‌కు రూ.9,000; స్టాటిస్టిక్స్‌కు రూ.8,000

డిగ్రీ: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్)ప్రోగ్రామ్‌లకు రూ.4,000; బీకాం(జనరల్)కు రూ.5,000, బీబీఏకు రూ.8,000

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు రూ.8,000. బయోఇన్ఫర్మాటిక్స్ స్పెషలైజేషన్‌కు ద్వితీయశ్రేణి మార్కులతో బీఎస్సీ/బీఎస్సీ(అగ్రికల్చర్)/ఎమ్మెస్సీ/బీఫార్మసీ/బీవీఎస్సీ/ఎంబీబీఎస్/ బీడీఎస్/బీఏఎంఎస్/బీయూఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులైనవారు అర్హులు. ప్రోగ్రామ్ ఫీజు రూ.32,000. కంప్యూటర్ అప్లికేషన్స్ స్పెషలైజేషన్‌కు ప్రోగ్రామ్ ఫీజు రూ.18,000. డేటా సైన్స్‌కు రూ.20,000. ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌కు రూ.15,000. వేదిక్ ఆస్ట్రాలజీకి రూ.8,000. ఈ స్పెషలైజేషన్‌లన్నింటికీ ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. వేదిక్ ఆస్ట్రాలజీని తెలుగు మాధ్యమంలో చదవాలి.

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: ఇందులో స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. (డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా)(వేదిక్ ఆస్ట్రాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.10,000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగ: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి/మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.6,000. ఈ కోర్సుని ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 16 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వెబ్‌సైట్:** www.oucde.net



ట్రిపుల్‌ఐటీ డీఎంలో ఫ్యాకల్టీ

జాబ్ కార్నర్

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ ప్రొఫెసర్
2. అసిస్టెంట్ ప్రొఫెసర్
3. అసోసియేట్ ప్రొఫెసర్
4. ప్రొఫెసర్

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సైన్సెస్(మేథ్స్)

అర్హత: పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: టీచింగ్ డెమాన్‌స్ట్రేషన్, రీసెర్చ్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: https://iiitk.ac.in/



Reliance Foundation Postgraduate Scholarships

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility:

- Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences
- Must have secured 550 to 1,000 in the GATE examination

OR

- Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]
- Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RFS10

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the postgraduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

SCHOLARSHIP ALERT

Adani Gyan Jyoti Scholarship 2024-25

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility:

- Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only.
- Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.
- Applicants must have passed their higher secondary/pre-university/ intermediate/ CBSE/ ISC or equivalent board exams after 2023.
- Admission must be based on the merit rank from state or national-level entrance exams.
- Family income must not exceed INR 4,50,000 per annum from all sources.

Prizes & Rewards: Up to INR 3,50,000 (tuition fee) annually.

Last Date to Apply: 07-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AGSP5

buddy4study.com

లిటిల్స్



కోపం వల్ల నష్టం

ముకుందాపురంలో రాజయ్య అనే వడ్రంగి ఉండేవాడు. అతనికి రాము అనే కొడుకు ఉన్నాడు. రాము మంచివాడే కానీ, అతనికి కోపం ఎక్కువ. అయిన దానికి, కాని దానికి తన తండ్రి దగ్గర పనిచేసే నౌకర్ల మీద కోప్పడుతూ ఉండేవాడు తరువాతి రోజుల్లో ఆ వ్యాపారాన్ని దుకాణాన్ని మొత్తం రాముకే అప్పజెప్పాలనే ఆలోచనతో ఉన్న రాజయ్యకు రాము నోటి దురుసు ప్రవర్తన చాలా ఆందోళన కలిగించేది. ఎన్నోసార్లు పనివాడు రాము ఉన్నపుడు పనికి రావడం ఇష్టపడకపోవడం గమనించి, రాముకు నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు రాజయ్య. కానీ రాము వినేవాడు కాదు ముందు కోప్పడినా తరువాత వారితో బాగానే మాట్లాడుతున్నాను కదా అనేది రాము వాదన.


ఇక ఒకరోజు రాజయ్య రామును ఒక చెక్క తలుపు వద్దకు తీసుకువెళ్లి, రామూ ఇలా చూడు ఇకపై నీకు కోపం వచ్చినప్పుడల్లా, ఎవరి మీదా అరవకుండా ఈ తలుపుకు ఒక మేకు కొడుతూ ఉండు అని చెప్పి, ఒక సుత్తె కొడుకు చేతిలో పెట్టాడు. సరే నాన్నా అని వెళ్లిపోయాడు రాము. కొన్ని రోజుల తర్వాత తండ్రి కొడుకులు ఇద్దరు ఆ తలుపు వద్దకు వచ్చి చూడగా, అది నిండా మేకులతో ఎంతో అందవిహీనంగా వికారంగా కనబడింది. దాన్ని కొడుక్కి చూపిస్తూ రాజయ్య ఇలా అన్నాడు 'చూసావా ఈ తలుపు లాగే నువ్వు కూడా కోపంతో అరుస్తున్నపుడు వికారంగా కనబడతావు' కాబట్టి కొంచెం కోపం తగ్గించుకో అన్నాడు.

అలాగే నాన్నా అని చెప్పి వెళ్లిపోయాడు రాము. కొన్నాళ్లకు రామును పిలిచి మరలా ఇలా చెప్పాడు రాజయ్య 'నువ్వు ఎవర్నైనా తిట్టి, మరలా వారికి క్షమాపణ చెప్పినప్పుడల్లా ఈ తలుపుకు కొట్టి ఉన్న మేకులలో నుంచి ఒక్కో మేకును ఊడదీయి అని చెప్పాడు. అలాగే నాన్నా అన్నాడు రాము. మరికొన్ని రోజుల తరువాత మరలా ఇద్దరూ ఆ తలుపు వద్దకు వచ్చారు. అపుడు రామును చూసి రాజయ్య ఇలా అన్నాడు మేకులన్నీ తొలగించినా కూడా తలుపు మొత్తం చిల్లులు పడి ఎంత అసహ్యంగా అయిపోయిందో చూసావా? అలాగే నువ్వు మొదట తిట్టి తరువాత క్షమాపణ చెబితే వాళ్ల మనసులో బాధ కూడా ఇలాగే ఉండిపోతుంది, పూర్తిగా మాసిపోదు' అన్నాడు ఆ రోజుతో తన తప్పు ఏమిటో అర్థం చేసుకున్న రాము ఆ మర్నాటినుండి అందరితో నెమ్మదిగా స్నేహంగా మసలుకోవడం అలవాటు చేసుకున్నాడు.

7 తేడాలను కనిపెట్టండి



ఎన్ని కుక్కలు ఉన్నాయి?



దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 395

			2					6
				3		4		
					6	1	2	8
	2			5		3		1
	5						6	
4		1		9			8	
5	8	6	3					
		7		1				
2					4			

సుడోకు - 394 సమాధానం

1	2	4	8	3	5	7	6	9
3	7	6	4	2	9	1	5	8
9	8	5	6	1	7	4	2	3
7	5	9	1	4	6	3	8	2
2	1	3	9	7	8	5	4	6
4	6	8	2	5	3	9	7	1
5	3	1	7	8	2	6	9	4
6	4	2	5	9	1	8	3	7
8	9	7	3	6	4	2	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.